ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విజయవాడ

: fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

3-4-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 61 పేజీలు: 10+4 వెల: 6.50


విదేశీ విద్యార్థులపై అమెరికా ఎఐ నిఘా

భారతీయ బిలియనీర్ మహిళగా సావిత్రి జిందాల్

5లో

# తిరుమలలో 100% ప్రక్షాళన

## ఏ స్థాయిలోను ఎవ్వరికీ మినహాయింపుల్లేవు..

## అభివృద్ధి పనుల పేరుతో డబ్బు యథేచ్ఛగా ఖర్చు చేయొద్దు

## టిటిడిలో మనం ధర్మకర్తలం, నిమిత్తమాత్రులం

## అలిపిరిలో భక్తుల కోసం బేస్‌క్యాంప్ నిర్మాణం: సిఎం చంద్రబాబు


బుధవారం సచివాలయంలో సిఎం చంద్రబాబుకు ప్రసాదం అందిస్తున్న టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు,ఇఒ శ్యామలరావు, ఎఇఒ చౌదరి

**విజయవాడ,ఏప్రిల్2,ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల తిరుపతి దేవస్థానం భక్తులకు అందించే సేవలు, సౌకర్యాల్లో 100 శాతం మార్పు కనిపించాలని, భక్తుల మనోభావాలకు, ఆలయ పవిత్రతకు పెద్దపీట వేసేలా ప్రతి కార్యక్రమం, నిర్ణయం ఉండాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. తిరుమల తిరుపతి దేవస్థానంపై సీఎం చంద్రబాబు సచివాలయంలో సమగ్రంగా సమీక్ష చేశారు. భక్తులకు అందించే సౌకర్యాలు మెరుగుపరిచేందుకు గత 9 నెలల కాలంలో తీసుకున్న చర్యలపై టీటీడీ అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. పెరుగుతున్న భక్తుల రద్దీ నేపథ్యంలో భవిష్యత్‌లో చేపట్టే చర్యలపై సీఎం సమీక్షించారు. దర్శనాలు, వసతితో పాటు వివిధ సేవలపై భక్తుల నుంచి సేకరించిన అభిప్రాయాలపైనా సమావేశంలో చర్చించారు. బ్రహ్మోత్సవాలు, రథసప్తమి, వైకుంఠ ఏకాదశి వంటి ప్రత్యేక సమయాలతో పాటు చేపట్టిన చర్యలు, వాటి ఫలితాలపై అధికారులు నివేదించారు. 9 నెలల కాలంలో శ్రీవారి లడ్డూ ప్రసాదం, అన్న ప్రసాదంలో తీసుకువచ్చిన మార్పులపై అధికారులు వివరించారు. గ్యాలరీల్లో సౌకర్యాల పెంపు, మరింత మంది భక్తులకు అవకాశం కల్పించేలా మాఢవీధులలో ఏర్పాట్లు, అలిపిరిలో భక్తుల కోసం బేస్ క్యాంప్ నిర్మాణం, శ్రీ పద్మావతీ అమ్మవారి దేవాలయం అభివృద్ధి ప్రణాళిక, అమరావతిలోని శ్రీవారి దేవాలయం అభివృద్ధి పనులు వంటి అంశాలపై సమీక్షలో సుదీర్ఘంగా చర్చించారు. తిరుమల ప్రతిష్ట పెంచడం, తిరుమల క్షేత్రాన్ని భక్తులకు మరింత దగ్గర చేయడం, సులభమైన, సౌకర్యవంతమైన సేవలకు సంబంధించి సీఎం పలు సూచనలు చేశారు. సమీక్ష సందర్భంగా టీటీడీ బోర్డు తీసుకున్న పలు నిర్ణయాలను, పలు ప్రతిపాదనలను అధికారులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. అలిపిరిలో భక్తుల కోసం బేస్ క్యాంప్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. 25వేల మందికి సౌకర్యవంతంగా ఉండేలా ఈ బేస్ క్యాంప్ నిర్మాణం చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. అదే విధంగా 60 అనుబంధ దేవాలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్న విషయాన్ని,రాష్ట్రం వెలుపల ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న శ్రీవారి ఆలయాల పురోగతిని వివరించారు. శ్రీవారి సేవకుల విషయంలో కొత్తవారు 90 శాతం మంది ఉంటున్నారని అధికారులు చెప్పగా సగం మంది పాతవారిని నియమించుకోవడం ద్వారా నాణ్యమైన సేవలు అందించవచ్చని తెలిపారు. తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి రోజుకు 25 వేల మంది వరకూ భక్తులువస్తారని అధికారులు తెలపగా దీనికి మరింత >>2



# ఎండియు వాహనాల కొనుగోలులో భారీ స్కాం

## గత ప్రభుత్వ హయాంలో జరిగిన భారీ కుంభకోణం

## ప్రమాణాలకు అనుగుణంగా వాహనాలు లేవు: మంత్రి నాదెండ్ల

**విజయవాడ ఏప్రిల్ 2 ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాంగ్రెప్‌పార్టీ ప్రభుత్వ హయాంలో ఎండీయూ వాహనాల కొనుగోలులో పెద్ద కుంభకోణం చోటు చేసుకుందని ఆయా సంస్థల ప్రమాణాలకు అనుగుణంగా వాహనాలు లేవని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గత ప్రభుత్వం తెచ్చిన ఈ వ్యవస్థ కారణంగా రాష్ట్రంలో పేదల బియ్యం ఎటు వెళ్తుందో, ఎంత వెళ్తుందో లెక్క తెలియని పరిస్థితి ఉందన్నారు. రేషన్ మాఫియాకు ఇదే ప్రధాన కారణమని వివరించారు. అక్రమాలపు జరుగుతున్నాయని తెలిసినా ఎలాంటి నిర్ణయంతీసుకోలేని పరిస్థితికి వైకాపా హయాంలోని ఒప్పందాలే కారణమని ఇప్పటికీ ఒక్కో వాహనానికి నెలకు రూ.27వేలు చెల్లిస్తున్నామని ఆయన ధ్వజమెత్తారు. బుధవారం సచివాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాదెండ్ల మనోహర్ మాట్లాడారు. రేషన్ కార్డులకు ఈ కేవైసీ ప్రక్రియ ఏప్రిల్ నెలాఖరుకు పూర్తవుతుంది. ఆ తర్వాత క్యూఆర్ కోడ్‌తో ఏటీఎం కార్డు తరహాలో కొత్త రేషన్‌కార్డులు ఇస్తాం. గత ప్రభుత్వంలో రేషన్‌కార్డుపై అప్పటి సీఎం జగన్ ఫోటో వేసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చే కార్డుపై సీఎం, ఇతరుల ఫోటోలేని ఉండవు అని చెప్పారు. పౌరుగుసేవల ఉద్యోగులకు రేషన్‌కార్డుల వ్యవహారంపై మంత్రివర్గ సమావేశంలో చర్చించామని దీనిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. 2023-24 ఖరీఫ్‌లో వైకాపా ప్రభుత్వం 29 లక్షల టన్నుల ధాన్యం మాత్రమే సేకరించగా కూటమి ప్రభుత్వ హయాంలో 2024-25 ఖరీఫ్‌లో >>2

# అమరావతి చిత్రకళ వీధికి సిఎం మద్దతు

**విజయవాడ,ఏప్రిల్2,ప్రభాతవార్తప్రతినిధి:** రాజమండ్రిలో ఏప్రిల్ 4 న జరగనున్న అమరావతి చిత్రకళ వీధి కార్యక్రమానికి తన మద్దతును ప్రకటిస్తూ, అమరావతి" అంశంపై రూపొందిన చిత్రలేఖనానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన కుంచెతో రంగులు వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కళను ప్రోత్సహించేందుకు, సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించేందుకు ప్రాధాన్యతను ఇస్తుందన్నారు.ఇదే విషయాన్ని అమరావతి చిత్ర కళావీధి ప్రతిబింబించిందన్నారు. ఎన్‌డిఏ ప్రభుత్వం హయాంలో కళాకారులు మరియు సాంస్కృతిక వారసత్వం పరిరక్షించబడతాయి, ప్రోత్సహించబడతాయి, అలాగే గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లబడతాయి అని స్పష్టం చేశారు.అమరావతి చిత్రకళ వీధి వంటి వేదికల ద్వారా కళాకారుల ప్రతిభను ప్రదర్శించే అవకాశాన్ని అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయపడుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు >>2

# వచ్చే ఐదేళ్లలో 20వేల స్టార్టప్‌లు

## నూతన ఆవిష్కరణలకు ఎపిని వేదిక చేస్తాం

## రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో భాగస్వాములు కండి

## పారిశ్రామికవేత్తలు, మేధావులకు సిఎం చంద్రబాబు పిలుపు

**విజయవాడ,ఏప్రిల్ 2,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ని తీర్చిదిద్దేందుకు.వన్ ఫ్యామిలీవన్ ఎంట్రప్రెన్యూర్ సంకల్పాన్ని నిజం చేసేందుకు పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ సంస్థలు, ప్రొఫెసర్లు, మేధావులు ముందుకురావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ నుంచి కొత్తగా పారిశ్రామిక వేత్తలు రావాలని, నూతన ఆవిష్కరణలకు ఏపీ హబ్ కావాలని, అదే స్థాయిలో పెట్టుబడులు కూడా ఆశిస్తున్నామని అన్నారు. అందిరిలో స్ఫూర్తి నింపేందుకే ఇన్నోవేషన్‌కు హబ్‌కు రతన్ టాటా వంటి గొప్ప వ్యక్తి పేరు పెట్టామని చెప్పారు.బుధవారం సచివాలయంలో పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు, విద్యావంతులతో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ గురించి ముఖ్యమంత్రి సమావేశం అయ్యారు. ఆర్టీఐహెచ్ వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న టాటా గ్రూపు, టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ సహా మరికొందరు ప్రముఖులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.

నాటి సంస్కరణలతో సత్ఫలితాలు భారతీయులు దేశవిదేశాల్లో ఎంట్రప్రెన్యూర్లుగా ఎదిగారని, అలాగే తలసరి ఆదాయంలోనూ విదేశీయులు కన్నా ఎక్కువ ఆర్జిస్తున్నారని, వారిలో 30 శాతం తెలుగు ప్రజలు ఉన్నందుకు తనకు గర్వంగా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. నిజానికి ఇప్పుడు తెలుగు ప్రజలు ఈ స్థాయికి చేరుకోవడానికి తాను మొదటిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు తీసుకువచ్చిన సంస్కరణల ఫలితమని చెప్పారు. సీఐఐ సమావేశాలు నిర్వహించడం, ఇంజినీరింగ్ కాలేజీలు నెలకొల్పడం, మైక్రోసాఫ్ట్ సహా ప్రముఖ కంపెనీలు ఏర్పాటయ్యేలా చూడటంతో హైదరాబాద్ దశ దిశ మారిపోయిందన్నారు. నాడు హైదరాబాద్‌ను ఐటీ హబ్ చేసినట్టుగానే, ఇప్పుడు అమరావతిని క్వాంటమ్ వ్యాలీ చేయాలనేది తన సంకల్పంగా చెప్పారు. అలాగే వన్ ఫ్యామిలీ వన్ ఐటీ ప్రొఫెషనల్ అని గతంలో తాను చేసిన ప్రయత్నాలు మంచి ఫలితాలు ఇచ్చాయని గుర్తు చేశారు. భారతీయులు ఎక్కడ ఉన్నా ఆయా ప్రాంతాలను, అక్కడ పరిస్థితులను ఆకళింపు చేసుకుని ప్రతిభతో రాణిస్తున్నారని అన్నారు. దూరం అనేది ప్రపంచంలో ఒక సమస్య కాదన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపు అడుగులు వేశామన్నారు.

**పీ4లో భాగస్వాములు అవ్వండి:** గతంలో తమ ప్రభుత్వం పీ3 కార్యక్రమాన్ని చేపట్టిందని దాంతో కొన్ని కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయని ఈసారి జీరో పావర్టీపీ4 కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్టు ముఖ్యమంత్రి చెప్పారు. సమాజంలో ఉన్నత వర్గాలు, అట్టడుగున ఉన్న పేదలకు అండగా నిలవడమేనని అన్నారు. అంబేద్కర్, అబ్దుల్ కలాం వంటి వారు ఇతరుల సహాయంతోనే పైకి వచ్చారని ముఖ్యమంత్రి వివరించారు. మీరందరూ కూడా సమాజంలో సమానతల కోసం, పేదరిక నిర్మూలనకు కదిలిరావాలని,అందరూ పీ4 కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.

**ఇంటికో ఎంట్రప్రెన్యూర్ మంచి ఆలోచన:** వన్ ఫ్యామిలివన్ ఎంట్రప్రెన్యూర్, జీరో పావర్టీపీ4 కార్యక్రమాలు ఎంతో ఉన్నతమైనవని ముఖ్యమంత్రి ఆశయంపై సమావేశానికి హాజరైన పలువురు హర్షం వ్యక్తం చేశారు. మరోవైపు వచ్చే ఏడాది కల్లా అమరావతిలో బిట్స్ పిలానీ క్యాంపస్ ఏర్పాటు చేసి ఫస్ట్ బ్యాచ్ అడ్మిషన్లు చేపడతామని బిట్స్ పిలానీ వైస్ చాన్సలర్ వి.రామగోపాలరావు, అలాగే అమరావతి క్వాంటమ్‌వ్యాలీలో కూడా తాము భాగస్వామి కావాలనుకుంటున్నామని చెప్పారు.విశాఖపట్నంలో జీఎంఆర్ ఐటీఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటుచేస్తామని జీఎంఆర్‌సంస్థల అధినేత అన్నారు.

**వచ్చే 5 ఏళ్లలో 20,000 స్టార్టప్‌లు :** వచ్చే ఐదేళ్లలో 20,000 స్టార్టప్‌లు ఏర్పాటు అయ్యేలా చూడాలనేది ప్రభుత్వ లక్ష్యం. దీంతో లక్ష మందికి ఉద్యోగాలు లభిస్తాయి. 10 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు వస్తాయి. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌గా అమరావతి ఉంటుంది. దీనికి గ్రూపు లీడర్‌గా టాటా గ్రూపు ఉంటుంది. ఎల్ అండ్ టీ, ఎఎంఎన్‌ఎస్ పార్టనర్లుగా వ్యవహరిస్తాయి.అమరావతి హబ్‌కు రాష్ట్రంలో 5 స్పోక్స్ అనుబంధంగా ఉంటాయి. >>2

# పెరిగిన జిఎస్టీ నికర వసూళ్లు

## గతేడాది కంటే 8.3% అధికం

**విజయవాడ ఏప్రిల్ 2 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో జీఎస్టీ వసూళ్ళు పెరిగాయి. గత ఏడాదితో పోల్చితే, ఈ ఏడాది మార్చిలో జీఎస్టీ నికర వసూళ్ల 8.35% ఎక్కువగా నమోదైనట్లు రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ బాబు.ఎ వెల్లడించారు. ఈ ఏడాది మార్చిలో జీఎస్టీ నికర వసూళ్ల రూ.3116 కోట్లకు చేరుకున్నాయి. గత 11 నెలల్లో ఇదే అత్యధికం. 2024 మార్చితో పోల్చితే, ఈ ఏడాది మార్చిలో జీఎస్టీ నికర వసూళ్ల 8.35% ఎక్కువగా నమోదైనట్లు రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ బాబు.ఎ వెల్లడించారు. ఆర్థిక సంవత్సరానికి సంచిత నికర రెవెన్యూ వసూళ్ల 5.09% పెరిగాయి. వ్యూహాత్మక, మెరుగైన విధానాల అమలు ద్వారా 2025 మొదటి త్రైమాసికంలో జీఎస్టీ వసూళ్లలో మంచి వృద్ధి కనిపించింది. 2017 లో ఏపీ జీఎస్టీ చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి మార్చి నెలకు సంబంధించిన నికర జీఎస్టీ వసూళ్లలో ఈ ఏడాది మార్చిలోనే >>2

# గాలికి ఎగిరిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్



## రెడ్‌బుక్ రాజ్యాంగం అరాచకాలకు భయపడం

## పార్టీ నేతలతో మాజీ సిఎం జగన్

**విజయవాడ,ఏప్రిల్2,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి పాలనలో సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ గాలికెగిరిపోయాయని ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ఆరోపించారు.రాష్ట్రంలో రెడ్ బూక్ రాజ్యాంగం పేరిట అరాచక పాలన సాగుతుందన్నారు.ఎవ్వరు భయపడవద్దు,మీ భరోసాగా నేనుంటానన్నారు.నాతో సహా నన్ను వెన్నంటి ఉన్నావారంతా వెన్ను చూపని వ్యక్తులన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశమైన మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మాట్లాడుతూ మేనిఫెస్టో హామీలు మోసాలుగా మిగిలాయి చంద్రబాబు ప్రతి అడుగులోనూ మోసం, అబద్దాలు కనిపిస్తున్నాయి విద్య, వైద్యం, ఆరోగ్య రంగాలను నాశనం చేశారు పారదర్శకతకు పాతరేశారు కూటమి పాలనపై ధ్వజమెత్తిన జగన్ ఇవాళ మీ అందరినీ చూస్తుంటే చాలా గర్వంగా ఉంది. కారణం రాజకీయాలలో ఎప్పుడూ విలువలు, విశ్వసనీయత ఉండాలని చాలా గట్టిగా నమ్మిన వ్యక్తిని నేను. నేను అలాగే ఉంటాను. పార్టీ కూడా అలాగే ఉండాలని మొట్టమొదట నుంచి ఆశించాను. మీ అందరూ చూపించిన తెగువకు, స్ఫూర్తికి మీ అందరికీ హేట్సాఫ్. మొన్న జడ్పీ,ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కో ఆప్షన్ సభ్యులు, ఉప సర్పంచ్ స్థానాలు కలిపి దాదాపు 57 చోట్ల ఉప ఎన్నికలు జరిగితే 7 చోట్ల అధికార పార్టీకి గెలిచే పరిస్థితి లేక ఎన్నికలు వాయిదా వేశారు.మరో 50 చోట్ల వాయిదా వేసే పరిస్థితి లేకపోవడంతో ఎన్నికలు జరిపారు. అలా నిర్వహించిన 50 స్థానాలకు గానూ 39 చోట్ల వైయస్సార్సీపీ కార్యకర్తలు గొప్పగా తెగింపు చూపించి గెలిచారు. ఆశ్చర్యం కలిగించే విషయం ఏమిటంటే అసలు తెలుగుదేశం పార్టీకి ఎక్కడా కూడా కనీసం గెలవడానికి కావాల్సిన సంఖ్యాబలం లేదు. గెలవడానికి కావాల్సిన సంఖ్యాబలం లేకపోయినా సరే... ఈ మాదిరిగా మభ్యపెట్టి, భయపెట్టి, ఆందోళనకు గురిచేసి, ప్రలోభాలు పెట్టి.. ఏకంగా పోలీసులను వాడుకుని దౌర్జన్యాలు చేస్తూ ఎన్నికలు నిర్వహించారు. ఇన్నేళ్లు ముఖ్యమంత్రిగా చేశానని చెప్పుకునే చంద్రబాబుకు నిజంగా బుద్ధీ జ్ఞానం రెండూ లేవు. ప్రజాస్వామ్యంలో మనకు బలం లేనప్పుడు ఎవరైనా పోటీ చేయకుండా హుందాగా వదిలేయాలి. కానీ చంద్రబాబు అలా చేయకుండా నేను ముఖ్యమంత్రిని, నా పార్టీ అధికారంలో ఉంది కాబట్టి నాకు బలం ఉన్నా లేకపోయినా ప్రతి పదవీ నాకే కావాలి, ఎవరినైనా నేను భయపెడతాను, కొడతాను, చంపుతాను, ప్రలోభపెడతాను అని అహంకారంతో వ్యవహరిస్తున్న తీరును మనం చూస్తున్నాం. ఇది ధర్మమేనా? న్యాయమేనా? అన్నది రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలి.చంద్రబాబు పాలనలోకి వచ్చి దాదాపు 11 నెలలు అవుతుంది. ఎక్కడైనా నాయకుడు అనేవాడు ఎలా ఉండాలంటే తాను చేసిన మంచి పనిని చూపించి.. నేను ఈ మంచి పని చేశాను అని ప్రజల దగ్గరకు ధైర్యంగా వచ్చి, చిరునవ్వుతో వారి ఆశీర్వాదం తీసుకునేటట్టు ఉండాలి. కానీ చంద్రబాబు పాలనలో సూపర్ సిక్స్.. సూపర్ సెవెన్ గాలికి ఎగిరిపోయాయి. మోసాలుగా మిగిలాయి. ఎన్నికల మేనిఫెస్టోలో 143 హామీలతో కూటమి పార్టీలు ప్రజలను మభ్యపెట్టి ప్రతి ఇంటికి వాళ్ల కార్యకర్తలు పంపించి పాంప్లెట్లు పంచారు. ప్రతి ఒక్కరికీ చంద్ర బాబు బాండ్లు పంపించాడని ప్రలోభపెట్టి ఎన్నికల్లో గెలిచారు. గెల్చిన తర్వాత చంద్రబాబు చెప్పిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ లు ఏమయ్యాయని ఎవరైనా అడగడానికి >>2

# ఆసుపత్రిలో పాక్ అధ్యక్షుడు జర్దారీ

**ఇస్లామాబాద్, ఏప్రిల్ 2:** పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలి జర్దారి ఆరోగ్యం క్షీణించింది. కరాచీలోని ప్రైవేటు ఆసుపత్రిలో ఆయన్ను చేర్పించారు. కరాచికి సుమారు 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న నవాబ్‌షానుంచి జర్దారీని ఆసుపత్రికి తరలించారు. రెండురోజులక్రితమే ఆయన ఆసుపత్రిలో చేరినట్లు అక్కడి స్థానికులు చెపుతున్నారు. జర్దారి వయసు ప్రస్తుతం 69 ఏళ్లు, జ్వరం, ఇన్‌ఫెక్షన్‌నుంచి ఆయన బాధపడుతున్నారు. సోమవారం అర్ధరాత్రి ఆయన్ను ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ నాయకుడు అయిన జర్దారికి ప్రస్తుతం వైద్యపరీక్షలు చేస్తున్నారు. అలాగే ఆసుపత్రి వద్ద భద్ర తను కూడా పెంచారు. ఆదివారం నవాబ్‌షాలో ఉన్న జర్దారి >>2


బుధవారం ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న జనసేన నేత నాగేంద్రబాబు

# ఐదుగురు ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం

**సచివాలయం,ఏప్రిల్ 2,ప్రభాతవార్త:** ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలికి ఎంపికైన ఐదు గురు శాసనమండలి సభ్యులు సోము వీర్రాజు, బిటి నాయుడు, కొణిదల నాగేంద్రరావు (నాగ బాబు) పేరాబత్తుల రాజశేఖర్,ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌లచే బుధవారం రాష్ట్ర అసెంబ్లీ భవనం లోని చైర్మన్ చాంబర్‌లో రాష్ట్ర శాసన మండలి అధ్యక్షులు కొయ్యే మోషేక్‌రాజు సభ్యులచే శాసన మండలి సభ్యులుగా ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు,అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్, ఉప కార్యదర్శి రాజ్‌కుమార్, ఇతర అధికారులు, పలువురు ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇంటివద్దే 47 రకాల వైద్య పరీక్షలు

## ప్రజారోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం వినూత్న నిర్ణయం

## 104, 108 సేవలకు కొత్త సర్వీసు ప్రొవైడర్

**విజయవాడ,ఏప్రిల్2,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజారోగ్య పరిరక్షణ కోసం కూటమి ప్రభుత్వం వినూత్న నిర్ణయం తీసుకుంది.ఇప్పటి వరకూ సమస్యాత్మకంగా కొనసాగుతున్న 104, 108 సేవలకు జవసత్వాలు కల్పించి ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ సేవల్ని అందిస్తున్న ప్రస్తుత సర్వీస్ ప్రొవైడర్ స్థానంలో ప్రభుత్వం కొత్త ఏజెన్సీని గుర్తించింది. ఈ ప్రక్రి యలో భాగంగా దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రజల ఆరోగ్య స్థితి నిర్ధారణకు 47 రకాల డయాగ్నోస్టిక్ పరీక్షల్ని 104 వాహనాల ద్వారా ఉళ్లల్లోనే పరీక్షలు చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. M/s. భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సాంఘ్యంలో M/s. SRIT ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌ను భాగస్వామిగా ఉన్న కన్సార్టియంను ఇకనుంచి ఈ సేవల్ని అందించే ఏజెన్సీగా టెండరు ప్రక్రియ ద్వారా ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్ర ప్రజల వ్యక్తిగత ఆరోగ్య స్థాయి వివరణాత్మక ప్రొఫైలింగ్ ద్వారా ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డుల్ని(ఎబిహెచ్) రూపొందించడానికి ఈ పరీక్షల్ని చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని ద్వారా రాష్ట్రంలో ప్రస్తుత , భవిష్యత్తు వ్యాధుల భారాన్ని అంచనా వేయడం వీలవుతుంది. తద్వారా అవసరాలకనుగుణంగా ప్రభుత్వం తగు చర్యల్ని చేపట్టడానికి మార్గం ఏర్పడుతుంది. ప్రస్తుతం 104 అంబులెన్స్‌ల ద్వారా కేవలం మధుమేహం మరియు బీపీ వ్యాధుల్ని గుర్తించడానికి మాత్రమే ఖిర్యాపిడ్ కిట్‌ఖి పరీక్షలు చేస్తున్నారు. దీనికి భిన్నంగా నూతన విధానంలో నిర్దిష్ట ఫలితాలనిచ్చే 47 రకాల పరీక్షలు చేయడం జరుగుతుంది. బ్లడ్ గ్లూకోజ్ టెస్ట్, కంప్లీట్ బ్లడ్ పిక్చర్, రీనల్ ఫంక్షన్ టెస్ట్‌లు, లివర్ ఫంక్షన్ టెస్ట్‌లు, కంప్లీట్ లిపిడ్ ప్రొఫైల్, యూరిన్ అనాలిసిస్, ఆర్టీరియల్ బ్లడ్ గ్యాస్ లకు సంబంధించి 20 పరీక్షలు లబ్ధి దారులకు చేయడం జరుగుతుంది నిర్దిష్ట వ్యాధులకు సంబంధించి మరో 27 పరీక్షల్ని చేస్తారు. కొత్తగా ఈ సేవల బాధ్యతలను స్వీకరించనున్న సర్వీస్ ప్రొవైడర్ సాధారణ 20 పరీక్షల్ని ఒక్కొక్కరికి రూ.195 ఖర్చుతో చేయడానికి అంగీకరించింది. అంతే కాక ఇతర వ్యాధి పరీక్షలకు కూడా మార్కెట్ రేట్లతో పోలిస్తే సహేతుకమైన ఛార్జీలను ప్రతిపాదించారు. ప్రతి 104 వాహనం ద్వారా రోజుకు దాదాపు 35 మందిని పరీక్షిస్తారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే ముందు మొబైల్ మెడికల్ యూనిట్ల డేటా యొక్క విశ్వసనీయతను తనిఖీ చేసేందుకు ఈ నిర్ధారణ పరీక్షల్ని పైలట్ ప్రాతిపదికన ప్రభుత్వం చేపడుతుంది. ఈ పరీక్షలు నిర్వహించడానికి కొత్త ఏజెన్సీ ఆయా పరికరాల్ని ప్రతి 104 వాహనంలో సెమీఆటోమేటిక్ బయోకెమిస్ట్రీ ఎనలైజర్, సిబిసి మెషిన్ 3పార్ట్ ఎనలైజర్, మైక్రోస్కోప్ మరియు ఇంక్యుబేటర్ వంటి పరికరాలను ఏర్పాటు చేస్తారు. ప్రతి వాహనం >>2



టీటీడీ అభివృద్ధి చర్యలు,అమరావతి వెంకటేశ్వరస్వామి ఆలయాల నమూనాలను సీఎం చంద్రబాబుకు చూపిస్తున్న కార్యనిర్వహణాధికారి శ్యామలరావు

# తిరుమలలో 100% ప్రక్షాళన

>> అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. బర్డ్ ఆసుపత్రికి డైరెక్టర్ నియామకం, జేఈవో, సివిఎస్‌వో, ఎస్వీబీసీ ఛైర్మన్ నియామకాలను త్వరలో చేపడతామని సీఎం చెప్పారు. టీటీడీ నుంచి 15 రకాల సేవలు వాట్సాప్‌లో అందిస్తామని అధికారులు చెప్పగా...వెంటనే వాట్సాప్ సేవలు ప్రారంభం కావాలని సీఎం సూచించారు. ప్రతి సేవకు ఆధార్, సెల్ ఫోన్ నెంబర్‌ను లింక్ చేయడం ద్వారా ఎక్కడా అక్రమాలు జరగకుండా ఉండటానికి అవకాశం ఉంటుందని సీఎం చెప్పారు. మరోవైపు పారిశుధ్య నిర్వహణపైనా దృష్టి పెట్టాలని సిఎం అన్నారు. తిరుమలలో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. టీటీడీ పరిధి మొత్తం 2,675 హెక్టార్లలో విస్తరించి ఉండగా ఇందులో ప్రస్తుతం 68.14 శాతం పచ్చదనం ఉంది. దీనిని 80 శాతానికి తీసుకువెళ్లాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ "తిరుమల దేవాలయంలో సేవలు బాగుంటే ప్రభుత్వానికే మంచి పేరు వస్తుంది. గత ప్రభుత్వానికి నేటికీ ఇప్పటికే మార్పు కనిపించింది. అయితే ఆ మార్పు 100 శాతం ఉండాలి. అప్పుడే భక్తులు, ప్రజలు అంచనాలను మనం అందుకోగలం. పెరుగుతున్న రద్దీ నేపథ్యంలో వచ్చే 50 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా టీటీడీని తీర్చిదిద్దాలి. ఏ పనులు అవసరమో ఆ పనులు మాత్రమే చేయాలి. శ్రీవారి డబ్బులు ఇష్టారీతిన ఖర్చు పెట్టవద్దు...మనం దేవాలయానికి ధర్మకర్తలం, నిమిత్తమాత్రులం మాత్రమే. శ్రీవారికి భక్తులు ఇచ్చే కానుకల సొమ్మును ఇష్టారీతిన ఖర్చుపెట్టే అధికారం ఎవరికీ లేదు. ఏడుకొండల వాడి సొమ్ము ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాకూడదు. వందల కోట్ల నిధులను అనేక కార్యక్రమాలకు టీటీడీ ఖర్చు చేస్తోంది..దీనిపై ఇంటర్నల్ ఆడిటింగ్ తో పాటు....కాగ్ ద్వారా ఆడిట్ జరిపితే మంచిది. భక్తులు ఇచ్చే విరాళం, విరాళాలు ప్రతి రూపాయిని సక్రమంగా ఖర్చు అవ్వాల్సిన అవసరం ఉంది. జవాబు దారీతనం ఉండాలి" అని సిఎం స్పష్టం చేశారు. ప్రక్షాళన అనేది 100 శాతం జరగాల్సిందే..."దీనిలో మినహాయింపులు లేవు" అని సిఎం అధికారులకు సూచించారు. టీటీడీ సేవలపై సంతృప్తి వ్యక్తం చేసారు. రథసప్తమి, వైకుంఠ ఏకాదశి వంటి ప్రత్యేక సందర్భాల్లో తిరుమలలో టీటీడీ అందించిన సేవలపై ఫీడ్‌బ్యాక్ సర్వేలో భక్తుల నుంచి అత్యధిక స్థాయిలో సంతృప్తి వ్యక్తమైందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రథసప్తమి రోజున భక్తుల రద్దీ క్రమబద్ధీకరణ, అన్నప్రసాదం, పరిశుభ్రత, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర అన్ని అంశాలపై 76 శాతం మంది భక్తులు ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయని చెప్పగా, మరో 22 శాతం మంది బావున్నట్టు వెల్లడించారు. కేవలం 1 శాతం పర్వాలేదని, 1 శాతం మంది మాత్రమే బాగోలేదని తెలిపారు. వైకుంఠ ఏకాదశి రోజు 74 శాతం మంది భక్తులు ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయని చెప్పగా, మరో 22 శాతం మంది బావున్నట్టు వెల్లడించారు. కేవలం 3 శాతం పర్వాలేదని, 1 శాతం మంది మాత్రమే బాగోలేదని తెలిపారు.

మార్చి 9 నుంచి 14 వరకు సాధారణ రోజుల్లో తిరుమల వచ్చిన భక్తుల నుంచి ఐవీఆర్ఎస్ విధానంలో చేసిన సర్వేలోనూ అత్యధిక స్థాయి సంతృప్తి వ్యక్తమైంది. క్యూలైన్ నిర్వహణ, సౌకర్యాలపై 65 శాతం మంది బాగుంది అని చెప్పగా, 28శాతం పర్వాలేదని, 7 శాతం మంది బాగోలేదని సమాధానం ఇచ్చారు. అలాగే వసతి, శుభ్రత బాగుందని 74 శాతం, పర్వాలేదని 19 శాతం, బాగోలేదని 7 శాతం మంది చెప్పారు. లడ్డు రుచినాణ్యత బావుందని 77 శాతం, పర్వాలేదని 17 శాతం, బాగోలేదని 6 శాతం మంది చెప్పారు. ఇంకా అన్నదానం, కళ్యాణకట్ట, టీటీడీ ఉద్యోగుల ప్రవర్తన, లగేజ్ కలెక్షన్&డెలివరీ వంటి అంశాలపైనా ఇదే స్థాయిలో అభిప్రాయాలు వెల్లడించారు. మొత్తంగా ఐవీఆర్ఎస్ సర్వేలో 61 శాతం మంది భక్తులు టీటీడీ సేవలు బావున్నాయని మెచ్చుకున్నారు. 27 శాతం పర్వాలేదన్నారు. 12 శాతం మంది బాగోలేదన్నారు. అమరావతి రాజధానిలోని వెంకటపాలెంలో నిర్మించిన శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేయనున్నారు.మట్టూ ప్రాకారం నిర్మాణంతో పాటు ఒక రాజగోపురం, మూడు గోపురాలు నిర్మించనున్నారు.దీనికి సంబంధించి త్వరలోనే టెండర్లు పిలుస్తారు. అలాగే ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయాన్ని విస్తరణ పనులతో పాటు సుందరంగా తీర్చిదిద్దనున్నారు. కరీంనగర్, కొడంగల్, నవీ ముంబై, బాంద్రా, ఉలుందుర్పేట, కోయంబత్తూరులో చేపట్టిన శ్రీవారి ఆలయాల నిర్మాణంఅభివృద్ధి కార్యక్రమాలపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సమీక్షలో దేవాదాయ శాఖమంత్రి ఆనం రామ్ నారాయణ రెడ్డి,టీటీడీ ఛైర్మన్ బిఆర్ నాయుడు,ఈవో శ్యామలరావు, అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి,చీఫ్ విజిలెన్స్అధికారి, తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.



పారిశ్రామికవేత్తలు, విద్యావంతుల సమావేశం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ గురించి వివరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

# వచ్చే ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లు

>> స్పోక్స్ లీడ్‌పార్టనర్లుగా అనంతపురానికి జెఎస్‌డబ్ల్యు, తిరుపతికి అదానీ గ్రూపు, విజయవాడకు మేఘా గ్రూపు, రాజమహేంద్రవరానికిగ్రీన్‌కో, విశాఖపట్నానికిజీఎంఆర్ గ్రూపు వ్యవహరిస్తాయి. ఆర్టీ ఐహెచ్‌లో ఇంక్యుబేటర్, ఎంఎస్ఎంఈ ఫెసిలిటేషన్ సెంటర్, బ్యాంకింగ్ లింకేజ్, ట్రైనింగ్, వీసీ ఫండింగ్ హ్యాండ్ హోల్డింగ్, సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్, హైపెర్ఫార్మెర్స్ కంప్యూటింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, మార్కెట్ లింకేజ్, రా మెటీరియల్ సోర్సింగ్ సపోర్ట్, ప్రోటోటైపింగ్ సెంటర్, ఔట్ డేటింగ్ టెస్టింగ్ ట్రాక్స్, హైస్పీడ్ ఇంటర్నెట్ ఉంటాయి.

# ఎండియు వాహనాల కొనుగోలులో భారీ స్కాం

>> 5.60 లక్షల మంది రైతుల నుంచి 35.93 లక్షల టన్నుల ధాన్యం సేకరించాం. ధాన్యం అమ్మిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో రూ.8279 కోట్లు జమ చేశాం. రబీ 10 లక్షల టన్నుల సేకరణ లక్ష్యంగా నిర్ణయించాం. ఏప్రిల్ 1 నుంచి కొనుగోలు చేపట్టాం అనిమనోహర్ తెలిపారు. దీపం -2 పథకం కింద రెండో ఉచిత సిలిండర్‌కు బుకింగ్ ప్రారంభమైందని మనోహర్ వెల్లడించారు. మార్చి 31వ తేదీ నాటికి రాష్ట్రంలో 99,03,000 మందికి ఉచిత సిలిండర్ అందించాం. రూ.760 కోట్లు ఖాతాల్లో జమ చేశాం. కొత్తగా 2 లక్షల కనెక్షన్లు ఇచ్చాం. రెండో సిలిండర్ లబ్ధిదారుల సంఖ్య కోటికి చేర్చాలని లక్ష్యంగా నిర్ణయించాం అని పేర్కొన్నారు. జూన్ నుంచి మధ్యాహ్న భోజనం, వసతిగృహ విద్యార్థులకు సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు వివరించారు.

# ఇంటివద్దే 47 రకాల వైద్య పరీక్షలు

>> లో ఒక ల్యాబ్ టెక్నీషియన్‌ను కూడా ఉంటారు. 108 మరియు 104 సేవలతో పాటు అత్యవసర ప్రతిస్పందన కేంద్రాన్ని (EMERGENCY RESPONSE CENTRE) నిర్వహించడానికి ప్రభుత్వం ప్రస్తుతం నెలకు రూ.28 కోట్లు చెల్లిస్తోంది. కొత్త టెండర్ కింద ఈ ఖర్చు నెలకు రూ.31 కోట్లకు చేరుతుంది. ఇది టెండర్ ధరలో కేవలం 11 శాతం లోపు మాత్రమే పెరుగుదల.ఈ పెరుగుదలకు ప్రధాన కారణం ప్రధానంగా కొత్త ఏజెన్సీ 190 కొత్త 108 వాహనాల్ని ఖరీదు చేసి ఏర్పాటు చేయడం. మొత్తమ్మీద 731 వాహనాలు 108 సేవల్ని అందిస్తాయి. సేవల ధర స్వల్పంగా పెరగడానికి పెరిగిన ఇంధన ధరలు, సిబ్బందికి వేతనాలు కూడా కొంతమేరకు కారణం. 2020 సంవత్సరంలో ప్రస్తుతం అమలులో ఉన్న టెండర్ ఖరారు చేసినప్పుడు డీజిల్ ధర లీటరుకు రూ.70 మాత్రమే ఉండగా, ఇప్పుడది లీటరుకు 97 రూపాయల 47 పైసలకు పెరిగింది ఉంది. 108 అంబులెన్స్‌ల డ్రైవర్లకు, నెలకు రూ.2,000 అదనంగా చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ద్రవ్యోల్బణంతో పాటు పెరిగిన పరికరాల ధరలు, వాహనాల నిర్వహణ ఖర్చులు కూడా ఇతర కారణాలు108 సేవలకు సంబంధించి, సర్వీస్ ప్రొవైడర్‌కు రెండు కొత్త షరతులు పెట్టారు. ఇందులో ఒకటి కాల్ వచ్చిన ప్పటి నుండి రోగిని ఒక గంటలోపు ఆసుపత్రికి తీసుకెళ్లాలి. దీనిని ఖిగోల్డెన్ అవర్ఖి అని అంటారు. రెండోది ఎటువంటి అత్యవసర కాల్స్‌ను స్వీకరించకుండా వుండకూడదు. ఈ సేవల్ని అందిస్తున్న ప్రస్తుత సంస్థ రోజుకు దాదాపు 200ఎమెర్జెన్సీ కాల్స్‌ను నిర్లక్ష్యం చేసిన నేపథ్యంలో ఈ షరతుల్ని పొందుపర్చారు.

# ఆసుపత్రిలో పాక్ అధ్యక్షుడు జర్దారీ

>> హౌస్‌లో ఆయన ఈద్‌ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆసిఫ్ ఆలీ జర్దారి ఆరోగ్యం ఇటీవల ఆందోళనకరంగా మారింది. 2024లో ఆయన ఒక విమానం దిగబోతూ కిందపడిపోయారు. ఆ సమయంలో ఆయన పాదానికి ఫ్రాక్చర్ అయింది. దానివల్ల ఆయన చైనా పర్యటనను కూడా రద్దుచేసుకోవాల్సి వచ్చింది.

# గాలికి ఎగిరిన

>> ధైర్యం చేస్తే.. ఆ స్వరం కూడా వినిపించకుండా చేయాలని తాపత్రయపడుతున్నారు. అంతే తప్ప ఆ హామీలు నెరవేర్చాలని కాని, ప్రజలకిచ్చిన మాట నెరవేర్చాలని కానీ చంద్రబాబు అడుగుల్లో కనిపించడం లేదు. ప్రతి అడుగులోనూ మోసం, పాలనలో అబద్ధాలే కనిపిస్తున్నాయి. సూపర్ సిక్స్ లు, సూపర్ సెవెన్ లు గాలికెగిరిపోయి.. మోసాలుగా కనిపిస్తున్నాయి. చివరకు చంద్రబాబు ప్రభుత్వం రాక మునుపు మీ జగన్ పాలనలో వైయస్సార్సీపీ ప్రభుత్వం హయాంలో ప్రతి నెలా ఏదో ఒక బటన్ నొక్కే పరిస్థితి ఉండేది. ప్రతి ఒక్కరికీ ఏదో ఒక మేలు జరిగింది. నాలుగువేళ్లు నోట్లోకి పోయేయి. చంద్రబాబు వచ్చిన తర్వాత నాలుగు వేళ్ల నోట్లోకి పోవడం మాట అటుంచి.. ఉన్న ప్లేటును కూడా తీసేశాడు. 104, 108 అంబులెన్సులు గురించి చెప్పాల్సిన పనిలేదు. వ్యవసాయం గురించి అందరికీ తెలిసిందే. ఒక్క పంటకూ గిట్టుబాటు ధర లేదు. రైతన్న పూర్తిగా దళారులకు అమ్ముడుపోయి వ్యవసాయం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పెట్టుబడి సహాయం కింద జగన్ పీఎం కిసాన్ తో కలిపి రూ.13,500 ఇస్తున్నాడు. మేం వస్తే పీఎం కిసాన్ కాకుండా రూ.20 వేలు ఇస్తామని నమ్మబలికాడు. చంద్రబాబు వచ్చిన తర్వాత జగన్ ఇచ్చిన అమౌంట్ లేదు. బాబు ఇస్తామన్నది కూడా లేదు. మరోవైపు ఆర్బీకేలన్నీ నిర్వీర్యం అయిపోయాయి. ఉచిత పంటలబీమా పూర్తిగా ఎత్తివేశాడు. ఇన్ పుట్ సబ్సిటీ లేదు. రైతులకు పెట్టుబడి సాయం కింద డబ్బులు లేకపోగా.. వారు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేనిపరిస్థితుల్లో రాష్ట్రం ప్రయాణం చేస్తోంది. మరోవైపు వాలంటీర్ వ్యవస్థ లేదు. పారదర్శకత లేదు. స్కీములూ లేవు. ఉన్నదల్లా రెడ్ బుక్ రాజ్యాంగమే. విచ్చల విడిగా అవినీతి జరుగుతోంది. పోలీసులను అధికార పార్టీ కాపలాదారులుగా వాడుకుంటున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రజాస్వామ్యాన్ని దారుణమైన పరిస్థితుల్లో నడిపిస్తున్నారని విమర్శించారు.

తిరుపతి కార్పొరేషన్ లో 48 స్థానాలు మనం గెలిస్తే వాళ్లు ఒక్కటే గెలిచారు.అక్కడ ఈ మధ్య కాలంలో డిప్యూటీ మేయర్ ఎన్నికలు జరిగితే. మన కార్పొరేటర్లు ప్రయాణిస్తున్న బస్సును పోలీసులు అడ్డుకుని, కార్పొరేటర్లు, ఎమ్మెల్సీని పోలీసుల ఆధ్వర్యంలోనే కిడ్నాప్ చేశారు.ఇలా చేయడానికి సిగ్గు ఉండాలి. విశాఖపట్నంలో ఉన్న 98స్థానాలకు 56స్థానాలకు పైగా వైయస్సార్సీపీ గెలిచింది. ప్రజాస్వామ్యయుతంగా వైయస్సార్సీపీ మేయర్ ఉంటే, అక్కడా అవిశ్వాస తీర్మానం పెట్టారు. మన కార్పొరేటర్లను క్యాంపులోనికి తీసుకున్నాం. వారు క్యాంపులకు పోతే వాళ్ల ఇళ్లకు పోలీసులు వచ్చి.. మీ భర్తలు ఎక్కడున్నారో చెప్పకపోతే మిమ్మల్ని స్టేషన్ కి తీసుకుపోతామని బెదిరిస్తున్నారు. బుద్ధి, జ్ఞానం ఉన్నవాళ్లు ఎవరైనా పోలీసులను ఈ మాదిరిగా వాడుకుంటారా? అని జగన్ ప్రశ్నించారు.

# పెరిగిన జిఎస్టీ నికర వసూళ్లు

>> గరిష్ఠ ఆదాయం వచ్చింది. 2024 అక్టోబరులో రూ.2820 కోట్లు, నవంబరు-రూ.2843 కోట్లు, డిసెంబరు-రూ.2524 కోట్లు, 2025 జనవరి-రూ.2904 కోట్లు ఫిబ్రవరిలో రూ.2937 కోట్ల చొప్పున జీఎస్టీ వసూలైంది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ప్రాథమిక ధరలో తగ్గుదల, విధానపరమైన మార్పుల కారణంగా పెట్రోలియం, ఉత్పత్తుల రెవెన్యూ తగ్గి, సవాళ్లు ఎదురయ్యాయి. అయినప్పటికీ మొత్తం పన్ను వసూళ్లు సానుకూలంగానే ఉన్నాయి. రాష్ట్ర రెవెన్యూకు గణనీయంగా దోహదపడే మద్యం రిటైల్ ధర తగ్గింపు కూడా ప్రభావం చూపిందని బాబు.ఎ వివరించారు. గత సంవత్సరాలకు సంబంధించి 2024-25 లో సెటిల్ చేసిన రూ.164 కోట్ల పరిహారాన్ని కూడా పరిగణనలోకి తీసుకున్నారు. జీఎస్టీ మార్చి నెల వసూళ్లలో తెలంగాణకు రూ.5401 కోట్లు, ఏపీకి రూ.4033 కోట్లు దక్కాయి. 2024 మార్చితో పోలిస్తే ఏపీ వసూళ్లు 1 శాతం తగ్గగా, తెలంగాణ వసూళ్ల యథాతథంగా ఉన్నాయి. కేంద్ర ఆర్థికశాఖ మంగళవారం విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. ఐజీఎస్టీలో ఎస్‌జీఎస్టీ విభాగం పరిష్కారం తర్వాత ఈ ఏడాది ఇప్పటివరకు ఏపీ ఖజానాకు రూ.33301 కోట్లు, తెలంగాణకు రూ.44025 కోట్లు వచ్చాయి. ఇందులో ఏపీలో 5% తెలంగాణలో 8% వృద్ధి నమోదైంది. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు కేంద్రం రాష్ట్ర ప్రభుత్వ పన్ను విభాగాలు కలిపి తెలంగాణ నుంచి రూ.62987 కోట్లు, ఆంధ్రప్రదేశ్ నుంచి రూ.44,825 కోట్లను సీజీఎస్టీ, ఎస్‌జీఎస్టీ, ఐజీఎస్టీ, సెస్ రూపంలో వసూలుచేశాయి. గతేడాదితో పోలిస్తే ఈ వసూళ్లలో తెలంగాణలో 5.1% ఆంధ్రప్రదేశ్‌లో 1.2% వృద్ధి నమోదైంది.

# అమరావతి చిత్రకళ వీధికి సిఎం మద్దతు

>> ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ నాయకత్వం లో కృషి చేస్తున్న సాంస్కృతిక కమిషన్ ఛైర్‌పర్సన్ తేజస్విని అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలు, బడుగు పిల్లలకు వారి కళను ప్రదర్శించే అవకాశాన్ని కల్పించాల్సిన అవసరం ఉందని ప్రస్తావించడంతో పాటు, ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన కళాకారులకు ఆంధ్రప్రదేశ్‌కి ఆహ్వానం పలికారు.చిత్రాన్ని వేస్తున్న సమయంలో, చిన్నతనంలో చివరిసారి చిత్రలేఖనం చేసిన అనుభూతిని గుర్తుచేసుకుంటూ, మళ్ళీ ఆ అనుభూతిని పొందడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు.తేజస్వి మాట్లాడుతూ, కళాకారులకు ఇది బంగారు యుగం అని అభివర్ణించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కళలు, సాంస్కృతిక వారసత్వానికి విశేష ప్రోత్సాహం లభిస్తోందని పేర్కొన్నారు.

# ఆదిలాబాద్ విమానాశ్రయానికి ఎయిర్‌ఫోర్స్ సమ్మతి

## జాక్రన్‌పల్లికి అనుమతి లభిస్తే మూరు మూల ప్రాంతాల అభివృద్ధికి దోహదం

### మామ్నూరు, ఆదిలాబాద్‌లకు వరుసగా ఆరునెలల్లో అనుమతులు సాధించాం : తెలంగాణ ఆర్అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి

**హైదరాబాద్,ఏప్రిల్ 2,ప్రభాతవార్త:** ఆదిలాబాద్ విమానాశ్రయానికి భారత ఏయిర్‌ఫోర్స్ సమ్మతి తెలిపింది. నైజాం హయాంలోనే ఆదిలాబాద్‌లో ఎయిర్ పోర్టు నిర్మాణంకు పునాదులు పడ్డాయి.362 ఎకరాలలో డిఫెన్స్‌సంబంధించిన ఎరోడ్రమ్ అక్కడ ఉంది.దీనికి తోడు 1500వందల ఎకరాల భూములు సేకరించి ఎయిర్ పోర్టును అభివృద్ధిచేయాలని సర్వేను 2011,12లో చేసి ప్రభుత్వం నిర్ణయించింది. ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు నిర్మాణం జరగాలని అర్థదశాబ్దం నుంచి డిమాండ్ వినిపిస్తున్నారు. దీనికితోడు నిజామాబాద్ జిల్లా జాక్రన్‌పల్లిలో కూడా ఎయిర్‌పోర్టు ఏర్పాటు కోసం స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల మామునూర్ ఎయిర్‌పోర్టుకు గ్రీన్ సిగ్నల్ రావడంతో మిగితా ఈ రెండు ఎయిర్‌పోర్టులపై కూడా ప్రజల నుంచి పాలకులపై ఒత్తిడి వచ్చింది. ఆదిలాబాద్ విమానశ్రయంకు ఎయిర్‌ఫోర్సు నుంచి అనుమతి రావడంతో ఇక పౌరయానం కోసం వీలుగా ఇక్కడ విమానాశ్రయం నిర్మాణంకు అవకాశం ఏర్పడిందని అనుమతి లేఖ కూడా తనకు అధికారికంగా అందిందని రాష్ట్ర రోడ్డుభవనాలుశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలతో పాటు తెలంగాణ,సమీపంలో ఉన్న విదర్భ ప్రాంతాలకు పౌరవిమాన సేవలు ఇక్కడ నుంచి అందే అవకాశాలు ఉంటాయి.

ఆర్అండ్‌బి మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రజలందరికీ మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. కొద్ది రోజుల క్రితం మామునూర్ ఎయిర్‌పోర్టుకు అనుమతులు సాధించామని, ఇప్పుడుఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు ఇండియన్ ఎయిర్ పోర్స్ నుంచి అనుమతులు సాధించామని ఆయన పత్రికలకు విడుదల చేసిన లేఖలో పేర్కొన్నారు. ఉత్తర తెలంగాణ,సమీపంలోని విదర్భ ప్రాంతాల్లోని ప్రజలకు ఈ విమానశ్రయం ఉపయగపడుతోందని కొమటిరెడ్డి వెంకటరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.ఆరు నెలల వ్యవధిలోనే రెండు ఎయిర్ పోర్టులకు అనుమతులు సాధించడం తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అవిశ్రాంత కృషికి దక్కిన ఫలితమని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసి, పౌరవిమాన సేవలను అందుబాటులోకి తీసుకురావాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన అభ్యర్థనకు భారత వాయుసేన అధికారులు సముఖత వ్యక్తం చేయడంతో పాటు అక్కడ భవిష్యత్తులో వాయుసేన శిక్షణా కేంద్రాన్ని నెలకొల్పే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు లేఖలో తెలిపారని మంత్రి వివరించారు.

ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు కోసం భూసేకరణ చేయాల్సి ఉంటుంది. ఎయిర్‌పోర్టు కోసం డిపిఆర్ నివేదికను రూపొందించి కేంద్రానికి, సంబంధిత విభాగాలకు సమర్పిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో ఇటీవల మామునూర్, ఇప్పుడు ఆదిలాబాద్ ఎయిర్ పోర్టులకు అనుమతుల మంజూరీలో సహకరిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడుకి, రాష్ట్రంలో ఎయిర్ పోర్ట్‌ల ఏర్పాటుకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. భూసేకరణ చేసుకోవాలని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు ఎయిర్‌ఫోర్సు అధికారులు సూచించడంతో ఇక నిర్మాణపనులు వడివడిగా సాగుతాయని అంతా భావిస్తున్నారు.

ఎయిర్ పోర్ట్‌కు అవసరమైన అన్ని అనుమతులు పొందేందుకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా "సమగ్ర నిర్మాణ ప్రతిపాదన నివేదికను " ను ఇండియన్ ఏయిర్‌ఫోర్సుకు సమర్పించాల్సిఉంటుంది. దానిని పరిశీలించి మిగితా అనుమతులు ఇస్తారు. తెలంగాణ ప్రభుత్వానికి పౌర విమాన సేవలను ప్రారంభించేందుకు కావాల్సిన ఎయిర్‌ఫోర్స్ అధికారులు అనుమతులు మంజూరు చేశారని మంత్రి తెలపడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలతో పాటుయావత్‌మాల్,కిన్వట్ తదితర ప్రాంతాల్లో ప్రజలలో కూడా సంతోషం వెల్లివిరిసింది.. ఈ విమానాశ్రయాన్ని పౌర విమానయానానికి, ఎయిర్ ఫోర్స్ విమానాల రాకపోకలకు అనుగుణంగా ఒక జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్‌గా అభివృద్ధి చేయాలని వాయుసేన సూచించినట్లు వెంకటరెడ్డి తెలపడంతో అక్కడి ప్రజల సంతోషంకు హద్దులు లేకుండాపోయింది. పౌర విమానాల రాకపోకలకు అనువుగా రన్‌వే పునర్నిర్మాణం చేయడంతో పాటు, పౌర టర్మినల్ ఏర్పాటు, ఎయిర్‌క్రాఫ్ట్ ఎప్రాన్ వంటి ఇతర మోలిక వసతులను అభివృద్ధి చేయడం వంటి పనులు చేయాల్సి ఉంటుంది..



బుధవారం పట్టాలు తప్పిన నాగావళి బోగీలు. పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

# పట్టాలు తప్పిన 'నాగావళి'

## రైలు నెమ్మదిగా వెళ్లడంతో తప్పిన ప్రాణాపాయం

**విజయనగరం , ఏప్రిల్ 2 ప్రభాతవార్త ప్రతినిధి :** నాగావళి రైలు ప్రయాణీకులకు ప్రమాదం తప్పింది. విజయనగరం రైల్వే స్టేషన్‌కు కొద్ది దూరంలో నాందేడ్ నుంచి సంబల్పూర్ వెళుతున్న నాగావళి రైలు పట్టాలు తప్పింది. అదృష్టవశాస్తూ ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. నాందేడ్ నుండి సంబల్పూర్ వెళ్లే నాగావళి బుధవారం ఉదయం సుమారు పదకొండున్నర సమయంలో విజయనగరం రైల్వేస్టేషన్‌కి చేరుకుంది.అక్కడ నుంచి బయలుదేరిన నాగావళి కొద్ది వ్యవధిలో విజయనగరం రైల్వేస్టేషన్‌కు సమీపంలో రైలు వెనుక రెండు బోగీలు పట్టాలు తప్పాయి. ఆ సమయంలో రైలు నెమ్మదిగా ప్రయాణిస్తుండటంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. అప్రమత్తమైన రైల్వే అధికారులు తక్షణమే ఆ రెండు బోగీలను తప్పించారు. ప్రమాద స్థలాన్ని రైల్వే ఉన్నతాధికారులు సందర్శించి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకుంటూ దర్యాప్తు చేపట్టారు. సంఘటన విషయం తెలియగానే విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు సంఘటనా స్థలాన్ని సందర్శించి, రైల్వే అధికారులను కారణాలు అడిగి తెలుసుకున్నారు.



వెంకటేశ్వరస్వామి ప్రతిమను నాగేంద్రబాబు దంపతులకు అందజేస్తున్న సీఎం చంద్రబాబు

# సిఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్సీ నాగబాబు

**విజయవాడ,ఏప్రిల్2,ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ఎమ్మెల్సీ నాగబాబు మర్యాదపూర్వకరంగా కలిశారు. శాసనమండలి ఛైర్మన్ కార్యాలయంలో ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం నాగబాబు సచివాలయంలో సీఎంను కలిశారు.ఈ సందర్భంగా నాగబాబును చంద్రబాబు అభినందించారు.పట్టుదల,ఆకుంఠిత దీక్షతో మీరు ఈ స్థాయికి రాగలిగారు.ఇక మనమంతా కలిసి పట్టుదలతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిద్దామని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారంటున్నారు.పవన్ మొక్కవోని ధైర్యం,ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానం అమలు చేయాలనే అభిలాష తనకు ప్రోత్సాహంగా ఉంటాయని చంద్రబాబు అన్నట్లు తెలిపారు.మన విజన్‌ను వివరించినప్పుడు మీతోనే మేమంటూ ముందుకు వస్తారన్నారు.పవన్ కల్యాణ్ మాదిరిగా పట్టుదలతో మనమంతా కలిసి ముందుకు సాగుదామన్నారు.నాగేంద్రబాబు చంద్రబాబు బాటలోనే తామని స్పష్టం చేసినట్లు సమాచారం.గతంలో నాగేంద్రబాబుకు క్యాబినేట్‌లో స్థానం కల్పిస్తామని చంద్రబాబు తెలిపారు.ఈ ప్రస్తావన వచ్చినప్పుడు మీరు ఎలా నిర్ణయం తీసుకున్నా గౌరవిస్తామని నాగేంద్రబాబు తెలిపినట్లు సమాచారం.ఈ విషయంలో జనసేన పదవుల కన్నా కూటమి నిర్ణయాలు,ప్రభుత్వ అభ్యున్నతిని ఆశిస్తుందని నాగేంద్రబాబు తెలిపినట్లు సమాచారం. సీఎం చంద్రబాబును కలిసిన సందర్భంలో నాగబాబుతో ఆయన సతీమణి ఉన్నారు. నాగేంద్రబాబుకు ఆయన సతీమణికి సీఎం చంద్రబాబు వెంకటేశ్వరస్వామి ప్రతిమను అందించారు.

# మళ్లీ గంటపైగా శ్రవణ్‌రావు విచారణ

## ఫోన్ ట్యాపింగ్ కేసు కొత్తమలుపు

**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మీడియా అధినేత శ్రవణ్ రావును సిట్ అధికారులు బుధవారం నాడు గం ట పాటు విచారించారు. గత శనివారం నాడు మొదటి సారి శ్రవణ్ రావు ఫోన్ ట్యాపింగ్ కేసును విచారిస్తున్న సిట్ అధికారులు ఆరున్నర గంటల పాటు విచారించడ ం తెలిసిందే. మొదటి దఫా విచారణలో సరైన సమాధానాలు చెప్పక పోవడంతో బుధవారం నాడు శ్రవణ్ రావును బుధవారం నాడు మరోసారి విచారణకు పిలిచారు. పోలీసుల నోటీసులకు సమాధానంగా శ్రవణ్ రావు జూబ్లీహిల్స్‌లోని సిట్ కార్యాలయానికి హాజరు కాగా సిట్ ఎసిపి వెంకటగిరి నేతృత్వంలోని ప్రత్యేక బృందం ఆయన ను అనేక ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో మీరు వాడిన ఫోన్‌లను వెంటనే ఇవ్వాలని సిట్ అధికారులు శ్రవణ్ రావును కోరగా అ ప్పుడు వాడిన ఫోన్‌లు తన వద్ద ఇప్పుడు లేవని సమాధానం ఇచ్చారని తెలిసింది. అయితే శ్రవణ్ రావు సమాధానాలతో సిట్ అధికారులు సంతృప్తి చెందలేదు. దీంతో ఒక ఫోన్‌ను సిట్ అధికారులకు శ్రవణ్ రావు అప్పగించగా అందులో ఎలాంటి సమాచారం లేక పోవడంతో పోలీసులు షాక్‌కు గురయ్యారని సమాచారం. అనంతరం సిట్ అధికారులు శ్రవణ్ రావును ఫోన్ ట్యాపింగ్ కేసులో అప్పట్లో జరిగిన ఘటనలపై ప్రశ్నించి కొంత సమాచారం రాబట్టారని తెలిసింది. అయితే చాలా వరకు ప్రశ్న లకు శ్రవణ్ రావు సరైన సమాధానాలు ఇవ్వకుండా దాటవేశారని తెలిసింది. దీంతో సిట్ అధికారులు ఒకింత అసహనానికి గురై 2023లో రాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎ న్నికల సమయంలో మీరు ఉపయోగించిన రెండు ఫోన్‌లను తమకు అప్పగించాలని, ఇందులో అన్ని వివరాలు వుండాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరి ంచారు. నాటి ఎన్నికల సమయంలో వాడిన ఫోన్‌లతో పాటు తాము అడిగిన సమాచారం తీసుకుని ఈ నెల ఎనిమిదవ తేదీన మరోసారి విచారణకు రావాలని సిట్ అధికారులు శ్రవణ్ రావును ఆదేశించారు.

## వారం - వర్జ్యం

తేది : 03-04-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్లపక్షం,
శుక్ల షష్ఠి రా.9.47
రోహిణి ఉ.7.03, మృగశిర ఉ.11.17
వర్జ్యం రా.11.15 - 2.20
దు.ఉ.10.09 - 10.58
శుభసమయం : మ.3.04 - 3.53
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** చేపట్టిన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు. ధనవ్యయం.

**వృషభం :** కుటుంబంలో బాధ్యతలు పెరిగినా సమర్థ వంతంగా నిర్వహిస్తారు. ఆరోగ్యం మందగిస్తుంది.

**మిథునం:** ప్రయాణాలు లాభిస్తాయి. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**కర్కాటకం :** ఋణవత్తిడులు తొలగుతాయి. ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. వస్తువులు కొనుగోలు.

**సింహం:** ఉద్యోగాలలో మార్పులు వుంటాయి. సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. శుభవార్తలు.

**కన్య :** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం కొంత కలవర పెడుతుంది. నూతన ప్రయత్నాలు అనుకూలించవు.

**తుల :** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురై చికాకులు పెడతాయి.

**వృశ్చికం:** ఋణ యత్నాలు ఫలిస్తాయి. సన్నిహితుల నుండి ముఖ్య సమాచారం అందుకుంటారు. విందు, వినోదాలు.

**ధనుస్సు:** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు. వస్త్రాలాభం.

**మకరం:** పనులలో విజయం సాధిస్తారు. ప్రముఖ వ్యక్తులనుండి విలువైన సమాచారం అందుకుంటారు.

**కుంభం:** దూర ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు. భూ తగాదాలు తీరి లబ్ది పొందుతారు.

**మీనం :** ఉద్యోగులకు బాధ్యతలు పెరిగిన సమర్థవంతంగా నిర్వహిస్తారు. వృత్తి, వ్యాపారాలలో లాభాలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 933 ఎకరాల వక్ఫ్ భూమి మూడేళ్లు లీజుకు

### ముస్లింలకు ఉచిత విద్య అందించేందుకు వక్ఫ్ బోర్డ్ నూతన పథకం- రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్

**విజయవాడ,ఏప్రిల్2,ప్రభాతవార్తప్రతినిధి:** ముస్లింలకు ఉచిత విద్య అందించేందుకు వక్ఫ్ బోర్డ్ నూతన పథకం ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్. అబ్దుల్ అజీజ్ తెలిపారు. విజయవాడలోని కాళేశ్వర రావు మార్కెట్ వద్ద గల ఏపీ వక్ఫ్ బోర్డ్ కార్యాలయంలో ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన 3 వ బోర్డ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రవేశపెట్టిన అజెండా లపై ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా పలు మ్యానేజింగ్ కమిటీలు, పలు ముతవల్లీలను నియమించారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, ముస్లిం లకు ఉచిత విద్య అందించేందుకు నూతన పథకాన్ని ప్రారంభిస్తున్నామని అతి త్వరలో దాని వివరాలు తెలియచేస్తామని అన్నారు. వక్ఫ్ ఆస్తుల అద్దె ల సవరణకు రెంట్ రివ్యూ కమిటీ ను నియమించామని తెలిపారు. 202526 నుంచి 202728 సంవత్సరాలకు గాను డైరెక్ట్ మ్యానేజ్మెంట్ లో ఉన్న 933 ఎకరాల వక్ఫ్ ఆస్తులను లీజుకు ఇవ్వనున్నామని తెలిపారు. రాష్ట్రంలో వాణిజ్య ప్రయోజనాలకు ఉపయోగపడే వక్ఫ్ భూములను అభివృద్ధి చేయడానికి, జాతీయ, అంతర్జాతీయ స్థాయి డెవలపర్లను, సంస్థలను, పారిశ్రామిక వేత్తలను దీర్ఘకాలిక లీజు లేదా పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ ) ద్వారా ఎక్స్ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ కింద ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఈ భూములపై సౌర విద్యుత్ ప్రాజెక్టులు, పారిశ్రామిక సంస్థలు, వాణిజ్య కాంప్లెక్సులు, విద్యా సంస్థలు, హాస్పిటల్‌లు, ఇతర వాణిజ్య ప్రాజెక్టులు అభివృద్ధి చేసే అవకాశం ఉందని వివరించారు. సమావేశంలో బోర్డ్ సభ్యులైన శాసనమండలి సభ్యులు మొహమ్మద్ రుహుల్లా, శాసనసభ్యులు మొహమ్మద్ నసీర్, ఖాజా, అక్రమ్, ఇస్మాయిల్ బేగ్, ఆఫియా, ముక్రం హుస్సేన్, దావూద్ భాషా బఖావి, బేపారి జాకీర్ అహమద్ సీఈఓ మొహమ్మద్ అలీ వక్ఫ్ అధికారులు పాల్గొన్నారు.

# విశాఖలో కామోన్మాది ఘాతుకంపై సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

### - బాధిత యువతికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశం

**విజయవాడ, ఏప్రిల్ 2,ప్రభాతవార్తప్రతినిధి:** విశాఖపట్నంలో యువతిపై కామోన్మాది దాడిలో ఒకరు ప్రాణాలు కోల్పోవడం, మరొకరు ప్రాణాపాయ స్థితిలో ఉండటంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దాడిని అడ్డుకునే ప్రయత్నంలో నిందితుడి చేతిలో యువతి తల్లి నక్కా లక్ష్మి ప్రాణాలు కోల్పోవడం విచారకరం అన్నారు. ఈ ఘటనపై సీఎం ఆవేదన వ్యక్తం చేశారు.

తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న యువతి ఆరోగ్య పరిస్థితిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. బాధిత యువతికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.



కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుతో రాష్ట్ర మంత్రి టి.జి భరత్

# కర్నూలు విజయవాడ మధ్య విమాన సర్వీసులు ప్రారంభించండి

### కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడును కోరిన రాష్ట్ర మంత్రి టి.జి భరత్

**విజయవాడ,ఏప్రిల్2,ప్రభాతవార్తప్రతినిధి:** కర్నూలు విజయవాడ మధ్య విమాన సర్వీసులు ప్రారంభించమని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును రాష్ట్ర మంత్రి టి.జి భరత్ కోరారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసిన టిజి భరత్ కర్నూలు నుండి విజయవాడకు విమాన సర్వీసులు ప్రారంభించాలని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కోరినట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ తెలిపారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి కర్నూలు విజయవాడ విమాన సౌకర్యంపై చర్చించినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నానని కేంద్ర మంత్రి తెలిపినట్లు టి.జి భరత్ చెప్పారు. త్వరలోనే దీనికి సంబంధించి అడుగులు పడే అవకాశం ఉందని చెప్పారన్నారు. కర్నూలు విజయవాడ విమాన సౌకర్యం కల్పించేందుకు కేంద్ర మంత్రి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇక్కడ అన్ని రకాల పరిశ్రమలు పెట్టేందుకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయని ఆయన తెలిపారు. విమాన సర్వీసు కూడా అందుబాటులోకి వస్తే పారిశ్రామికవేత్తల రాకపోకలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రక్షణ రంగానికి సంబంధించిన ప్రాజెక్టుల పనులు చురుగ్గా కొనసాగించాలని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌ను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ కోరారు. ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసి ఏపీకి సంబంధించిన ప్రాజెక్టులపై ఆయన చర్చించారు. పెండింగ్ ప్రాజెక్టులు వేగవంతం చేయాలని కోరినట్లు మంత్రి తెలిపారు. రక్షణ రంగానికి సంబంధించిన ప్రాజెక్టుల ఏర్పాటు విషయంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు. పెండింగ్ ప్రాజెక్టులపై కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ సానుకూలంగా స్పందించినట్లు టి.జి భరత్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లేందుకు సీఎం చంద్రబాబు నాయుడు ఎంతో కృషి చేస్తున్నారని ఇరువురి మధ్య చర్చ వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఎన్నో ఏళ్ల నుండి ఉన్న అనుబంధాన్ని కేంద్ర మంత్రి గుర్తుచేశారని చెప్పారు. ఇక ఏపీకి సంబంధించిన ప్రాజెక్టులపై పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటానని రాజ్ నాథ్ సింగ్ హామీ ఇచ్చినట్లు మంత్రి టి.జి భరత్ తెలిపారు. ప్రతి 15 రోజులకు ఒకసారి అధికారులతో సమీక్షిస్తానని రాజ్ నాథ్ సింగ్ చెప్పారన్నారు.

# సంచార జాతుల అభ్యున్నతికి ప్రభుత్వం సమర్ధవంతమైన కార్యాచరణ

### - వారి అభివృద్ధే సిఎం చంద్రబాబు ధ్యేయం - బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత

**విజయవాడ,ఏప్రిల్2,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఎంబీసీ కులాల అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు చిత్తశుద్ధితో ఉన్నారని, ఇళ్ల స్థలాలతో పాటు ఆధార్ కార్డులు, గుర్తింపు కార్డులు అందజేస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఎంబీసీలకు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చనున్నట్లు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఎంబీసీ కుల సంఘాల నాయకులతో మంత్రి సవిత భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె ఆ కులాల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ, కూటమి విజయంలో ఎంబీసీ కులాలు ముఖ్యపాత్ర పోషించాయన్నారు. సంచార జాతులను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చేయాలన్నదే సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమన్నారు. సమావేశంలో తన దృష్టికి తీసుకొచ్చిన ప్రతి అంశాన్నీ సీఎం చంద్రబాబుకు వివరిస్తానన్నారు. ఎంబీసీ సమస్యలపై సీఎం చంద్రబాబుకు పూర్తి అవగాహన ఉందన్నారు. గత ఎన్నికల సమయంలో సంచార జాతులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని స్పష్టంచేశారు. సంచార జాతులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేస్తామన్నారు. ఇళ్ల స్థలాలతో పాటు ఆధార్ కార్డులు, గుర్తింపు కార్డులు మంజూరు చేస్తామన్నారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీలో ఉన్న ఇబ్బందులను తొలగిస్తామన్నారు. కళాకారులకు పెన్షన్ల మంజూరు విషయమై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. సంచార జాతుల పిల్లలకు రెసిడెన్షియల్ స్కూల్లో అడ్మిషన్లు కల్పిస్తామన్నారు. ఆదరణ పథకంలో భాగంగా సంచార జాతులకు అవసరమైన పరికరాలు సమకూర్చుతామన్నారు. బెగ్గింగ్ నిర్మూలనే చంద్రబాబు ధ్యేయంరాష్ట్రంలో బెగ్గింగ్ అనే మాటే వినబడకూడదని సీఎం చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకున్నారని మంత్రి సవిత తెలిపారు. అందుకోసమే ఎంబీసీకి చెందిన సంచార జాతులతో స్వయం ఉపాధి పథకాల్లో భాగంగా యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటి నుంచి ఒకరిని వ్యాపారవేత్తగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. 201419 మధ్య బ్యాంకులతో సంబంధం లేకుండా 90 శాతం సబ్సిడీతో సంచార జాతులకు సీఎం చంద్రబాబునాయుడు రూ.30 వేల మేర ఆర్థిక చేయూత అందించారన్నారు. అదే మాదిరిగా ఎంబీసీలకు కూటమి ప్రభుత్వం ఆర్థిక భరోసా అందజేయనుందన్నారు. గతంలో కంటే అదనంగా ఆర్థిక సాయమందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సంచార జాతుల్లో విద్యకు ప్రాధాన్యంనిరక్షరాస్యత కారణంగానే సంచార జాతులు అభివృద్ధిని నోచుకోలేకపోతున్నాయని మంత్రి సవిత ఆవేదన వ్యక్తంచేశారు. సంచార జాతుల వారు తమ పిల్లలను విద్యకు దూరం చేయొద్దని సూచించారు. విద్యతోనే ఆర్థికంగా, సామాజికంగా గుర్తింపు లభిస్తుందన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా పిల్లలను బడులకు పంపాలని, సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ అండగా నిలుస్తారని భరోసా ఇచ్చారు. రెసిడెన్షియల్ స్కూళ్లో సంచార జాతుల పిల్లలకు నేరుగా అడ్మిషన్లు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.



ఇదే విషయమై మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల మాదిరిగా విద్యా సంస్థల్లో రాయితీపై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతానన్నారు. అర్హులైన సంచార జాతుల విద్యార్థులకు విదేశీ విద్యా పథకం కింద అవకాశం కల్పిస్తామన్నారు.

ఈ సందర్భంగా ఎంబీసీ నాయకులు మాట్లాడుతూ, గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే తమకు న్యాయం జరిగిందని, మరోసారి సీఎం చంద్బ్రబాబు నాయుడు అధికారంలోకి రావడంతో, తమ బతుకులకు భరోసా లభించిందని ఆశాభావం వ్యక్తంచేశారు. అనంతరం మంత్రి సవితను ఎంబీసీ నాయకులు ఘనంగా సత్కరించారు.

# తిరుమల సమాచారం

## వెంకన్న సేవలో ఆకాశ్ అంబానీ

**తిరుమల,ఏప్రిల్ 2ప్రభాతవార్తప్రతినిధి:** ధనవంతుడనే హంగు ఆర్భాటం అతనిలో కనబడలేదు..పైగా ఇష్టదైవం ఏడుకొండల వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ఆద్యంతం భక్తిభావంతో స్వామివారి సేవలో తరించాడు ముఖేశ్అంబానీ కుమారుడు ఆకాశ్ అంబానీ. బుధవారం ఉదయం అనుచరులతో కలసి తిరుమలకు చేరుకున్న ఆయన విఐపి బ్రేక్‌లో ఆలయంలోకి వెళ్ళారు. తొలుత ధ్వజస్తంభానికి మొక్కారు. ఆనందనిలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన స్వయంగా కాలినడకన వరాహస్వామిని, పుష్కరిణిని చూశారు. సామాన్యభక్తుడుగానే గజరాజుల ఆశీర్వాదం అందుకున్నారు. ఆలయం వెలుపలకు వచ్చిన ఆకాశ్అంబానీని చూడటానికి ,సెల్ఫీలు తీసుకునేందుకు భక్తులు ఉత్సాహం చూపారు. అయితే అత్యంత వ్యక్తిగత భద్రత నడుమ ఆయన తిరుమల యాత్ర సాగడం విశేషం.



## శ్రీవారి భక్తులకు ఇక వాట్సాప్ సేవలు

### - అలిపిరిలో బేస్‌క్యాంప్

**తిరుమల,ఏప్రిల్ 2ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం వస్తున్న లక్షలాదిమంది భక్తులకు మరింత సులభంగా....సౌకర్యవంతంగా ఆ దేవుని దర్శనభాగ్యం కల్పించేందుకు వాట్సాప్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీనిపై టిటిడి అధికారులకు సిఎం చంద్రబాబునాయుడు బుధవారం సమీక్షలో పునరుద్ఘాటించడంతో ఈ సేవలు పకడ్బందీగా అమలుచేసేందుకు ఐటి విభాగం వ్యూహాత్మకంగా వ్యవహరించనుంది. కోట్లాదిమంది హిందువుల పుణ్యక్షేత్రం తిరుమల తిరుపతి దేవస్థానంలో వసతి కల్పన, దేవుని దర్శనం, లడ్డూప్రసాదాలు, వివిధ ట్రస్టులకు విరాళాలు,భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు,భవిష్యత్తులో మరింతమంది భక్తులు వచ్చినా చేపట్టే సౌకర్యాలపై పూర్తిగా వాట్సాప్‌ద్వారానే తెలుసుకునేలా వెసలుబాటు కలగనుంది. దీనిపై సిఎం చంద్రబాబు టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి స్పష్టమైన సంకేతాలిచ్చారు. టిటిడి నుండి 15 రకాల సేవలు వాట్సాప్‌లో అందించాలని సూచించారు. వెంటనే వాట్సాప్ సేవలు అమలుకావాలని తెలిపారు. అంతేగాక ప్రతి సేవకు ఆధార్,సెల్ ఫోన్ నంబర్‌ను లింక్ చేయడం ద్వారా ఎక్కడా అక్రమాలు జరగకుండా చూడాలనేది ఆయన అభిమతం. మరోవైపు స్వచ్ఛతిరుమలలో పారిశుద్ధ్యనిర్వహణ, పేరుకుపోయిన టన్నులకొద్దీ చెత్తను తొలగించాలని ఆదేశించారు. 80శాతం పచ్చదనం పెంపొందించాలని స్పష్టం చేశారు. సాంకేతికతను వినియోగించి భక్తులకు సేవలను మరింత చేరువచేయాలనేది సిఎం సూచనలు . దేశవిదేశాల నుండి తిరుమలకు ప్రతిరోజూ లక్షమంది వరకు భక్తులు వస్తున్నారు. నెలవారీగా 23లక్షలమంది భక్తులు శ్రీవారిని దర్శించుకుంటున్నారు. ఇలా వచ్చిన భక్తులకు తిరుమలలో 50వేలమంది వరకు మాత్రమే వసతి సౌకర్యం ఉంది. దానిపై భక్తులు చేరినా వసతి పొందలేరు. ఈ నేపథ్యంలో తిరుమలకు ప్రధాన ప్రవేశద్వారమైన తిరుపతి అలిపిరిలో 25వేలమంది భక్తులకోసం బేస్‌క్యాంప్ సౌకర్యవంతంగా వుండేలా నిర్మాణం చేపడుతున్నారు. 60అనుబంధ ఆలయాల అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ రూపొందించడం, శ్రీవారి సేవకుల విషయంలో కొత్తవారు 90 శాతం మందిలో సగంమంది పాతవారే ఉండాలని సిఎం సూచించారు.



# ప్రధానమంత్రి పర్యటనపై సిఎస్ విజయానంద్ ప్రాథమిక సమీక్ష

**విజయవాడ,ఏప్రిల్2,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి ప్రజా రాజధాని నిర్మాణ పనులను పున:ప్రారంభించడంతో పాటు పలు ఇతర అభివృద్ధి పనులకు శంఖుస్థాపన,ప్రారంభోత్సవాలకు ఈనెలలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడి రాష్ట్రానికి రానున్న నేపథ్యంలో అందుకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై బుధవారం రాష్ట్ర సచివాలయంలో అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ప్రాథమిక సమీక్ష నిర్వహించారు.ప్రధాని పర్యటన ఖరారు కాగానే పూర్తి స్థాయిలో ఏర్పాట్లపై సమీక్షించడం జరుగుతుందని ఈలోగా సంబంధిత శాఖల పరంగా చేయాల్సిన ఏర్పాట్లపై ఇప్పటి నుండే పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాలని సిఎస్ అధికారులను ఆదేశించారు.ఇటీవల పి4 కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రాంతంలోనే ప్రధాని పర్యటన కార్యక్రమం ఉండే విధంగా ఆప్రాంతాన్ని 50 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో చదును చేయడంతో పాటు తగిన పార్కింగ్ తదితర ఏర్పాట్లు చేయాల్సి ఉందన్నారు.

# చంద్రబాబు పి - 4 కాన్సెప్ట్ అంతా ఓ నాటకం

### - ప్రజలను ఊహాలోకంలోకి తీసుకెళ్తున్న చంద్రబాబు - 8న వైఎస్ జగన్ రాక

### - వైఎస్సార్సీఅనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం, ఏప్రిల్ 2 (ప్రభాతవార్త బ్యూరో)** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు అవుతోందని, కేవలం ప్రచార ఆర్భాటానికే చంద్రబాబు పరిమితం అవుతున్నారని, చంద్రబాబు నాయుడు ప్రభుత్వం చెబుతున్న పి 4 కాన్సెప్ట్ అంతా బూటకము.. నాటకమని ,, ఇది అంతా ఎప్పటినుంచో అమల్లో ఉందని సీనియర్ నేత, వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. బుధవారం వైసీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలతో పాటు జగన్ అందించిన సంక్షేమం కంటే రెట్టింపు సంక్షేమాన్ని అందిస్తామని ఎన్నికలకు ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రచారం చేశారన్నారు. ఈ 10 నెలల్లో ఒక్క పథకాన్ని కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. గ్యాస్ సిలిండర్లు మాత్రమే అరకొరగా అందిస్తున్నారని తెలిపారు. పాత సీసాలో కొత్త సారా అన్నట్లు కొత్త కొత్త పేర్లతో ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. ఉగాది రోజున పీ-4 అంటూ నినాదం తీసుకొచ్చారని, ధనవంతులు పేదలను దత్తత తీసుకోవడం కొత్తేమీ కాదన్నారూ .గతంలో చంద్రబాబు అధికారంలో ఉండగా ఎమ్మెల్యేలు గ్రామాలను దత్తత తీసుకున్నారని, ఆ తర్వాత గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో పేదరికం లేకుండా చేస్తానని చంద్రబాబు ప్రగల్భాలు పలుకుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. 2029 నాటికి పేదరికం లేకుండా చేస్తానని, 2047 నాటికి కుటుంబ తలసరి ఆదాయాన్ని రూ.55 లక్షలకు చేస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్రబాబు భ్రమల్లో తేలిపోతూ ప్రజలను ఊహ లోకంలో తిరిగేలా చేస్తున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబుకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సచివాలయాల పరిధిలో ఎంత మంది పేదరికంలో ఉన్నారో ప్రకటించాలన్నారు. జగన్ ఐదేళ్లలో నొక్కిన బటన్లన్నీ తాను పింఛన్ల కోసం నొక్కిన బటన్‌తో సమానం అని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అనంత తెలిపారు. ఐదేళ్ల పాలనలో వైఎస్ జగన్ బటన్ నొక్కితే నేరుగా రూ.2.72 లక్షల కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లోకి వెళ్లాయన్నారు. ఎక్కడా దళారులు, మధ్యవర్తులు, అవినీతికి ఆస్కారం లేకుండా పాలన సాగించారని తెలిపారు. భవిష్యత్‌లో చంద్రబాబు అందించే పథకాలను ఎలా పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 66 లక్షల 34 వేల 742 పింఛన్ దారులు ఉండేవారని అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

ఈ ఏడాది ఏప్రిల్‌లో 63 లక్షల 27 వేల మందికి మాత్రమే పింఛన్ మంజూరు చేశారని తెలిపారు. అంటే 10 నెలల వ్యవధిలోనే ఏకంగా 3 లక్షలకు పైగా పింఛన్లను కోత పెట్టారన్నారు. ఒక్క అనంతపురం నగరంలో మాత్రమే వెయ్యి మందికి పైగా పింఛన్లు తొలగించారని తెలిపారు. రీసర్వే పేరుతో దివ్యాంగుల పింఛన్లలోనూ కోతలు పెడుతు న్నారన్నారు. తల్లికి వందనం పథకం కింద ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు తొలి ఏడాది ఈ పథకాన్ని అమలు చేయలేదని అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ ఏడాది మేలో తల్లికి వందనం అందిస్తామని చెప్పడం వెనుక లబ్ధిదారుల్లో కోత పెట్టే ఆలోచన ఉందని అనుమానం వ్యక్తం చేశారు. సాధారణంగా జూన్ మాసంలో స్కూళ్లు తెరిచాక ఆ నెలాఖరుకు ఎంత మంది విద్యా ర్థులు ఉన్నారన్నారు.

# పవన్ కల్యాణ్ కేసు ప్రత్యేక కోర్టుకు పంపే అవసరం ఏముంది? - హైకోర్టు

**విజయవాడ,ఏప్రిల్2,ప్రభాతవార్తప్రతినిధి:** డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వాలంటీర్లపై వ్యాఖ్యలు చేసేనాటికి ప్రజాప్రతినిధి కాదు కదా అని పిటిషనర్లను హైకోర్టు ప్రశ్నించింది. వారాహి యాత్ర సందర్భంగా జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మాట్లాడుతూ అప్పట్లో వాలంటీర్లు సేకరిస్తున్న సమాచారం అసాంఘిక శక్తుల చేతుల్లోకి వెళ్లడం మహిళల అపహరణలకు కారణమవుతోందని చెప్పారు. ఈ వ్యాఖ్యలపై వైఎస్సార్సీపీ సర్కార్ గత సంవత్సరం ఫిబ్రవరిలో పవన్ కల్యాణ్‌పై క్రిమినల్ కేసు దాఖలు చేసింది. ఈ విషయంలో అఫిడవిట్లు ఇచ్చిన ఐదుగురు వాలంటీర్లు తాజాగా అఫిడవిట్లు దాఖలు చేస్తూ వైఎస్సార్సీపీ నాయకులు తమ నుంచి సంతకాలు తీసుకొని కోర్టులో పిటిషన్ వేశారని తెలిపారు. ఈ క్రమంలో పవన్ కల్యాణ్‌పై ప్రాసిక్యూషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతించాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ గుంటూరు కోర్టులో పిటిషన్ వేశారు. దానిపై విచారణ జరిపిన అక్కడి జడ్జి గత సంవత్సరం నవంబర్ 18న ప్రాసిక్యూషన్ ఉపసంహరణకు ఉత్తర్వులు జారీ చేశారు.

# 6న శ్రీరామనవమి

**తొట్టంబేడు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:** శ్రీరామనవమి హిందూవులకు ముఖ్యమైన పండుగ. శ్రీరాముడు వసంత ఋతువులో చైత్ర శుద్ధ నవమి, గురువారం నాడు పునర్వసు నక్షత్రం కర్కాటక లగ్నంలో సరిగ్గా అభిజిత్ ముహూర్తంలో అంటే మద్యాహ్నం 12గంటల సమయంలో త్రేతాయుగంలో జన్మించాడు. ఈరోజునే ప్రతి ఒక్కరు శ్రీరామనవమి పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. పద్నాలుగు సంవత్సరాలు అరణ్యవాసం, రావణసంహారం తర్వాత శ్రీరాముడు సీతాసమేతంగా అయోధ్యలో పట్టాభిషిక్తుడైనాడు. ఈ శుభ సంఘటన కూడా చైత్ర శుద్ధ నవమినాడే జరిగిందని ప్రజల విశ్వాసం. శ్రీ సీతారాముల కళ్యాణం కూడా ఈరోజునే జరిగింది. ఈ మహాపర్వదినాన తెలంగాణాలోని భద్రాచలంలో సీతారామ కళ్యాణ ఉత్సవాన్ని వైభవోపేతంగా జరుపుతారు. రామయణంలో అయోధ్యకు రాజైన దశరథుడికి ముగ్గురు భార్యలు. కౌసల్య, సుమిత్ర, కైకేయి. ఆయనకు ఉన్న భాద అంతా సంతానం గురించే. సంతానం లేకపోతే రాజ్యానికి వారసులు ఉండరని. అప్పుడు వశిష్ట మహాముని దశరథమహారాజుకు పుత్రకామేష్టి యాగం చేయమని సలహాఇచ్చాడు. రుష్యశృంగ మహామునికి యజ్ఞాన్ని నిర్వహించే బాధ్యతనను అప్పజెప్పమన్నాడు. వెంటనే దశరథుడు ఆయన ఆశ్రమానికి వెళ్లి ఆయనను తన వెంట అయోధ్యకు తీసుకుని వస్తాడు. ఆ యజ్ఞానికి తృప్తి చెందిన అగ్ని దేవుడు పాయసంతో నిండిన ఒపాత్రను దశరథుడికి ఇచ్చి భార్యలకు ఇవ్వమన్నాడు. దశరథుడు అందులో సగభాగం మొదటిభార్య కౌసల్యకూ, రెండోసగ భాగం చిన్నభార్యయైన కైకేయికి ఇచ్చాడు. వారిద్దరూ వారి వాటాల్లో సగం మిగిల్చి రెండో భార్యయైన సుమిత్రకు ఇచ్చాడు. కొద్దికాలానికే వారు ముగ్గురూ సంతాన భాగ్యానికి నోచుకున్నారు. చైత్రమాసం తొమ్మిదవరోజైన నవమినాడు, మద్యాహ్నం కౌసల్య శ్రీరామునికి జన్మనిచ్చింది. అలాగే కైకేయి భరతునికి, సుమిత్ర లక్ష్మణ శతృఘ్నులకు జన్మనిచ్చారు.


కలెక్టరువారి కార్యాలయం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

## ఫారం నెం.VII

(2013సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలలో న్యాయ్యపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 25, సబ్ రూల్-1 ననుసరించి)

ఆర్.సి. ఇ1/532/2024 తేది. 01.04.2025

**రూఢీ ప్రకటన**

ఈ క్రింది నిర్దిష్టపరచిన షెడ్యూల్ దాఖలా భూములను విస్తీర్ణము ఎ.0.10 సెంట్లు ప్రజా ప్రయోజనమునకై అనగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, బుచ్చిరెడ్డిపాలెం మండలం, వవ్వేరు గ్రామం నందు Widening and Strengthening of Road from Buchireddypalem to Dagadarthi under R&B ఏర్పాటు కొరకు భూమిని కావలయునని, శ్రీయుత జిల్లా కలెక్టర్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వారు భావించినందున, 2013వ సంవత్సరం 30వ చట్టంలో 15వ విభాగంను అనుసరించి సంబంధిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరముల విచారణ జరిపిన పిమ్మట శ్రీయుత జిల్లా కలెక్టర్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వారు సంతృప్తి చెంది ఈ దిగువ షేడ్యూలు దాఖలా భూమి ప్రజా ప్రయోజనముల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు. ఈ క్రింద రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంను అనుసరించి చేయబడినది.

**రూఢీ ప్రకటన**

శ్రీయుత జిల్లా కలెక్టరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వారు 2013 సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగం ననుసరించి ఈ దిగువనుదహరించిన షెడ్యూల్ దాఖలు భూమి ఎ.0.10సెంట్లు ప్రజాప్రయోజనములకై అనగా "Widening and Strengthening of Road" from Buchireddypalem to Dagadarthi under AP Roads and Bridges Reconstruction project ఏర్పాటు కొరకు భూమి అవసరమైనదని ఇందుమూలముగా ప్రకటన చేసియున్నారు.

**షెడ్యూల్**

ప్రాజెక్టు పేరు:- "Widening and Strengthening of Road" from Buchireddypalem to Dagadarthi.

జిల్లా: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు మండలం: బుచ్చిరెడ్డిపాలెం గ్రామము: వవ్వేరు

| క్రమ సం. | సర్వే నెం. సబ్ డివిజన్ నెం. | పూర్తి విస్తీర్ణం | సేకరించిన విస్తీరం ఎకరాలు | భూమి కరం | సంబంధిత ఆసామి పేరు మరియు పట్టాదారు చిరునామా (పట్టాదారు/ అనుభవదారు) | సరిహద్దులు ఉత్తరం | తూర్పు | దక్షిణం | పడమర | చెట్లు, కట్టడములు మరియు ఇతరముల వివరములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 443-1 | 3.55 | 0.03 | పట్టా-మాగాణి | శ్రీ దొడ్ల శరత్ కుమార్ రెడ్డి తండ్రి పొండు రంగారెడ్డి | 445 | 443-2 | 444 | 445 | బీడు |
| 2 | 446-1 | 0.75 | 0.005 | పట్టా-మెట్ట | శ్రీ అమ్మడినేని రవి కుమార్ తండ్రి రాఘవ రావు | 447 | 446-2 | 445 | 445 | బీడు |
| 3 | 447-1 | 0.72 | 0.005 | పట్టా-మెట్ట | శ్రీ చెన్నారెడ్డి సుబ్బారామి రెడ్డి తండ్రి వెంకు రెడ్డి | 445 | 447/5 | 446 | 445 | బీడు |
| 4 | 542-1బి2 | 2.13 | 0.005 | పట్టా-మాగాణి | శ్రీ మేనకూరు సీతారామి రెడ్డి తండ్రి వీరరాఘవ రెడ్డి | 542-2 | 537 | 542-1బి1 | 542-1బి1 | బీడు |
| 5 | 538-ఎ2 | 0.24 | 0.005 | పట్టా-మాగాణి | శ్రీ మేనకూరు సీతారామి రెడ్డి తండ్రి వీరరాఘవ రెడ్డి | 805-2 | 537 | 537 | 538-ఎ1 | బీడు |
| 6 | 1220-2ఎ | 2.83 | 0.025 | పట్టా-మెట్ట | శ్రీ గునపాటి ప్రసున్న భర్త విజయ కుమార్ | 1226 | 1220-2బి | 1219 | 913 | 3-(తాడి చెట్లు) |
| 7 | | | 0.025 | పట్టా-మెట్ట | శ్రీ కోటా దీప్తి తండ్రి వేంకటేశ్వర రెడ్డి | | | | | |
| మొత్తం | | | 0.10 | | | | | | | |

ఈ భూమి ప్లాను శ్రీయుత రెవిన్యూ డివిజనల్ అధికారి, నెల్లూరు వారి కార్యాలయంలో ఉంచుటమైనది. దానిని ఈ కార్యాలయపు పనివేళలలో ఎ సమయంలోనైనా తనఖీ చేసుకోనవచ్చును.

బొగ్గుగనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గానీ లేదా ఒక ప్రత్యేక భాగములో గానీ ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూభాగమును మాత్రమే త్రవ్వట గానీ తొలగించుటగాని చేయవలెను.

సం/- శ్రీ ఓ.ఆనంద్, I.A.S., కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

వార్త

జీవితంలో ప్రతి నిముషాన్ని వ్యర్థం చేయక ఉపయోగించుకో. లేకుంటే నీవు వృథా చేసినట్టి కాలం భవిష్యత్తులో నీ అదృష్టాన్ని తారుమారు చేయగలదు.

-నెపోలియన్

# ఎండ ప్రచండం

దేశంలో ఎక్కడ చూసినా సాధారణ స్థాయి కన్నా అధికంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదై ఎండలు ప్రచండరూపం దాలుస్తున్నాయి.ఏప్రిల్ నెల మొదలు జూన్ నెలాఖరు వరకూ దాదాపు మూడు నెలలపాటు ఎండ వేడిమి ఎక్కువ ఉండే అవకాశం ఉంటుందని వాతావరణశాఖ ముందే హెచ్చరించింది. ఏప్రిల్ నుంచి ఉత్తర,ఈశాన్య భారతదేశంలోనే కాకసెంట్రల్ ఇండియా వాయవ్య భారతదేశంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని కేంద్ర వాతా వరణశాఖ చీఫ్ మృత్యుంజయ మహాపాత్ర హెచ్చరిస్తున్నారు. సాధారణంగా భారతదేశంలో వేసవి సీజన్‌లో నాలుగు నుంచి ఏడువరకు హీట్‌వేవ్ డేస్ నమోదవడం సామాన్యం. వాయవ్య ప్రాంతంలోనూ హీట్ వేవ్ అధిక స్థాయిలో ఉండబోతోంది. ప్రధానంగా తెలుగురాష్ట్రాల్లో ఎండల పరిస్థితి గతంలో ఎన్నడూ లేనట్టుగా తయారైంది. తేమశాతంలో మార్పులు కారణంగా జనం కొలిమిలో ఉన్నట్లుగా ఉంటుంది.రాజస్థాన్, గుజరాత్, హర్యానా, పంజాబ్, మహారాష్ట్ర,మధ్యప్రదేశ్, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ తెలంగాణలలో కూడా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఇలాంటి వాతావరణ పరిస్థితులు కారణంగా విద్యుత్ వినియోగం పెరిగే అవకాశం ఉంది. గత యేడాది మే 30వ తేదీన దేశవ్యాప్తంగా 250 గిగావాట్ల విద్యుత్ వినియోగం జరిగినట్లు కేంద్ర విద్యుత్‌శాఖ నమోదు వివరాలు చూస్తే తెలుస్తుంది.ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే ఈ యేడాది ఇంత వరకు 10 గిగావాట్ విద్యుత్ వినియోగం సూచిస్తోంది. ఇప్పటికే గత రెండునెలల ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే ఎండలు వడగాల్పులకు దేశంలో అనేక ప్రాంతాలు అట్టుడికిపోతున్నాయి. రానున్న మూడునెలల్లో ఎండ తీవ్రత గతాన్నిమించి ఉంటాయని భారత వాతావరణశాఖ హెచ్చరిస్తోందంటేనే జనంలో గుబులు బయలుదేరింది. ఏప్రిల్ నుంచి జూన్ వరకూ పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణానికి మించి నమోదుకానున్నాయి. ఈ మూడు నెలల వేసవి సీజన్ బులెటిన్‌ను సోమవారం నాడు వాతావరణశాఖ విడుదల చేసింది.దక్షిణాది రాష్ట్రాలలో వడగాల్పులు ప్రభావంఎక్కువగా ఉంటుంది. ఉత్తరాదికన్నా దక్షిణాదిలో సగటు కంటే ఎక్కువ వడగాల్పులు వీచే అవకాశ ముంటుంది. ఈ యేడాది మూడు నెలల సీజన్‌లో ఐదు నుంచి ఎనిమిది రోజులు గాడ్పులు వీస్తాయని వాతా వరణశాఖ హెచ్చరిక. ఏప్రిల్ నెలలో దేశంలో 39.2మి.మీ వర్షపాతం నమోదు కావాలి. కానీ గడచిన రెండునెలల కాలంలో దేశంలోని అనేక ప్రాం తాలలో వర్షపు చినుకుపడలేదు. దాంతో నేల పొడిగా మారింది. ఆ కారణం చేతనే ఎండలు, వడగాల్పులు పెరిగాయని వాతావరణ నిపుణులు అంచనా లిస్తున్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులను బట్టి హీట్ వేవ్ కోర్ జూన్‌లో 10,అంతకంటే ఎక్కువ రోజులు వడగాల్పులు వీచే అవకాశం ఉంది. మార్చిలోనే చాలా చోట్ల40 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న మూడు నెలల కాలంలో 45డిగ్రీల దాకా, అక్కడక్కడ మరింత ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆ రోజుల్లో ఎండలు వడగాల్పుల ప్రభావం నుంచి తట్టుకునేలా కేంద్ర, రాష్ట్రవిప త్తుల నిర్వహణ సంస్థలు వేసవి ఉపశ మన ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని తాజా బులెటిన్‌లో కోరింది. వృద్ధులు, చిన్నపిల్లల విషయంలో బాలింతలు, ఆరోగ్యపర సమస్యలను ఎదుర్కొనే వారు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఎప్పటికప్పుడు వడగాల్పుల సమాచారాన్ని అందించడం, నగర ప్రాంతాల్లో అర్బన్ హీట్ ఐలండ్స్‌ను గుర్తించి చలవ కేంద్రాలను ఏర్పాటు చేయమని వాతావరణశాఖ ఆయా ప్రభుత్వాలకు సూచించింది. ఐఎండి హెచ్చరికల నేపథ్యంలో వేసవిలో పాటించాల్సిన జాగ్రత్తలను రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ విస్తృతస్థాయిలో ప్రచారానికిదింపుతోంది. గత వారం, పది రోజులుగా తెలుగు రాష్ట్రాలలో గాలిలో తేమ శాతంపడిపోయి, తీవ్రవేడిమితో జనం ఆపసోపాలు పడుతున్నారు. తేమశాతం పెరగడానికి కారణం భూతాపమేనని, చెట్ల సంఖ్య తగ్గిపోవడం, కాలుష్యం బాగా పెరిగిపో వడం నీటివనరులు ఎండిపోవడమే దీనికంతకూ ప్రధాన కారణంగా శాస్త్రజ్ఞుల విశ్లేషణ. మొన్నోరోజున ఆదిలాబాద్ పగటిపూట ఉష్ణోగ్రత 41.8 డిగ్రీలుగా నమోదయింది. సాధారణం కన్నా 2.9డిగ్రీల సెల్సియస్ పెరిగింది. మరి కొంతమేరకు ఎండలు, వడగాల్పుల సమయంలో బయట ప్రాంతాల్లో ప్రత్యేక పనులున్నా వాటిని వాయిదా వేసు కుని వీలైనంతవరకు ఇంట్లోనే కాలక్షేపం చేయాలని వారి ప్రధాన సూచనగా ఉంది. వేడి నుంచి ఉపశమనం కలిగించే ఫ్యాన్లు,కూలర్లు, ఎసిలు వాడుకోవడం అవసరం ఉంది. దాహం ఉన్నా లేకున్నా మంచినీరు బాగా తాగాలని, రాత్రివేళ చన్నీటితోనే స్నానం చేయాలి. ఉప్పు కలి పిన మజ్జిగ, గ్లూకోజ్, ఓఆర్ఎస్ ద్రావణాలను తరుచు సేవించాలి. కళ్లద్దాలు పెట్టుకోవడం శ్రేష్టం. ఎండలో ఒకవేళ బయటకు వెళ్లాల్సివస్తే చాలా జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. ఇలాంటి సూచనలతో కూడిన కరపత్రా లను పబ్లిక్ కేంద్రాలలో ఉంచడమే కాకుండా వైద్యసేవల్ని అందుబాటులో ఉంచాలి. ఇలాంటి సూచనలతోపాటు వైద్యసేవా కేంద్రాలను సిద్ధం చేయాల్సి ఉంది. రాష్ట్రాల వారీ వర్షపాతం గతంలోని సాధారణం కన్నా తక్కువఉంటుంది. కనుక నీటిఎద్దడి ఏర్పడే అవకాశాలు కూడాఉన్నాయి. నీటి వనరుల నిర్వహణలో ఏమాత్రం లోపంఉన్నా వేసవివ్యాధుల తీవ్రత ఉంటుంది. వీటన్నిటి నుంచి ప్రజల్ని కాపాడేందుకు యుద్ధప్రాతిపదిక మీదచర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలు చేపట్టాలి.



మన వైఖరి సవరించుకోవడం ద్వారా జీవితాన్ని మెరుగుపర్చుకోవచ్చు.

స్వామి వివేకానంద



మాట్లాడిన మాట, వదిలిన బాణం, జరిగిన కాలం, వదులుకున్న అవకాశం ఈ నాలుగు వెనక్కిరావు.

ప్లినీ

# ప్రజావాక్కు



## పాలకులు వాస్తవాన్ని గుర్తిస్తారా?

అన్ని ఫ్రీఫ్రీ అంటూ ఓట్లకోసం జనాన్ని ఆకట్టుకుంటున్నారు. ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితికి తెలుగు రాష్ట్రాలను తెచ్చారు. అప్పులుఅనేవి ఫ్రీగా రావనే వాస్తవాన్ని పాలకులు గుర్తించాలి. ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టీ మరీఅప్పులు తీసుకొస్తున్నారు. పరిధికి మించి అప్పులు చేస్తే అప్పులు కూడా పుట్టని స్థితికి వస్తారు. ఆయా రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని చూసి అప్పులు చేసే విధానం రావాలి. ప్రజలకు ఉపయోగపడే ప్రాజెక్టులపై పాలకులు దృష్టిపెట్టాలి.భావితరాలగురించి ఆలోచించాలి. విద్య, వైద్యం తప్ప మరేదీ ఫ్రీగా ఇవ్వకూడదు. మన భవిష్యత్తుకు మనమే ఓటు వేస్తున్నామనే విషయాన్ని ప్రజలు గమనించాలని ఈ మధ్యనే విజయవాడలో నిర్వహించిన ఒక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడుగారు అన్న ఈ మాటలు ఎంతో స్ఫూర్తినిచ్చి ఆలోచింపజేసే విధంగా ఉన్నాయి.ఇప్పటికైనా పాలకులుఈవాస్తవాన్ని గుర్తించాలి.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

## పాఠ్యాంశాల బోధనలో వ్యత్యాసం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య 49శాతం ఉండగా ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలో చేరుతున్న విద్యార్థులసంఖ్య 51శాతం ఉండడం ప్రమాదసూచిక. విద్య,వైద్యం,విద్యుత్తురోడ్డు, రవాణా, త్రాగునీరు నిర్వహించడం ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాల బాధ్యత. నిజానికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడానికి గల కారణం గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు నివసించడానికి ఇష్టపడకపోవడం.రెండవ కారణం ప్రైవేటు పాఠశాలల్లో కళాశాలలో పాఠ్యాంశాలకు ప్రభుత్వ పాఠశాలల్లో కళాశాలలోపాఠ్యాంశాలకు చాలా బేధం ఉన్నది.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## వ్యాయామంతో ఆరోగ్యం

ఆహారమే నిజమైన ఔషధం అని వైద్య శాస్త్ర పితామహుడు హిపోక్రేట్స్ చెప్పారు. వైద్యులు ఈ విషయాన్ని చెప్పకుండా రోగాలకు మందులురాస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. మంచి ఆహారం తీసుకోవడం, వ్యాయామం చేయడం, విశ్రాంతి తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని ప్రజలు గుర్తించాలి.

-పుట్లూరి రాంనర్సింహా రెడ్డి, నల్లగొండ జిల్లా

## బ్లడ్ బ్యాంకులను ఏర్పాటు చేయాలి

కార్పొరేట్ హాస్పిటల్స్‌లో అత్యవసర వైద్యం కోసం చేరిన రోగులకు ఆపరేషన్ పడినప్పుడు ఫలానా గ్రూప్‌కు సంబంధించిన బ్లడ్ తీసుకురమ్మని రోగులవెంట వచ్చినవారిని తొందరచేస్తారు. ఏదో ప్రాంతం నుంచి హైదరాబాద్ వచ్చిన వారు లేదా ఇక్కడే నివసిస్తున్న వారు అర్జెంటుగా ఎక్కడికి వెళ్ళి తేవాలి. లేదా అదే బ్లడ్ గ్రూప్ ఉన్న మనుషులను సిద్ధం చేసిపెట్టుకోవాలి. అడిగినంత డబ్బు కట్టినప్పుడు అన్నీ అక్కడే సమకూర్చాలి. అంతేకాని రోగుల బంధువులో, మిత్రులో, లేదా తెలిసిన వారో ఎక్కడికో ఉరుకుల పరుగుల మీద వెళ్లి తీసుకురావడం మిక్కిలి శ్రమతో కూడిన పని. అందుచేత ప్రతీ కార్పొరేట్ హాస్పిటల్ లోనూ బ్లడ్‌బ్యాంకులను ఏర్పాటు చేయాలి. రోగులను ఇబ్బంది పాలు చేయడం సమ్మతం కాదు. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఏర్పాటుకుహాస్పిటల్స్ మేనేజ్‌మెంటువారికి ఆదేశపూర్వక సలహా ఇవ్వాలి.కేంద్రప్రభుత్వం కూడా ఈవిషయంలోశ్రద్ధ వహించాలి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## బంగ్లా, భారత్ మధ్య సయోధ్య

బంగ్లా మధ్యంతర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ యూనిస్ ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నిక అయినవాడు కాదు అని గుర్తుంచుకోవాలి. ఆయన భారత్ నన్ను పట్టించుకోవడం లేదు అని చైనా పర్యటనలో వాపోవడం విడ్డూరం. పైగా చైనా కి వెళ్లి భారత ఈశాన్య ప్రాంతానికి సముద్ర తీరం లేదని కావున చైనా ఈ అవకాశాన్ని వినియోగించుకొని ముందుకు వెళ్లాలి. ఇలాంటి వంకర మాటలు మాట్లాడి తనపాడుబుద్ధిని బయట పెట్టుకున్నాడు. కాని భారత్‌తో ఉన్న జల సంబంధాన్ని, సాంస్కృతిక సంబంధాన్ని యూనిస్ మరిచిపోతున్నాడు. ఒకవేళ గంగా నది జలాలు ఆపేసిన లేదా కుషియారా నది జలలపైన భారత్ ఆపితే ఆ దేశానికి గుండెకాయ వంటి రహీంపూర్ కాలువ ఎండిపోతుందని, వ్యవసాయరంగం కుదేలు అవుతుందని యూనిస్ మరిచిపోతున్నాడు.

-భారత అవినాష్, జనగామ

## కల్తీని అరికట్టాలి

ఆహారభద్రతా నిబంధనలను పాటించని కల్తీరాయుళ్లను చైనా, బంగ్లాదేశ్‌లు మరణశిక్ష విధిస్తున్నాయి. స్పెయిన్, ఫ్రాన్స్, బ్రెజిల్, అమెరికా వంటివి నిరంతర తనిఖీలతో జనారోగ్య పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. వారి స్ఫూర్తితో దేశీయంగాను కల్తీరాయుళ్లపై ఉక్కుపాదం మోపి కల్తీని అరికట్టాలి.

-మా.శ్రీ.రాజు, పాల్వంచ

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# నైపుణ్య విద్యకు ప్రాధాన్యత పెరగాలి

**భాష,సంస్కృతి వివిధ నేపథ్యాల వలన అభ్యసనలో వెనుకబడిన విద్యార్థుల సమస్యలను పరిష్కరించి వారినివయసు,తరగతి వారీ విద్యాసామర్థ్యాలు గడించేలా పాఠశాల యాజమాన్యాలు వ్యూహరచన చేసుకోవడం,ప్రాథమిక పాఠశాలల్లో బహుళ తరగతి, పిల్లల ఉపాధ్యాయుల నిష్పత్తి సమపాళ్లలో సమకూర్చుకోవడం, పిల్లల హాజరు తగ్గుదల, విద్యార్థుల సామర్థ్యాలను బేరీజు వేయకుండా సిలబస్ ఆధారిత బోధనవైపే దృష్టిపెట్టడం, సాంప్రదాయ బోధనా విధానాలకు స్వస్తిపలికి అనుభవాత్మక స్టెమ్ ఆధారిత విద్యద్వారా టీచింగ్ లెర్నింగ్ ప్రక్రియ లో పిల్లల భాగస్వామ్యాన్ని బలపరచడం ప్రధానాంశాలుగా గుర్తించినప్పుడే నూతన విద్యావిధాన స్ఫూర్తిని కాపాడగలం. నాణ్యమైన విద్యకు నగిషీ పెట్టగలం. తద్వారా ఉన్నత విద్యాస్థాయిలో అనగా 9,10 తరగతుల్లో ఎదురవుతున్న 12.6 శాతం డ్రాప్ అవుట్‌ని తగ్గించగలం.**



మల్లాడి శ్రీనగేష్

నూతన విద్యా విధానం 2020 దేశ విద్యావ్యవస్థలో ఓ విప్లవాత్మక మార్పును తీసుకురావాలని తద్వారా విద్యార్థుల పూర్తిస్థాయి ప్రతిభా పాటవాలను వెలికి తీసి సంపూర్ణమూర్తిమత్వంతో వికసించేలా తీర్చిదిద్దాలని, బహుళరంగ, పరిశోధనాత్మక విద్యా ప్రాధ్యానతను పెంపొందించాలనేది నూతన విద్యావిధాన ప్రధాన భూమికగా చెప్పవచ్చు. 34 సంవత్సరాల తర్వాత అనగా 1986 విద్యావిధాన రూపకల్పనను స్ఫూర్తిగా పరిగణించి 21వశతాబ్దపు నైపుణ్యాల పరిగణలోనికి తీసుకొని ఓ విప్లవాత్మక విద్యావిధానాన్ని రూపొందించి భారతదేశంలో ప్రతి ఒక్కరికి ఆర్థిక, సామజిక, వర్గ, మత, కుల లింగ లేదా దైవాంగులనే వివక్ష లేకుండా అందరికీ పరిపూర్ణమైన సమగ్రాభివృధి దిశగా అనుభవాత్మక వృత్తిపరమైన విద్యాలక్ష్యాలను కూడా అనుసంధానం చేయడం ప్రధాన ఉద్దేశ్యం. ఈ దిశగా దేశ యువతను సత్ప్రయోజకులుగా తీర్చిదిద్దడానికి తద్వారా దేశప్రగతిని ఇనుమడింప చేయడానికి నూతన విద్యావిధానం 2020 రూపొందిందని నిపుణులు వక్కాణిస్తూనే వున్నారు. సాంకేతిక పోటీ ప్రపంచంలో యువత చేపట్టాల్సిన ఉద్యోగ వ్యాపారరంగాల నిడివిని అధ్యయనం చేసి తదనుగుణమైన విద్య వృత్తిపరమైన నైపుణ్యాల కల్పనలను పరిగణనలోనికి తీసుకొని విద్యార్థి దశ నుండి ఆయా కీలకాంశాలను కరికులంతో అనుసంధానం చేసి పాఠశాల ఉన్నత విద్యాస్థాయి ప్రమాణాలను మెరుగుపరచడం తద్వారా చదువును మరింత నిర్మాణాత్మకమైన దిశలో కొనసాగించడానికి నూతన విద్యావిధానం ఓ సమగ్ర రీతిన విద్యాప్రణాళికలు రచించేలా పూర్తివెసులుబాటు కల్పించింది. ఈ దిశగా విద్యార్థులను ప్రాథమిక ఉన్నత విద్యలో తీర్చిదిద్దినట్లయితే భవిష్యత్తరాల్లో కొత్త తరాల ఉద్యోగరంగాల్లో ప్రతివిద్యార్థి రాణించడానికి వెసులుబాటు కల్పించడం ఈవిద్యా విధాన ప్రధాన భూమికగా అవగతమోతోంది. అనగా 1964లో కొఠారి కమిషన్, 1952 సెకండరీ ఎడ్యుకేషన్ కమిషన్ , 1986, 2019 విద్యావిధాన ప్రతిపాదనలు నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ట్రైనింగ్ సర్విస్ సిఫార్సులు కూడా ఈ నూతన విద్యావిధాన రూపకల్పనలో పరిగణనలోనికి తీసుకున్నట్టు అవగతమోతోంది. దీనికితోడు నైపుణ్యాధారిత విద్యను ప్రోత్సహించడం తద్వారా విద్యాహక్కు చట్టం 2009లో పొందుపరచిన బడుగుబలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోనికి తీసుకురావడానికి మౌలిక వసతుల కల్పన,ఉపాధ్యాయుల వృత్తినైపుణ్యాల పెంపు కులవర్గ భాష, ప్రాంత, లింగ వివక్షలేని సమ్మిళిత అందరికీ సమాన విద్యను అందించడం అనే ప్రాథమిక సూత్రాన్ని దృష్టిలో ఉంచుకొని చదువుకే తొలితరమైన కుటుంబ విద్యార్థులకు పటిష్టమైన పునాది ఏర్పరచడానికి పూర్వప్రాథమిక విద్యను అందించడం, కరికులంలో స్థానికతను జోడించడం వంటి మూలసూత్రాలునూ తన విద్యావిధానానికి వెన్నెముకలుగా చెప్పవచ్చు. ఈ విద్యావిధానం విద్యార్థులను సాధికారత దిశగా ప్రోత్సహించడమేకాక విద్యాహక్కు చట్టాన్ని పూర్వ పాథమిక విద్యాస్థాయి వయసును కూడా జోడించి 318 వయసువరకు ప్రతిపాదించి సుస్థిర అభివృద్ధి లక్ష్యం 4ప్రకారం 2030 సంవత్సరాంతానికి నిర్దేశించబడిన నాణ్యమైన విద్యాలక్ష్యాల సాధనలో మనదేశం పాత్రను కూడా ఒక ప్రధాన అజెండాగా రూపొందించిందని నిపుణులు చెబుతున్నారు. ఎందుకనగా ప్రతివిద్యార్థి ఈవిద్యావిధాన అమలుతో ఆధునిక ప్రపంచంలో ప్రామాణికాలుగా పరిగణించబడ్డ 21వశతాబ్దపు నైపుణ్యాలను పుణికి పుచ్చుకొనేలా విద్యావ్యవస్థను బలపరచాలనేదే మూలసూత్రంగా, ఉపాధ్యాయులను ప్రాతిపదికన నిరంతర శిక్షణా కార్యక్రమాల ద్వారా వారి వృత్తి




నైపుణ్యాలను పెంపొందించడం, కరికులంలో స్థానికతను జోడించడం, పుస్తకాంశాలే కాకుండా జీవననైపుణ్యాల ఒరవడిని కూడా పాఠశాల విద్య నుండి అభ్యసనా ప్రక్రియలో జోడించడం వంటి కీలకాంశాలు విద్యార్థుల్లో కిశోర దశకు చేరుకున్న యువతీయువకులకు వారిభవిష్యత్తు నిర్మాణంలో అనుసరించాల్సిన మార్గదర్శకాలను కూడాజోడించడం ఒక ప్రధాన భూమికయని చెప్పవచ్చు. గిరిజన, వెనుకబడిన ప్రాంతాలలో స్పెషల్ ఎడ్యుకేషన్ జోన్లఏర్పాటు ద్వారా పాఠశాల విద్యలో అడుగిడిన మొదటి జనరేషన్ కుటుంబాలకు పూర్వ ప్రాథమిక విద్యతోబాటు ఉన్నతవిద్యను ప్రోత్సహించడానికి కూడాప్రాధాన్యతను అందించింది. ఈలక్ష్యాల దిశగా ప్రస్తుతమున్న పరిస్థితులను విశ్లేషించి సంస్కరణ దిశగా అడుగులు వేయడం, ఈ విధాన అమలుకు చేపట్టిన కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేసే యంత్రాంగాలను ఏర్పరచడం, పూర్తి నిబద్ధతతో పాఠశాల విద్యకు క్రొత్తరూపును తీసుకురావడం అనేదీ మనందరికి ముందున్న సవాలు. ఈవిధానం విద్యార్థిజ్ఞానాన్ని పెంచడానికే కాకుండా సంపూర్ణమూర్తిమత్వాన్ని సాధించడానికి ఉపకరించే 21వశతాబ్దపు నైపుణ్యాలను అనగా క్లిష్టమైన ఆలోచన, విశ్లేషణ , అనుభవాత్మక విద్య, సృజనాత్మకత, కమ్యూనికేషన్ వంటి విషయాలను ప్రత్యేకంగా యోచించి విద్యావిధాన రూపకల్పన దాని స్వరూప స్వభావాన్ని ఆమోదించడం జరిగింది. అంతేకాక విద్యార్థి తన మాతృభాషలో చదువుకొనే వెసులుబాటు కల్గించడం అంటే విద్యార్థి ప్రాథమిక ఉన్నత విద్య వరకు తాను మాతృభాషలో చదుకొనే అవకాశం ఏర్పరచింది. తద్వారా మాతృభాషలో చదువుకొనే వెసులుబాటు కల్పించడంవలన చదువుతో బాటు మనోబలాన్ని అందించడానికి చక్కటి వెసులుబాటు కల్గిస్తుంది. త్రిభాషా సూత్రం కొన్ని రాష్ట్రాల్లో వ్యతిరేకత కనబరచినా విద్యార్థులు మాతృభాషలో చదువుకున్నా స్థానికేతర భాషల్లో కూడాప్రావీణ్యం, ప్రవేశం సాధిస్తే మరిన్ని అవకాశాలు అందిపుచ్చుకోవడంలో అదనపు అర్హతగా కూడా భావించవచ్చుయనేది కూడా ఓప్రత్యేక అంశంగా చూడవచ్చు. ఈ విద్యావిధానం నిజమైన స్ఫూర్తితో రూపుదాలిస్తే దేశంలో పిల్లలు ఎదుర్కొంటున్న అభ్యసనా సామర్థ్యాల సవాళ్లకు ఒక సమాధానమేకాక ఉన్నత విద్యలో విద్యార్థులు సులభంగా తాము అనుకున్న విద్యా లక్ష్యాలను సాధించడానికి తద్వారా దేశం సమ్మిళిత విద్యాచక్రంలో వివిధ నేపథ్యాల నుండి పాఠశాలకు వచ్చేవిద్యార్థులకు అందరికీ నాణ్యమైన సమాన విద్యా సామర్థ్యాలు సమకూర్చడానికి సానుకూలత ఏర్పడుతుంది. దీనికితోడు విద్యార్థికి పటిష్టమైన పునాది ఏర్పరచడానికి ప్రాథమికస్థాయిలో ఫౌండేషనల్లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమాన్ని బలోపేతం చేయడంద్వారా ప్రాథమిక పాఠశాలల్లో 2026-27వ సంవత్సరానికి విద్యార్థి మూడవ తరగతికి చేరే నాటికీ అవగాహనతో చదవడం, రాయడం గణిత సామర్థ్యాలు సాధించడం తద్వారా ఎలిమెంటరీస్థాయికి విద్యార్థి చేరే నాటికి ప్రతివిద్యార్థీ తమ తరగతిస్థాయి విద్యాసామర్థ్యాలు సాధించడం, తదనుగుణంగా ఉపాధ్యాయులను అన్నిస్థాయిల్లోనూ తగిన నైపుణ్యాలతో సంసిద్ధం చేయడం వంటి కీలకాంశాలు సమ్మిళిత విద్యా లక్ష్యసాధనలో నూతన విద్యావిధాన ప్రధాన భూమికయని చెప్పవచ్చు. ఈప్రక్రియలో పాఠశాలలు తమపాఠశాలకు వచ్చే ప్రతివిద్యార్థి నేపథ్యాన్ని,పరిగణలోకితీసుకోవడం, అనువైన బోధనా వ్యూహాలను రచించుకోవడం, తరగతిని చైల్డ్‌ఫ్రెండ్లీ తరహాగా తీర్చిదిద్దడం,భారంలేని విద్యను అందించడం ద్వారా జాతీయ విద్యాచట్రం (నేషనల్ కరికులం ఫ్రేమ్‌వర్క్) ప్రధాన సూత్రాన్ని కూడా బోధనా విధానంలో తు.చ తప్పక పాటించడం కూడా నూతన విద్యావిధాన ప్రధాన లక్ష్యంగా చెప్పవచ్చు. మరోకవైపు, భాష, సంస్కృతి వివిధ నేపథ్యాల వలన అభ్యసనలో వెనుకబడిన విద్యార్థుల సమస్యలను పరిష్కరించి వారినివయసు, తరగతి వారీ విద్యా సామర్థ్యాలు గడించేలా పాఠశాల యాజమాన్యాలు వ్యూహరచన చేసుకోవడం, ప్రాథమికపాఠశాలల్లో బహు ళతరగతి, పిల్లల ఉపాధ్యాయుల నిష్పత్తి సమపాళ్లలో సమకూర్చుకోవడం, పిల్లల హాజరు తగ్గుదల, విద్యార్థుల సామర్థ్యాలను బేరీజు వేయకుండా సిలబస్ ఆధారిత బోధనవైపే దృష్టిపెట్టడం, సాంప్రదాయ బోధనా విధానాలకు స్వస్తిపలికి అనుభవాత్మక స్టెమ్ ఆధారిత విద్యద్వారా టీచింగ్ లెర్నింగ్ ప్రక్రియలో పిల్లల భాగస్వామ్యాన్ని బలపరచడం ప్రధానాంశాలుగా గుర్తించినప్పుడే నూతన విద్యా విధాన స్ఫూర్తిని కాపాడగలం. నాణ్యమైన విద్యకు నగిషీ పెట్టగలం. తద్వారా ఉన్నత విద్యాస్థాయిలో అనగా 9,10 తరగతుల్లో ఎదురవుతున్న 12.6 శాతం డ్రాప్‌అవుట్‌ని తగ్గించగలం. •

# అంధత్వ నివారణకు చర్యలు చేపట్టాలి

రామ కిష్టయ్య సంగన భట్ల

భారత దేశంలో ఏటా ఏప్రిల్ 1 నుండి 7వ తేదీ వరకు నిర్వహించబడే అంధత్వ నివారణ వారోత్సవాలు, దేశ ప్రజలందరి దృష్టిని ఒక ముఖ్యమైన ప్రజారోగ్య సమస్య వైపు మరల్చే ప్రయత్నం. అంధత్వం తీవ్రతను, దాని నివారణకు గల మార్గాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ వారోత్సవాల ప్రధాన ఉద్దేశం. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ ది ప్రివెన్షన్ ఆఫ్ బ్లైండ్నెస్, నేషనల్ సొసైటీ ఫర్ ది ప్రివెన్షన్ ఆఫ్ బ్లైండ్‌నెస్, వంటి అంతర్జాతీయ జాతీయ సంస్థలు ఈ కార్యక్రమాలను సమన్వయ పరుస్తూ, అంధత్వరహిత సమాజంకోసం కృషి చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా చూస్తే దాదాపు 2.2 బిలియన్ మంది ప్రజలు ఏదో ఒకరూపంలో కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. వీరిలో చాలా మందికిసరైన సమయంలో చికిత్స అందిస్తే నయం చేయగల సమస్యలే ఉండటం గమనార్హం. కానీ,సరైన అవగాహన లేకపోవడం, వైద్య సదుపాయాలు అందుబాటులో లేకపోవడం వంటి కారణాల వల్ల ఈసమస్యలు ముదిరి అంధత్వానికి దారితీస్తున్నాయి. భారతదేశంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. దాదాపు 43 మిలియన్ మంది దృష్టిలోపంతో బాధపడుతుండగా, వీరిలో 90శాతం మందికి నివారించదగిన సమస్యలే ఉండటం విచారకరం. అంధత్వ నివారణ వారోత్సవాలు కేవలం ఒక లాంఛనప్రాయ కార్యక్రమం కాదు. ప్రజల్లో కంటి ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెంచడానికి ఒక గొప్ప అవకాశం. సకాలంలో కంటి పరీక్షలు చేయించుకోవడం ప్రాముఖ్యతను, కళ్లను సురక్షితంగా ఉంచుకోవాల్సిన అలవాట్లను ఈవారం సందర్భంగా విస్తృతంగా ప్రచారం చేస్తారు. దేశవ్యాప్తంగా ఉచిత కంటి పరీక్షల శిబిరాలు ఏర్పాటు




చేయడం, కంటి ఆరోగ్యంపై అవగాహన సదస్సులు నిర్వహించడం, ప్రజల్లో చైతన్యం నింపే ర్యాలీలు చేపట్టడం వంటి కార్యక్రమాలు జరుగుతాయి. అంతేకాకుండా, ప్రజారోగ్య ప్రదర్శనల ద్వారా అంధత్వ నివారణ చికిత్సా పద్ధతులను,అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞాన పరిష్కారాలను పరిచయం చేస్తారు. ఈ కార్యక్రమాలలో ప్రభుత్వ సంస్థలతోపాటు ఇతర స్వచ్ఛంద సంస్థలు కూడా భాగస్వామ్యం వహిస్తాయి. భారత ప్రభుత్వం 1976లోనే జాతీయ అంధత్వ నియంత్రణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రస్తుతం ఇది 100శాతం కేంద్ర ప్రభుత్వ నిధులతో కొనసాగుతున్న ఒక ముఖ్యమైన పథకం.ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం 2025 నాటికి దేశంలో అంధత్వం ప్రాబల్యాన్ని 0.3శాతానికి తగ్గించడం. దీనికోసం ప్రభుత్వం వివిధ రకాల చర్యలు తీసుకుంటోంది. కంటి శస్త్రచికిత్సలు అందుబాటులోకి తేవడం, కంటి వైద్య నిపుణులను తయారు చేయడం, ప్రజల్లో అవగాహన పెంచడం వంటి కార్యక్రమాలు ఈ పథకంకింద కొనసాగుతున్నాయి. అంధత్వనివారణ వారోత్సవాలు మనందరికీ ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇస్తున్నాయి. కంటి ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించకుండా, చిన్నసమస్య వచ్చినప్పుడే వైద్యులను సంప్రదించడం చాలాఅవసరం. ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా అంధత్వాన్ని నివారించవచ్చు. ఈవారోత్సవాలు కంటి ఆరోగ్యంపై అవగాహన పెంచడంలోనూ, ప్రతిఒక్కరికీ స్పష్టమైన చూపును అందించాలనే లక్ష్యాన్ని చేరుకోవడంలోనూ ఒక కీలకమైన పాత్ర పోషిస్తాయి. రేపటి తరం అంధత్వ రహిత భారతదేశంలో జీవించేలా మనవంతు కృషిచేద్దాం.కంటిసమస్యలను ముందుగానే గుర్తించి,సరైన నివారణ చర్యలు తీసుకోవడం ద్వారా మనజీవితాల్లో వెలుగు నింపుకుందాం. •

# సామాన్యుల చెంతకు సంతోషం చేరేదెన్నడు!

ఐ.ప్రసాదరావు

ఈ సంవత్సరం వివిధ దేశాలకు ప్రపంచ సంతోష ర్యాంకులు ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీలోని వెల్ బీయింగ్ రిసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో భారత దేశం 118వ స్థానంలో ఉండుట పట్ల మన స్థాయి ప్రపంచానికి తెలియవచ్చింది. మనం ఎంతో అభివృద్ధి సాధించేసేము అని, త్వరలో 500 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందుతుంది అని తెలుపుతున్న నేటి పాలకుల మాటలకు అర్థాలే వేరులే అన్నట్లు ఈ సంతోషసూచిక ఒక మేలుకొలుపుగా మేల్కొల్పింది. మనదేశానికి స్వాతంత్రం వచ్చి, సుమారు 78 సంవత్సరాలు పూర్తి అవుతున్నా నేటికీ అందరికీ విద్య, నాణ్యమైన విద్య ఆమడదూరంలో ఉంది. కుల వివక్షత కొనసాగుతూనే ఉంది. ఆర్థిక అసమానతలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. మహిళల పట్ల చిన్నచూపు కొనసాగుతూనే ఉంది. అందుచేతనే మనం గతం కంటే కొన్ని విషయాల్లో మెరుగ్గా ఉన్నా, చాలా విషయాల్లో వెనుకబడి ఉండుటచే సంతోష సూచికలో చాలా వెనుకబడి ఉన్నామని తేటతెల్లం చేస్తోంది. ఆదాయ వ్యయాలు, వృద్ధి, వ్యక్తుల మధ్య సంబంధబాంధవ్యాలు, పరస్పర నమ్మకం, ఆత్మ సంతృప్తి, ఆయురారోగ్యాలు, సామాజిక మద్దతు, స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం, దానగుణం, అవినీతి స్థాయి వంటి వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుని సంతోష సూచికలు కేటాయిస్తారు. ఈ క్రమంలో మనం 118వ స్థానంలో నిలిచింది. మనకంటే పెద్ద దేశం అయిన చైనా 68వ స్థానంలో నిలిచింది. గొప్పగా చెప్పుకునే అమెరికా 24వ స్థానంలో ఉండుట గమనించదగిన విషయం. ఇక ప్రపంచంలోనే సంతోష సూచికలో మొదటి స్థానంలో 'ఫిన్లాండ్' నిలువగా, తరువాత స్థానాల్లో డెన్మార్క్, ఐస్‌లాండ్, స్వీడన్ నార్వే వంటి దేశాలు ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం ఆయా దేశాల్లో విద్యా వైద్యానికి, నైతిక విలువలకు ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు ప్రభుత్వాలు నిధులు, శ్రద్ధ వహిస్తారు. దురదృష్టవశాత్తూ మనదేశంలో ఈ విద్యా వైద్యరంగాలను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం, అరకొర నిధులు మంజూరు చేయడం, లాభసాటి వ్యాపారంగా మార్చివేసి ప్రైవేటీకరణ ప్రోత్సహించడం వలనే మనం ఆర్థిక సామాజిక రాజకీయరంగాల్లో వెనుకబడి ఉంటున్నాం. అంకెలు, సంఖ్యలు, ర్యాంకులు చూసి మురిసిపోవడం తప్పా, వాస్తవికదృష్టితో చూడటం లేదు. ఇక మన ప్రభు



త్వాల ప్రాధాన్యత మారాలి. ఎన్నాళ్లు ఈ ఉచిత పథకాలు పెంచుకుంటూపోతారు.? అధికార కైవసం కోసమే నేటి పాలకులు పనిచేస్తున్నారు తప్ప, ప్రజలను స్వయంసమృద్ధి సాధించేందుకు కృషి చేయడం లేదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77సంవత్సరాల అయినా, రోజు రోజుకు పేదరికం, నిరుద్యోగం పెరుగుతుంది. దిగుమతులు పెరగడం సర్వసాధారణం అయిపోయింది. కేవలం దేశంలో ఉన్న కార్పోరేట్ వ్యక్తులు, సంస్థలను పెంచి పోషించేందుకు ఈ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయి. లక్షల కోట్ల రూపాయలు మాఫీ చేయడం జరుగుతుంది. ప్రజల సంపద దోచిపెడుతున్న పరిస్థితి.ఇటువంటి పరిస్థితుల్లో మన సంతోష సూచికలో మొదటి వరుసలో ఎలా చేరుకుంటాం అనే ప్రశ్నకు ఇకనైన సమాధానం వెతకాలి. ముఖ్యంగా మన దేశంలో ఉన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. రాజ్యాంగ ఆశయాలు లక్ష్యాలు చేరుకునేందుకు ప్రయత్నాలుచేయాలి.అవినీతిపై ఉక్కుపాదంమోపాలి. పర్యావరణాన్ని రక్షించాలి. ప్రకృతి వనరుల దోపిడికి అడ్డుకట్ట వేయాలి. సెక్యులర్ భావనతో పాలనచేయాలి. సామ్యవాద వ్యవస్థ ఏర్పాటుచేయడానికి సన్నాహాలు చేయాలి. మతోన్మాద శక్తులను నియంత్రించాలి. అందరికీ సమాన అవకాశాలు కల్పించేందుకు కృషిచేయాలి.ప్రజల్లో సమభావం కల్పించాలి. ప్రభుత్వ రంగసంస్థలను కాపాడుకోవడం కోసం పరితపించాలి. పాఠ్యాంశాల్లో నైతిక, మానవ విలువలు జోడించాలి. అక్రమాలను అరికట్టాలి.ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఓటుబ్యాంకు రాజకీయాలకు స్వస్తి పలకాలి. కనీస అవసరాలు తీర్చే ప్రయత్నం చేయాలి. నేటికీ ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో విద్యావైద్య సౌకర్యాలులేవు. త్రాగునీరు లేదు. రహదారులు లేవు. విద్యుత్,రవాణా సౌకర్యాలు లేవు అంటే అతిశయోక్తికాదు.ఇటువంటి పరిస్థితుల్లో 'సంతోషం' అందరికీ ఎలా చేరువవుతుంది. దాదాపుయేనభై కోట్ల మందికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అయినా పేదరికం వెంటాడుతూనే ఉంది. కనీసం మూడు పూటలా తిండితినే పరిస్థితి నేటి పాలకులు అందించే విధంగా చర్యలు చేపట్టాలి. అంతేగానీ, అధికారం కోసంపాకులాడే పథకాలు అమలుచేస్తూ కాలం గడపరాదు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పినట్లు'అభివృద్ధి అంటే అద్దాల మేడలు,నాలుగు రహదారులు, ఆరుభవనాలు కాదు' అని ఇకనైనా పాలకులు గ్రహించాలి. ప్రజలు అందరికీవిద్య వైద్యం, కనీస అవసరాలు లభించేలా చేయడం ద్వారానే సంతోషం మన సొంతం అవుతుంది అని గ్రహించాలి.ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించి, ప్రజలు స్వయం సమృద్ధి సాధించేందుకు ప్రభుత్వాలు ప్రయత్నాలు ముమ్మరం చేయాలి. వివక్షతలు, అసమానతలు లేని సమాజ స్థాపనకు నేటి పాలకులు శ్రీకారంచుట్టాలి.అప్పుడే 'సర్వేజనా సుఖినో భవంతు' అనే నానుడి నిజం అవుతుంది. •

# విదేశీ విద్యార్థులపై అమెరికా ఏఐ నిఘా

## అక్రమ వసలదారుల ఏరివేతకూ ఏఐ వినియోగం




**వాషింగ్టన్, ఏప్రిల్ 2:** క్యాంపస్ ఆందోళనల్లో క్రియాశీలంగా వ్యవహరించిన అమెరికాలోని విదేశీ విద్యార్థులకు అక్కడి విదేశాంగ శాఖ హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. కేవలం ఆందోళనల్లో పాల్గొన్న వారినే కాకుండా అక్కడి దృశ్యాలను, జాతి వ్యతిరేక సందేశాలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసిన వారిని స్వచ్ఛందంగా దేశం విడిచి వెళ్లిపోవాలంటూ ఈ మెయిల్స్ పంపిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఓ కీలకమైన విషయం వెలుగులోకి వచ్చింది. హమాస్ అనుకూల ఉగ్రవాద గ్రూపులకు మద్దతిస్తున్న విదేశీ విద్యార్థులను గుర్తించడానికి వారిపై నిఘా పెట్టడానికి అమెరికా ప్రభుత్వం ఏఐ సాంకేతికతను ఉపయోగిస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఉగ్రవాద అనుకూల పోస్టులు, స్టోరీలకు ఇన్‌స్టాలో లైక్ కొట్టినా దొరకబుచ్చుకునేలా ట్రంప్ యంత్రాంగం సాంకేతికతను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నాయి. యుఎస్ విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో నాయకత్వంలో అధికారులు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. 2023 అక్టోబరు 7న హమాస్ ఇజ్రాయెల్‌పై దాడి చేసిన నాటి నుంచి ఇప్పటివరకు వారికి మద్దతుగా ఎవరెవరు సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టులు చేశారు, ఎవరు వాటిని లైక్, షేర్ చేశారనే విషయాలు తెలుసుకోవడానికి విదేశీ విద్యార్థుల సోషల్ మీడియా ఖాతాలను స్కాన్ చేస్తున్నట్లు యాక్సియోస్ అనే నివేదిక వెల్లడించింది. నివేదికలోని వివరాల ప్రకారం.. విదేశీ విద్యార్థుల సోషల్ మీడియా ఖాతాలపై కొంతకాలంగా ఏఐ నిఘా కొనసాగుతోంది. విద్యార్థులు వారు చేసిన పోస్టులను తొలగించినప్పటికీ ప్రభుత్వ విభాగాల వద్ద వాటి స్క్రీన్‌షాట్‌లు ఉంటాయి. బైడెన్ హయాంలో ఉన్న సమయంలో బహిష్కరణ వేటు పడినప్పటికీ యుఎస్‌లోనే ఉంటున్న అక్రమ వలసదారులను (విద్యార్థులు) గుర్తించడానికి కూడా ట్రంప్ యంత్రాంగం వీటిని ఉపయోగిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటి వరకు లక్షకుపైగా వీసాదారుల ప్రొఫైల్‌లను ఫెడరల్ అధికారులు స్కాన్ చేశారు. ఓపెన్ డోర్స్ నివేదిక ప్రకారం2023-24 విద్యా సంవత్సరంలో అమెరికా రికార్డుస్థాయిలో 1.1 మిలియన్ల అంతర్జాతీయ విద్యార్థులకు ఆతిథ్యం ఇచ్చింది. వీరిలో 3 లక్షలకుపైగా భారత్ నుంచి వచ్చారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమెరికాకు వ్యతిరేకంగా ఉన్న అన్ని విషయాలపై ఉక్కుపాదం మోపారు. ఇందులో భాగంగానే జాతి వ్యతిరేక ప్రచారానికి పాల్పడుతున్న వారి సోషల్ మీడియా ఖాతాలను అమెరికా విదేశాంగ శాఖ జల్లెడ పడుతోంది. ఒకవేళ అదే నిజమని తేలితే ఆ విద్యార్థులకు అమెరికాలో చదువుకునే వీల్లేకుండా తక్షణమే స్వదేశానికి పంపించే యోచనలో ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఈ మేరకు అమెరికా విదేశాంగ శాఖ, కాన్సులేట్ అధికారుల సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెలువరించింది. ఈ మేరకు హెచ్చరిక సందేశాలు అందుకున్నారు. తమ స్వదేశాలకు వెళ్లేందుకు సిబిపి హోమ్ యాప్ ఉపయోగించుకోవచ్చని తెలిపింది.



# వక్ఫ్ బిల్లుకు ఓటింగ్ పెడితే బలాబలాల్లో ఎన్డీయేదే పైచేయి

## ఉభయసభల్లోనూ గెలవడం సులభం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:**వివాదాస్పద వక్ఫ్ సవరణ బిల్లు లోక్‌సభ ముందుకు వచ్చింది. ఈ బిల్లును ఆమోదింపచేసుకోవాలని కేంద్రప్రభుత్వం పట్టుదలతో ఉండగా విపక్షాలన్నీ ముకుమ్మడిగా వ్యతిరేకిస్తున్నాయి. తొలుత దీనిపై సభలో చర్చనిర్వహించి అనంతరం ఓటింగ్ నిర్వహిస్తారు. ఈ క్రమంలో పార్లమెంటులో కూటముల బలాబలాలు చర్చకు వస్తున్నాయి. లోక్‌సభలో గట్టెక్కాలంటే బిజెపికి సాధారణ మెజార్టీ 272 ఓట్లు కావాలి. ప్రస్తుతం సభలో బిజెపికి సొంతంగా 240 మంది ఎంపీలున్నారు. మిత్రపక్షాలైయిన టిడిపికి 16,జెడియుకు 12 మంది ఉన్నారు. ఇక ఎల్జేపీ రామ్‌విలాస్‌కు ఐదుగురు, ఆర్ఎల్డీకీ ఇద్దరు,శివసేన శిందేకు ఏడుగురు ఎంపీలున్నారు.మొత్తంగా బిజెపికి 282 మంది ఎంపీల బలం ఉంది. ఉభయసభల్లోను బిల్లుకు మద్దతివ్వాలని ఎన్డీయే భాగస్వామ్య పార్టీలు ఇప్పటికే నిర్ణయించాయి. ఇక ఇతరచిన్నపార్టీల నుంచి కూడా మద్దతులభిస్తే తమకు 295 ఓట్లు అనుకూలంగా వస్తాయని ఎన్డీయే భావిస్తోంది. దీనివల్ల సులువుగానే బిల్లు ఆమోదం పొందడం ఖాయం. కాంగ్రెస్ విపక్షాలకు లోక్ సభలో 234 మంది ఉన్నారు. ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలు మంగళవారం పార్లమెంట్ హౌస్‌లో ప్రత్యేకభేటీ నిర్వహించాయి. కాంగ్రెస్, సమాజ్‌వాదీ, ఎన్సీ ఈపీ ఎస్పీ, టిఎంసి, ఆప్, డిఎంకె వామపక్షాల నాయకులు వచ్చారు. వీరంతా బిల్లుపై క్రియాశీలకంగా చర్చలో పాల్గొంటూనే బిల్లును వ్యతిరేకించాలని నిర్ణయించాయి.బిజు జనతాదళ్‌వంటి కొన్నిపార్టీలు మాత్రం తటస్థంగా ఉన్నాయి.ఇక రాజ్యసభ విషయానికి వస్తే బిజెపికి అక్కడ కూడా మెజార్టీ ఉంది. 245మంది సభ్యులున్న ఎగువసభలో బిల్లు ఆమోదం పొందాలంటే 119మంది సభ్యుల మద్దతు అవసరం. ప్రస్తుతం బిజెపికి సొంతంగా 98మంది ఎంపీలున్నారు. మిత్రపక్షాలతో కలిసి ఎన్డీయే సంఖ్యాబలం 125గా ఉంది. ఈ వక్ఫ్‌సవరణ బిల్లు గురువారం పెద్దల సభకు వస్తుంది.

# బిలియనీర్ భారతీయ మహిళగా సావిత్రి జిందాల్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:** ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితా విడుదలయింది. ఆజాబితాలో అత్యంత సంపన్న భారతీయ మహిళగా సావిత్రి జిందాల్ నిలిచారు. టాప్‌టెన్ ఇండియన్ బిలియనీర్ల జాబితాలో ఆమె మూడోస్థానంలో ఉన్నారు. ఓపి జిందాల్‌గ్రూపు ఓనర్‌గా ఆమె ఉన్నారు. ప్రస్తుతం ఆమె హర్యానా ఎమ్మెల్యేగాక ఒనసాగుతున్నారు. ఫోర్బ్స్ బిలియనీర్స్ 2025 జాబితాలో బిలియనీర్ ఇండియన్ ఉమెన్‌గా నిలిచారు. ఆమె ఆస్తుల విలువ సుమారు 35.5 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు ఆజాబితాలో తెలిపారు. ముకేష్ అంబానీ, గౌతమ్ అదానీ తర్వాత ఆజాబితాలో సావిత్రిమూడోస్థానంలో ఉన్నారు. టాప్ 10 భారత బిలియనీర్లలో ఏకైక మహిళ ఆమే కావడం విశేషం. ఉక్కు, విద్యుత్, సిమెంట్, మౌలికవసతుల రంగాల్లో జిందాల్ గ్రూపు వ్యాపారాలున్నాయి. ఆ గ్రూపునకు సావిత్రిఛైర్మన్‌గా ఉన్నారు. ఆమెభర్త ఓంప్రకాశ్ జిందాల్ కంపెనీ స్థాపించారు. 2005లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో ఓపి జిందాల్ ప్రాణాలు కోల్పోయారు. ఆయన మృతి తర్వాత వ్యాపారాన్ని నలుగురు కుమారులకు విభజించారు. ముంబైలో ఉండే ఆమె కుమారుడు సజ్జన్ జిందాల్ జెఎస్‌డబ్ల్యూస్టీల్; సిమెంట్; పెయింట్స్, ఇన్‌ఫ్రా వ్యాపారం చేస్తున్నారు. ఎంజి మోటార్స్ ఇండియా విద్యుత్ వాహనాల కంపెనీలో 35శాతం వాటా తీసుకున్నారు. ఢిల్లీలో నివసించే నవీన్ జిందాల్ జిందాల్ స్టీల్‌పవర్ చూసుకుంటున్నారు. భారత్ బిలియనీర్ల జాబితాలో కొత్తగా ఐదుగురు చేరారు. భారతీయ బిలియనీర్లమొత్తం ఆస్తుల విలువ 941బిలియన్ డాలర్లు. గత ఏడాదితో పోలిస్తే ఇది తగ్గింది. స్టాక్, కరెన్సీ ఒడిదొడుకులతో విలువలు తగ్గినట్లు భావిస్తున్నారు.



# అస్వస్థతతో ఆసుపత్రిలో చేరిన లాలూ ప్రసాద్‌యాదవ్

**పాట్నా, ఏప్రిల్ 2:** బీహార్ మాజీ సీఎం ఆర్జేడిఅధినేత లాలూప్రసాద్ యాదవ్‌కు తీవ్ర అస్వస్థత సోకవడంతో ఆయన్ను ఆసుపత్రిలో చేర్పించారు. బుధవారం మధ్యాహ్నం తర్వాత ఆయన ఢిల్లీకి వెళ్లేందుకు పాట్నా విమానాశ్రయానికి బయలుదేరారు. ఈ క్రమంలో మార్గ మధ్యలో అస్వస్థతకు గురికావడంతో ఆయన్ని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పాట్నాలోని పరాస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం సాయంత్రం 4.05 గంటలకు ఎయిర్‌ఇండియా విమానంలో ఢిల్లీ వెళ్లాల్సి ఉండగా ఆయన ఆరోగ్యం క్షీణించడంతో ఆసుపత్రిలోచేరినట్లు తెలిసింది. లాలూప్రసాద్‌యాదవ్ గుండెసంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్లు రక్తంలో చక్కెరస్థాయిలు పెరగడం వల్ల ఆయన ఆరోగ్యం క్షీణించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆయనకు వైద్యపరీక్షలు అనంతరం ఢిల్లీ ఎయిమ్స్‌కు తరలించాలని కుటుంబసభ్యులు నిర్ణయించారు.

# లక్ష మంది అవామీ లీగ్ కార్యకర్తలు భారత్‌కు పరార్



## బంగ్లాదేశ్ సంచలన వ్యాఖ్యలు

**ఢాకా, ఏప్రిల్ 2:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వ అడ్వైజర్ ఒకరు తీవ్ర విమర్శలు చేశారు. భారత్‌లో కూర్చొని ఆమె తన సొంత దేశానికి వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నారని బంగ్లా ప్రభుత్వ సమాచార సలహాదారు మహ్ఫుజ్ ఆలమ్ ఆరోపించారు. అంతేకాదు.. హసీనాతో పాటు ఆమె పార్టీ అవామీ లీగ్‌కు చెందిన దాదాపు లక్ష మంది కార్యకర్తలు భారత్‌కు పారిపోయి ఆశ్రయం పొందుతున్నారని సంచలన ఆరోపణలు చేశారు. రంజాన్ సందర్భంగా ఢాకాలో ఓ కార్యక్రమం ఏర్పాటు చేశారు. హసీనా ప్రభుత్వ హయాంలో అదృశ్యమైన లేదా ప్రాణాలు కోల్పోయిన బాధితుల కుటుంబసభ్యులతో సమావేశం నిర్వహించారు.ఇందులో పాల్గొన్న ఆలమ్ మాజీ ప్రధానిపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. 'తన తల్లిదండ్రుల హత్యకు ప్రతీకారంగా హసీనా దేశంలో పలు అక్రమాలకు పాల్పడ్డారు. ఎదురుతిరిగిన వారి ప్రాణాలు తీసేందుకు కడా వెనుకాడలేదు. 2013-14 మధ్య ఓటు హక్కు కోసం ప్రజలు పోరాడుతున్న సమయంలో పెద్దసంఖ్యలో మిస్సింగ్ ఘటనలు చోటుచేసుకున్నాయి. వారి ఆచూకీ ఇప్పటివరకు తెలియరాలేదు. ఎన్నికల వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు ఆమె ఎన్నో దారుణాలు చేశారు' అని ఆలమ్ మండిపడ్డారు. 'అవామీ లీగ్‌ను వ్యతిరేకించిన వారిని ఉగ్రవాదులు, మిలిటెంట్లుగా ముద్రవేసి వారిని కన్పించకుండా చేశారు. ఇప్పుడు కూడా భారత్‌లో కూర్చుని బంగ్లాకు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నారు. హసీనాతోపాటు దాదాపు లక్ష మందికిపైగా అవామీ లీగ్ కార్యకర్తలు ఆ దేశానికి పారిపోయారు. వారికి భారత్ ఆశ్రయం ఇవ్వడం దురదృష్టకరం' అని ఆలమ్ ఆరోపించారు. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా చోటు చేసుకున్న ఆందోళనకర పరిస్థితుల నేపథ్యంలో గతేడాది ఆగస్టు 5న దేశం వీడిన షేక్ హసీనా.. భారత్‌లో ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో హసీనాతోపాటు ఆమె మంత్రివర్గంలో ఉన్న నేతలు, సలహాదారులు, సైనికాధికారులపై నేరారోపణలు నమోదయ్యాయి. స్వదేశంలో హసీనాపై 100కు పైగా కేసులున్నాయి. ఇప్పటికే ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ (ఐసిటి) ఆమెకు అరెస్టు వారెంట్ జారీ చేసింది.



# సరిహద్దుల్లోకి చొరబడి పాక్ ఆర్మీ కాల్పులు

## దీటుగా బదులిచ్చిన భారత్ ఆర్మీ

**జమ్ము,ఏప్రిల్ 2:** భారత్ పాక్‌స రిహద్దు వద్ద అలజడిచోటుచేసుకుంది. దాయాది దేశ సైన్యం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. జమ్ముకాశ్మీర్‌లోని పూంచ్‌జిల్లాలో నియంత్రణ రేఖవద్ద పాక్ ఆర్మీ చొరబాట్లకు పాల్పడిందని భారత సైనిక వర్గాలు వెల్లడించాయి. ఏప్రిల్ 1న కృష్ణఘాటి సెక్టార్‌వద్ద పాక్ ఆర్మీ చొరబాట్లకు పాల్పడింది. ఆప్రాంతంలో మందుపాతర పేలిన ఘటన చోటుచేసుకుంది. తర్వాత పాక్‌సైన్యం కాల్పులుజరిపి ఒప్పందాన్ని ఉల్లంఘించింది. ఈ ఘటనపై మా ఆర్మీకూడా ధీటుగా జవాబిచ్చిందని,ప్రస్తుతం అదుపులో ఉందని ఆర్మీ వర్గాలు పేర్కొన్నాయి. అయితే ప్రాణనష్టం ఇతర వివరాలగురించి వెల్లడికావాల్సి ఉందన్నారు. పాక్ ఆర్మీ కాల్పుల్లో భారత బృందాల్లో ఎవ్వరూ గాయపడలేదని తేల్చింది. 2021లో ఇరువైపులా డిజి మిలిటరీ ఆపరేషన్స్ శాంతిస్థాపనకోసం పలు అంశాలను అంగీకరించారని, నియంత్రణ రేఖవద్ద కాల్పులవిరమణకుకూడా ఒప్పందం ఉందని ఆర్మీగుర్తుచేసింది. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అదుపులోఉందని భారత్ ఆర్మీ తెలిపింది.

# అసోం శాట్ టెక్నాలజీకి ఇస్రో అన్ని విధాలా సహాయం

## మంత్రి మహంత్‌తో సమావేశమైన ఇస్రో ఛైర్మన్



**శ్రీహరికోట (తడ), ఏప్రిల్ 2 ప్రభాతవార్త:** అస్సాం రాష్ట్ర ప్రయోజనాల కోసం అక్కడి ప్రభుత్వం రూపొందించిన అసోం శాట్ ఉపగ్రహ సాంకేతిక పరిజ్ఞానం పెంచడానికి ఇస్రో నుంచి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని ఛైర్మన్ వి.నారాయణన్ పేర్కొన్నారు. అస్సాం ప్రభుత్వానికి చెందిన రెవెన్యూ, విపత్తు నిర్వహణ, ఐటి సైన్స్ టెక్నాలజీ మంత్రి కేశబ్‌మహంత్‌తో ఇస్రోఛైర్మన్ వి.నారాయణన్ సమావేశమయ్యారు. అస్సాంఅభివృద్ధి కోసం అంతరిక్ష పరిజ్ఞానాన్ని ఉపయోగించుకునే అవకాశం ఉందని, దీనికి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సహకారం ఉంటుందన్నారు. స్పేస్ టెక్నాలజీ ఆధారిత అప్లికేషన్ల విని యోగాన్ని మెరుగుపరచాల్సిన అవసరాన్ని మంత్రి ఇస్రో ఛైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. వ్యవసాయం, జలవనరుల నిర్వహణ, ఫారెస్ట్ అండ్ అకాలజీ, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ ప్లానింగ్, ప్రకృతి వైపరిత్యాలను పసిగట్టడం వంటివాటి కోసం ఇస్రో సహకారాన్ని మంత్రి కోరగా, వి.నారా యణన్ ఈ మేరకు హామీ ఇచ్చారు.

# ప్రతీకార సుంకాలతో పదేళ్లలో లక్షకోట్ల బిలియన్ డాలర్ల రాబడులు

## వైట్‌హౌస్ యంత్రాంగం భారీ అంచనాలు


## పన్నుల భారం పెరుగుతుందంటున్న అమెరికన్లు



**వాషింగ్టన్,ఏప్రిల్ 2:** భారత్‌తోసహా ప్రపంచంలోని అనేక దేశాలపై విధిస్తున్న ప్రతీకార సుంకాలవల్ల అమెరికాకు ప్రతి ఏటా భారీస్థాయిలో ఆదాయం సమకూరే అవకాశం ఉంది. శ్వేతసౌధం వర్గాలకథనంప్రకారం ఏటా 600 బిలియన్ డాలర్లనుంచి 700 బిలియన్ డాలర్ల రాబడులు వస్తాయని అంచనా. మరో పదేళ్లలో ఆరు లక్షల కోట్ల డాలర్ల రాబడులు రాగలవని వైట్‌హౌస్ అధికారులు చెపుతున్నారు. చైనా మెక్సికో కెనడా నుంచి దిగుమతిచేసుకునే కొన్ని వస్తువులపై 25శాతం సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు గతంలోనే స్పష్టంచేసారు. మరికొన్ని వస్తువులపై ఇవి భారీగా ఉండనున్నాయనే సంకేతాలు ఇచ్చారు. వీటివల్ల అమెరికాకు ఏమేరకు ఆదాయం సమకూరు తుందనే విషయం ఆసక్తిగా మారింది. వీటిపై వైట్‌హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో మాట్లాడుతూ కొత్త ట్యారిఫ్‌ల వల్ల ఏటా 600 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరే అవకాశం ఉందని అంచనా వేసారు. ఆటో ట్యారిఫ్‌లవల్ల మరో 100 బిలియన్ డాలర్లు రాగలవన్నారు. చట్టసభ సభ్యులతో ఆర్థికమంత్రి స్కాట్ బెసెంట్ మాట్లాడుతూ ఈ సుంకాలపై పరిమితి ఉం టుందని, ఆ దేశాలతో చర్చల తర్వాత వీటిని తగ్గించే అవకాశం ఉందన్నారు. వైట్‌హౌస్ మాత్రం వీటి విధానానికి సంబంధించి అధికారికంగా ఎలాంట ప్రకటనలు చేయలేదు. శ్వేతసౌధం వర్గాల అంచనాకంటే ఈ ఆదాయం తక్కువే ఉంటుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. 100 బిలియన్ డాలనుంచి 200 బిలియన్ డాలర్ల వరకూ వస్తే చాలా అదృష్ట మేనని మూడీస్ ప్రధాన ఆర్థికవేత్తమార్క్ జాం డీపేర్కొన్నారు. దిగుమతులపై సరాసరి 20శాతం పన్ను విధిస్తే ఒక్కో కుటుంబంపై అదనంగా 3400 డాలర్లనుంచి 4200 డాలర్ల భారంపడుతుందని యేల్‌యూనివర్సిటీ నిపుణులు అంచనా వేస్తున్నారు.

దేశీయంగా ఉత్పత్తులు పెంచడం వల్ల ఆరంగంలో ఉపాధి అవకాశాలు పెరుగు తాయని ట్రంప్ యంత్రాంగం అంచనావేస్తోంది. ఈక్రమంలో తమ అధ్యక్షుడు ట్రంప్ విధానాలు ఖచ్చితమైనవేనని ధీమా వ్యక్తంచేస్తున్నారు. ప్రజలు మిత్రదేశాలుమాత్రం ఈ సుంకాలు ఎప్పటికైనా ముప్పుగానే ఉంటాయని భావిస్తున్న సంగతి తెలిసిందే.

# రష్యాలో కొవిడ్ తరహా మిస్టరీ వైరస్?



**మాస్కో, ఏప్రిల్ 2:** రష్యాలో అంతుచిక్కని వైరస్ విజృంభిస్తున్నట్లు పలు వార్తాసంస్థలు పేర్కొంటున్నాయి. అక్కడి ప్రజలు తీవ్రమైన శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో దీర్ఘకాలిక జర్వంతో బాధ పడుతున్నారని తెలిపాయి. వైరస్ కారణంగా వారు దగ్గుతున్నప్పుడు రక్తం పడుతోందనే నివేదికలు ప్రపంచ దేశాల్లో ఆందోళనను రేకెత్తిస్తున్నాయి. రష్యాలో మిస్టరీ వైరస్ విజృంభిస్తోందని మార్చి 29న పలు నివేదికలు వెలువడ్డాయి. పలు నగరాల్లో ప్రజలు వారాల తరబడి జ్వరం, ఒళ్లు నొప్పులు, తీవ్ర దగ్గుతో బాధపడుతున్నారని ఈ వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతోందని అవి పేర్కొన్నాయి. అయితే కొవిడ్ టెస్టులు చేసినప్పుడు నెగిటివ్ వచ్చిందని ఇది మరో కొత్త వైరస్ అయి ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశాయి. రష్యాకు చెందిన అలెగ్జాండ్రా అనే మహిళ ఐదు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతోందని.. కొన్ని రోజులకు దగ్గుతున్న సమయంలో రక్తం పడుతున్నట్లు తెలిపిందని నివేదికలు వెల్లడించాయి. ఎన్ని మందులు వాడినప్పటికీ తగ్గుదల కనిపించట్లేదని ఆందోళన వ్యక్తం చేశాయి. ఇటువంటి అనేక ఇతర కేసుల గురించి వివరించాయి. మరికొందరు నెటిజన్లు తాము తీవ్రమైన రక్తంతో కూడిన దగ్గుతో బాధ పడుతున్నట్లు సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.

**అవన్నీ తప్పుడు ప్రచారాలు:** కాగా ఈ నివేదికలను రష్యన్ అధికారులు ఖండించారు. తాము జరుపుతున్న పరీక్షల్లో దేశంలో ఎలాంటి నూతన వ్యాధి కారకాలు బయటపడలేదని.. కొత్త వైరస్ వ్యాపించినట్లు ఎటువంటి ఆధారాలు లేవని వెల్లడించారు. రకరకాల వదంతులు, తప్పుడు ప్రచారాలతో ప్రజలు ఆందోళన చెందుతున్నప్పటికీ అందులో నిజం లేదన్నారు.

నివేదికల్లో పేర్కొన్న మహిళకు పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమెకు మైకోప్లాస్మా న్యుమోనియా ఉన్నట్లు నిర్ధారించారని తెలిపారు. ఒకవేళ కొవిడ్ తరహా వైరస్ వస్తే దానిని ఎదుర్కోవడానికి తగిన సదుపాయాలు ఉన్నాయన్నారు.



# ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలనకు కార్యనిర్వాహక వ్యవస్థ ఒక్కటే..

## రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:** ప్రభుత్వం ఒక్కటే అంతిమ వ్యవస్థ అని ప్రజాస్వామ్యంలో పాలన అనేది కార్య నిర్వాహక వ్యవస్థద్వారా మాత్రమే సాగుతుందని రాజ్యసభ ఛైర్మన్‌జ గదీప్‌ధన్‌ఖడ్ అన్నారు. న్యాయస్థానాలవల్లకానేకాదన్నారు. నీట్ కేంద్రీకరణపై గతంలో సుప్రీంకోర్టు తీర్పును కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ప్రస్తావించిన సమయంలో రాజ్యసభ ఛైర్మన్ ఈ సంచలన వ్యాఖ్యలుచేసారు. రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో డిఎంకె సభ్యురాలు కనిమొళి ఎన్వీఎన్ సోమూ మాట్లాడుతూ జాతీయ అర్హత పరీక్ష నీట్‌ను వికేంద్రీకరించాలని డిమాండ్‌చేసారు. ఈ ప్రతిపాదనను కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్రప్రధాన్ తోసిపుచ్చారు. గతంలో దీనిపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావించిన ఆయన కేంద్రీకృత విధానాన్ని న్యాయస్థానం కూడా సమర్థించిందన్నారు. ఈ క్రమంలో జోక్యం చేసుకున్న ఛైర్మన్ ప్రజాస్వామ్యంలో పాలన కేవలం కార్యనిర్వాహక వ్యవస్థ ద్వారానే సాగుతుందని అన్నారు. ఎందుకంటే ఎగ్జిక్యూటివ్‌అనేది పార్లమెంటుకు జవాబుదారీగా ఉంటుందన్న ఆయన ఇది ఇతర ఏజెన్సీలద్వారా ఎలాసాగుతుందని ప్రశ్నించారు.

# అధ్యక్ష ఎన్నికలపై అఖిలేష్ సెటైర్‌కు దీటుగా అమిత్‌షా జవాబు




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:** వక్ఫ్ సవరణబిల్లుపై బుధవారం లోక్‌సభలో జరుగుతున్న చర్చలోభాగంగా సమాజ్‌వాదిపార్టీ అధినేత అఖిలేష్‌యాదవ్ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యంగ్యాస్త్రాలు గుప్పించుకున్నారు. బిజెపి అధ్యక్ష ఎన్నికపై అఖిలేష్ సెటైర్లు వేయగా అమిత్‌షా అంతే ధీటుగా స్పందించారు. వక్ఫ్‌సవరణ బిల్లుపై చర్చలో పాల్గొన్న అఖిలేష్‌న ప్రపంచంలోని అతి పెద్దపార్టీ తన అధ్యక్షుడిని ఎన్నుకోలేకపోతోందని బిజెపినుద్దేశించి ఎద్దేవా చేసారు. అఖిలేశ్‌జీ నవ్వుతూ ఒక విషయం వెల్లడించారు. నేను కూడా నవ్వుతూనే సమాధానం ఇస్తాను. కొన్ని పార్టీల నాయకత్వం ఐదుమందిచేతుల్లో ఉం టుంది. దీనితో ఆ ఐదుగురినుంచే అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. కానీ మేం ఒక ప్రక్రియను పాటించాలి. 12నుంచి 13కోట్ల పార్టీ సభ్యుల నుంచి ఒకరిని ఎంపిక చేసుకోవాలి. అందుకు సమయం పడుతుంది. మీకు సమయం పట్టదు. ఎందు కంటే మరో 25యేళ్ల మీరే పార్టీ అధ్యక్షు డుగా ఉంటారు. అందులో మార్పేమీ ఉండదని అమిత్‌షా ధీటుగా స్పందించారు.

# మయన్మార్‌కు 625 మెట్రిక్‌టన్నుల భారత్ విపత్తు సాయం!

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:** భారీ భూకంపంతో మైన్మార్ థాయిలాండ్‌లు వణికిపోతున్నాయి. అక్కడిప్రజల జీవనవిధానం అస్తవ్యస్తంగా మారింది. మైన్మార్‌లోమృతుల సంఖ్య ఇప్పటివరకూ 2719కిచేరింది. ప్రకృతి విపత్తుతో అల్లాడపోతున్న ఆదేశానికి భారత్ తన సాయాన్ని కొనసాగిస్తోంది. ఇప్పటివరూ 625 మెట్రిక్ టన్నుల సహాయక సామగ్రిని భారత్ అందించింది. ఆపరేషన్‌బ్రహ్మలో భాగంగా 625 మెట్రిక్‌టన్నుల వరకూ మానవతాసాయం విపత్తునివారణ సామగ్రిని భారత్‌కు అందించామని విదేశాంగ శాఖ వెల్లడించింది. సహాయక కార్యక్రమాల నిమిత్తం 6 విమానాలు, ఐదు నేవీ నౌకలు వినియోగించామన్నారు. ప్రకృతి విపత్తు సంభవించినప్పటినుంచి భారత్ ఇప్పటివరకూ మూడు విడతలుగా తన సాయాన్ని పంపించినట్లు పేర్కొన్నారు. అందులో ఆహార పదార్థాలు తాత్కాలిక నివాసంకోసం టెంట్లు స్లీపింగ్ బ్యాగులు, వాటర్ ప్యూరిఫయర్లు,సోలార్ ల్యాంప్ జనరేటర్లు అత్యవసర వైద్యపరికరాలతోపాటు 80 మంది ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది కూడా ఉన్నారు. ఆపరేషన్‌బ్రహ్మ కింద ఐఎన్ఎస్ సాత్పూరా, ఐఎన్ఎస్ సావిత్రినౌకలు శనివారం యబయలుదేరి సోమవారం మైన్మార్‌కు చేరుకున్నాయి. అవి 50 టన్నుల సామగ్రిని యాంగూన్‌లో అందించాయి. మరో రెండు నౌకలు మంగళవారంచేరాయి. మైన్మార్‌లోని మాండలేలో 200 పడకల సామర్థ్యంతో ఒక తాత్కాలిక ఆసుపత్రిని కూడా భారత సైన్యం ఏర్పాటు చేసింది. అందులో 118 మంది సేవలందిస్తున్నారు. 442 టన్నుల సహాయక సామగ్రితో ఐఎన్ఎస్ ఘరియాల్‌నౌక మంగళవారం విశాఖపట్టణంనుంచి బయలుదేరింది. అందులో బియ్యం, వంటనూనెతోసహా ఔషధాలున్నాయి. ఈ సందర్భంగా మైన్మార్‌కు మరింత సాయం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని విదేశాంగశాఖ ప్రకటించింది. నిమిషాలవ్యవధితో వచ్చిన భూకంపాలతో మైన్మార్ కుదేలయిన సంగతి తెలిసిందే. బలమైన ప్రకంపనల ధాటికి పలునిర్మాణాలు, భారీ భవనాలు ఎక్కడికకక్కడ పేకమేడల్లా కూలిపోయాయి. దీనితో సహాయక చర్యలకు పెనుసవాల్‌గా మారింది. ఇప్పటివరకూ మృతుల సంఖ్య2719కిచేరింది. వారిలో ఐదేళ్లలోపు చిన్నారులు 50 మంది ఉన్నారు. 4521 మంది గాయపడగా 441 మంది ఆచూకి తెలియాల్సి ఉంది. మృతుల సంఖ్య పెరుగుతుందని మరింతగా భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

# పునర్విభజనపై కలిసేందుకు మోడీ అపాయింట్‌మెంట్ కోరిన స్టాలిన్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:** లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై తమిళనాడు సీఎం ఎంకె స్టాలిన్ కేంద్రంపై పోరాటంచేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా పునర్విభజనకు సంబం ధించిన మెమోను సమర్పించడానికి ప్రధాని నరేంద్ర మోడీని స్టాలిన్ సమయం కోరారు. ఈ మేరకు గతనెల 27న ఆయనమోడీకి ఒక లేఖరాసారు. ఆ లేఖను స్టాలిన్ బుధవారం ఎక్స్ వేదికగా పంచుకున్నారు. లోక్‌సభ నియోజ కవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగనున్నదన్న విషయమై చర్చించేందుకు వివిధ పార్టీల నేతలతో స్టాలిన్ అఖిలపక్ష సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే. డీలిమిటేషన్‌పై పలు తీర్మానాలు చేసారు. ఈ క్రమంలో దీనికి సంబంధించిన మెమోను అందించేందుకు మోడీని సమయం కోరినట్లు స్టాలిన్ తెలిపారు. ఈ అంశంపైమా వినతిని వినిపించేందుకు అత్యవసరంగా సమయం ఇవ్వాలని ఆయన ఈసందర్భంగా అభ్యర్థించారు. స్పందన కోసం ఎదురు చూస్తామన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన 2026లో జరుగుతుంది. ఇందుకు అనుసరించే విధివిధానాలవల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం వాటిల్లుతుందన్న ఆందోళన రేగుతోంది. ఇటీవల డిఎంకె నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో జనాభా ఆధారిత పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు చట్టాలర ఊపకల్పనలో ప్రాతినిధ్యం తగ్గుతుం దని స్టాలిన్ ఆరోపించారు. సొంతదేశంలోనే మనం రాజకీయ అధికారాన్ని కోల్పోయిన పౌరులుగా మిగిలిపో తామన్నారు. తమ నిరసన పునర్విభజనకు వ్యతిరేకం కాదని న్యాయ బద్ధంగా, పారద ర్శకంగా పునర్విభజన చేయాలని తాము డిమాండ్ చేస్తున్నట్లు తెలి పారు. ఈ సందర్భంగా కేరళ సీఎం పినరయి విజయన్ ఎలాంటిచర్చలు చేపట్టకుండానే నియో జకవర్గాల పునర్విభజన చేపట్టాలని కేంద్రం భావిస్తోందని అది మనకు ప్రమాద ఘంటి కల్లాంటి వేనన్నారు.

# హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉంది

## విశ్వహిందూ పరిషత్ విజయవాడ మహా నగర అధ్యక్షుడు సానా శ్రీనివాస్

**విజయవాడ, ఏప్రిల్ 2,ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందని విశ్వహిందూ పరిషత్ విజయవాడ మహానగర అధ్యక్షులు సానా శ్రీనివాస్ అన్నారు. లోక కళ్యాణార్థం ఆది మహాలక్ష్మి ఆశీర్వాద యాత్ర చేపట్టిన అఖిల భారతీయ అగర్వాల్ సమ్మేళన్ జాతీయ కార్యదర్శి , యాత్ర దక్షిణ భారత సమన్వయకర్త చాంద్ మాల్ అగర్వాల్ బృందం చేపట్టిన దక్షిణ భారత యాత్రలో భాగంగా మహానగరానికి విచ్చేసిన సందర్భంగా బుదవారం వారిని విజయవాడ విశ్వహిందూ పరిషత్ కార్యాలయానికి ఆహ్వానించి గౌరవించారు. ఈ సందర్భంగా సానా శ్రీనివాస్ మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణ లాక్ష్యంగా హిందువులను జాగృతం చేసేందుకు యాత్రలు ఎంతగానో దోహదపడతాయన్నారు. మన సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించే రీతిలో మరెక్కడా లేనివిధంగా హర్యానాలో ఆది మహాలక్ష్మి అమ్మవారి ఆలయం నిర్మాణం పట్ల అందుకు కృషి చేస్తున్న ఈ బృందాన్ని విశ్వహిందూ పరిషత్ అభినందించింది. ఈ సందర్భంగా దక్షిణ భారత యాత్ర చేపట్టిన చాంద్ మాల్ అగర్వాల్ బృందాన్ని విశ్వహిందూ పరిషత్ విజయవాడ మహానగర కార్యవర్గం ఘనంగా సత్కరించింది. ఈ సమావేశంలో అఖిల భారతీయ అగర్వాల్ సమ్మేళన్ జాతీయ కార్యదర్శి , యాత్ర దక్షిణ భారత సమన్వయకర్త చాంద్ మాల్ అగర్వాల్ మాట్లాడుతూ లోక కళ్యాణార్థం ఆది మహాలక్ష్మి ఆశీర్వాద యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ప్రజలందరికీ ఆది మహాలక్ష్మి ఆశీర్వచనాలు లభించాలని ఆయన పేర్కొన్నారు. తమయాత్రకు మద్దతుపలికి గౌరవించిన విశ్వహిందూ పరిషత్ ప్రముఖులను అభినందించారు. సత్కారం అందుకున్న వారిలో చాంద్ మాల్ అగర్వాల్, పీఎం గోయిల్, ఓం ప్రకాష్ అగర్వాల్, పురుషోత్తం కేజ్రీవాల్, అనిల్ కుమార్ గోయిల్, శ్యాంసుందర్ లిడ్మానీయ, యాత్ర మీడియా బృందం బడే ప్రభాకర్, జి ఎస్ ఎస్ రాజు, ఆవాల దుర్గాప్రసాద్, టీవీ రంగారావు, బద్దం సుమలత, వర్మ తదితరులు ఉన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రముఖులు పి రాఘవరాజు, కే. రామకృష్ణ, బి. వెంకట బాలకోటేశ్వరరావు, పేర్ల రవీంద్ర గుప్తా, కొంపల్లి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

# ఆర్టీసిలో సరికొత్త విద్యుత్ బస్సులు

**విజయవాడ,ఏప్రిల్ 2,ప్రభాతవార్తప్రతినిధి:**ఏపీ ఆర్టీసీలో సరికొత్త విద్యుత్ బస్సుల రాకకు రంగం సిద్ధమవుతోంది. తొలి దశలో 750 బస్సులను రాష్ట్రానికి పంపేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. బస్సుల టెండర్లు పూర్తి చేసిన కేంద్ర ప్రభుత్వం, కాంట్రాక్టర్ ను ఎంపిక పూర్తి చేసింది. ప్రస్తుతం బస్ బాడీలు సైతం సిద్ధం చేసిన కాంట్రాక్ట్ సంస్థ, రాష్ట్రానికి బస్సులు పంపే ఏర్పాట్లు చేస్తోంది. ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు చేయడమే తరువాయి రాష్ట్రంలోని నగరాల్లో విద్యుత్ బస్సులు పరుగులు పెట్టనున్నాయి. తొలి దశలో 10,000 ఎలక్ట్రిక్ బస్సులు: పట్టణ ప్రాంతాల్లో పట్టణ బస్సు కార్యకలాపాల కోసం "పీఎం ఇబస్ సేవా" పథకాన్ని ప్రారంభించిన కేంద్ర ప్రభుత్వం, ఎంపిక చేసిన రాష్ట్రాలకు కొత్తగా విద్యుత్ బస్సులను పంపేందుకు రంగం సిద్ధం చేస్తోంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోని పలు పట్టణాలు, నగరాల్లో 10,000 ఎలక్ట్రిక్ బస్సులను తొలి దశలో ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం టెండర్లు పిలిచింది. కాంట్రాక్టర్లను సైతం ఎంపిక చేసింది. పబ్లిక్, ప్రైవేటు, పార్ట్ నర్‌షిప్ మోడల లో విద్యుత్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. తొలి దశలో దేశవ్యాప్తంగా 10,000 బస్సులను ప్రవేశపెట్టేందుకు 20 వేల కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం వెచ్చిస్తోంది. రాష్ట్రాల్లోని ఆర్టీసీలకు కాంట్రాక్టర్ల ద్వారా విద్యుత్ బస్సులను ఏర్పాటు చేసి తిప్పనుంది. గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ గోల్ సంయుక్తంగా పథకాన్ని పర్యవేక్షించనున్నాయి. రాష్ట్రంలోని అర్హతగల 11 నగరాల్లో పీఎం ఇ- బస్సు సేవా పథకం" కింద ఎలక్ట్రిక్ బస్సుల కోసం గతేడాది సెప్టెంబర్ 26న ప్రతిపాదనను సమర్పించగా కేంద్రం ఆమోదించింది. రెండు విభాగాల్లో విద్యుత్ బస్సులు: ఇందులో భాగంగా ఏపీలోని 11 నగరాల్లో 1050 బస్సులను ప్రవేశపెట్టాలని నిర్ణయించి ఆమోద ముద్ర వేసిన కేంద్ర ప్రభుత్వం, తొలుత 750 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టడానికి చర్యలు తీసుకుంటోంది. కన్వర్జెన్స్ ఎనర్జీ సర్వీస్ లిమిటెడ్, విద్యుత్ మంత్రిత్వ శాఖ, గోల్, ఆధ్వర్యంలో తొలి దశలో రానున్న 750 ఈ బస్సుల కోసం టెండర్లు పిలిచి అర్హత కలిగిన సంస్థల కాంట్రాక్టర్లను ఖరారు చేసింది. టెండర్లలో పుణెకు చెందిన పిన్నాకిల్ మొబిలిటీ సెల్యూషన్స్ సంస్థ ఎల్1 గా నిలిచి రాష్ట్రంలో ఈ బస్సులు తిప్పే కాంట్రాక్టు దక్కించుకుంది.

నగరాల్లో 12 మీటర్లు, 9 మీటర్లు పొడవు ఉన్న రెండు విభాగాల్లో విద్యుత్తో నడిచే ఏసీ సిటీ బస్సులను ప్రవేశపెట్టనున్నట్లు కేంద్రం తెలిపింది 12 డిపోల పరిధిలో ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు చేస్తారు.తొలిదశలో రానున్న 750 బస్సుల్లో 9 మీటర్లు పొడవు కలిగిన ఏసీ బస్సులు 129 ఉన్నాయి. వీటికి కిలోమీటర్ కు 62 రూపాయల 17 పైసలు చొప్పున కాంట్రాక్ట్ సంస్థకు ఆర్టీసీ అద్దె చెల్లించాల్సి ఉంటుందని కేంద్రం తెలిపింది. 12 మీటర్లు పొడవు

కలిగిన ఏసీ బస్సులు 621 వస్తుండగా, కిలోమీటర్ కు 72 రూపాయల 55 పైసలు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

# దుర్గమ్మకు మందార పుష్పార్చన



దాతలకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 2, ప్రభాత'వార్త'** మందార కుసుమప్రియ అయిన దుర్గమ్మవారికి బుధవారం మందార, మల్లె, ఎర్ర కలువలతో ప్రత్యేక పుష్పార్చనలందుకుని దుర్గమ్మ వారు భక్తులను అనుగ్రహించారు. వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం పుష్పాలతో శ్రీ అమ్మవారి అర్చన ప్రాంగణానికి అధికారులు పండితులు, అర్చకస్వాములు తీసుకొచ్చి అక్కడ అమ్మవారికి పూజాదికాలు జరిపించారు.

- నిత్యాన్నదాన పథకానికి విరాళం:

దుర్గమ్మ వారి ఆలయంలో జరిపే నిత్యాన్నదాన పథకానికి బుధవారం విజయవాడకు చెందిన కిలారు ఫణిప్రసాద్ రు.1లక్ష 11వేల 116లను విరాళంగా అందించారు. దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన తరువాత వారికి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



మంత్రి సవితకు వినతిపత్రం సమర్పిస్తున్న పూసల రవి

# సంచార జాతులకు 10శాతం రిజర్వేషన్లివ్వాలి

**విజయవాడ, ఏప్రిల్ 2, ప్రభాతవార్త :** సంచార జాతుల వారికి 10శాతం రిజర్వేషన్లను ఇవ్వాలంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంచార జాతుల సంఘం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరింది. ఈ మేరకు బుధవారం సచివాలయంలో మంత్రి సవితకు ఏపి సంచార జాతులు మరియు దాసరి రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు పూసల రవి వినతి పత్రం సమర్పించారు. స్వాతంత్ర్యానికి పూర్వం తమ జాతిని బ్రిటీష్ ప్రభుత్వం పలు రకాల నిర్బంధాలు విధించి పనులు చేయించుకునేవారని, స్వాతంత్ర్యం తరువాత సొంత ఊరు, ఇల్లు లేని తమ సంచార జాతులకు సంబంధించిన వృత్తులకు ఆదరణ తగ్గడంతో బిక్షాటన చేస్తూ 98శాతం దరిద్ర రేఖకు దిగువన వున్నారని, తమకు ఎస్సీ, ఎస్టీల మాదిరి 10శాతం రిజర్వేషన్లివ్వాలని, రాజ్యాంగ రక్షణ కల్పించాలని, ప్రత్యేక ఎస్టీ హోదా కల్పించాలని ఆమేరకు అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి పార్లమెంట్‌కు పంపాలని కోరారు.

# రాష్ట్రాన్ని కరవు రహితంగా మార్చే కార్యక్రమం హంద్రీనీవాతోనే ఆరంభం

## - జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

**విజయవాడ,ఏప్రిల్ 2,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రాన్ని కరువు రహితంగా మార్చే కార్యక్రమంతో హంద్రీనీవాతోనే ఆరంభం కావాలని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. విజయవాడ క్యాంపు కార్యాలయంలో బుధవారం హంద్రీనీవా ప్రాజెక్టు పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృష్ణా, గోదావరి జలాలను రాయలసీమకు తరలించి రతనాలసీమగా మార్చాలనే మహత్తర ఆశయంతో ముందుకు వెళుతున్నారని చెప్పారు. ఆయన గొప్ప ఆశయానికి హంద్రీనీవా ప్రాజెక్టు పూర్తి శుభారంభం కావాలని అధికారులకు సూచించారు. ఈ కారణంగానే మునుపెన్నడూ లేని విధంగా ఈ ఏడాది బడ్జెట్లో హంద్రీనీవా కు అత్యధికంగా రూ.3243 కోట్లు కేటాయించిన సంగతి మీరంతా గమనించాలన్నారు. ఆయన స్ఫూర్తిని మీరంతా అందిపుచ్చుకుని మీ, మీ పరిధిలోని పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. 2025 జూన్ కల్లా హంద్రీనీవా మొదటి దశ పనులు పూర్తి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా చురుగ్గా పని చేయాలన్నారు. ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్, ఈ ఎన్ సి ఎం. వెంకటేశ్వరరావు, ప్రాజెక్టు సీఈలు, ఎస్ ఈలు, ఈ ఈలు మరియు ఏజెన్సీ ప్రతినిధులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఇదే సందర్భంలో మంత్రి రామానాయుడు, వైకాపా హయాంలో హంద్రీనీవా ప్రాజెక్టుకు సంబంధించి జరిగిన అన్యాయాన్ని ప్రస్తావించారు. 2014 19 టిడిపి పాలనలో హంద్రీనీవా కు రూ. 4000 కోట్లు ఖర్చు పెడితే జగన్ ఐదేళ్ల కాలంలో కేవలం రూ. 500 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారని మంత్రి నిమ్మల విమర్శించారు. హంద్రీనీవా పూర్తి కాకపోవడానికి, ఆ పాపానికి ముమ్మాటికి జగనే కారణమని దుయ్యబట్టారు. మాట్లాడితే రాయలసీమ బిడ్డని అని చెప్పుకునే జగన్ రాయలసీమ ద్రోహిగా చరిత్రలో మిగిలిపోయారన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు పరిధిలో ఆనాడు చంద్రబాబు ఏర్పాటు చేసిన 3,850 క్యూసెక్కుల సామర్థం గల మోటార్లను సైతం చేతకాని జగన్ ప్రభుత్వం వాడుకోలేకపోయింది అన్నారు. అంతెందుకు హంద్రీనీవా కరెంట్ బిల్లులు కూడా చెల్లించకుండా బకాయిలు పెట్టిన బాధ్యతారహిత ప్రభుత్వం వైకాపాదేనని మంత్రి నిమ్మల విమర్శించారు. . ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్, ఇఎన్‌సి ఎం వెంకటేశ్వరరావు, ప్రాజెక్టు సిఇ, ఎస్ఇ పాల్గొన్నారు.



హంద్రీనీవా ప్రాజెక్టు పనుల పురోగతిపై జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష దృశ్యం

# పాస్టర్ ప్రవీణ్‌కుమార్‌కు జగ్గయ్యపేట ఫుడ్‌ప్లాజా వద్ద ప్రమాదం జరిగినట్లు సిసి కెమెరాల్లో రికార్డు

**జగ్గయ్యపేట, ఏప్రిల్ 2, ప్రభాతవార్త :** అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన క్రైస్తవ ఆధ్యాత్మిక ప్రబోధకులు, పాస్టర్ పగడాల ప్రవీణ్‌కుమార్ కేసులో కొత్త విషయాలు వెలుగుచూస్తున్నాయి. గత నెల 24వ తేదీన హైదరాబాద్ నుండి బయలుదేరిన ప్రవీణ్‌కుమార్ ఆరోజు మధ్యాహ్నం తెలంగాణాను దాటుకుని ఆంధ్రాలోకి 11 కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత ఎన్‌టిఆర్‌జిల్లా జగ్గయ్యపేట మున్సిపల్ పట్టణ శివారులోని విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి -65 పక్కనగల ఫుడ్‌ప్లాజా సమీపంలో ప్రయాణిస్తున్న బుల్లెట్ వాహనం ఒక క్లింకర్ లారీ వెనుక భాగాన్ని ఢీ కొరా పక్కకు ఒరిగి పడిపోయినట్లు సిసి కెమేరాల్లోని దృశ్యాలు బుధవారం వైరల్ అయ్యాయి. మధ్యాహ్నం గం.3.20ని లకు ఈప్రమాదం జరిగినట్లు ఈ దృశ్యాల ద్వారా తెలుస్తోంది. లారీని ఢీకొని బైక్ పక్కకు పడిపోయిన సందర్భంలో వెనుకనుండి వస్తున్న బస్సుడ్రైవర్ గమనించి చాకచక్యంగా బస్సును పక్కకు నడిపి దాటి పోయినట్లు కూడా స్పష్టంగా కన్పిస్తుంది. లేకుంటే అక్కడే ప్రవీణ్‌కుమార్‌కు పెనుముప్పు వాటిల్లేది. పడిపోయిన ప్రవీణ్‌కుమార్‌ను రోడ్డుపై వెళ్తున్న ఒక వ్యాన్, మరొక వాహనంలోనివారు గమనించి దగ్గరకు వెళ్ళిన తర్వాత ప్రవీణ్‌కుమార్ వాహనం పై నుండి లేచారు. వారు బుల్లెట్‌ను పైకిలేపి స్టాండ్‌వేసి మాట్లాడి వెళ్ళిపోయినట్లు దృశ్యాల్లో ఉంది. ఆ తర్వాత ప్రవీణ్‌కుమార్ తిరిగి తన వాహనంపై ఎక్కి ఐదారుసార్లు కిక్కుకొట్టి స్టార్ట్‌చేసుకుని అక్కడి నుండి వెళ్ళిపోయినట్లు రికార్డు అయ్యింది. కేసు దర్యాప్తు చేపట్టిన రాజమండ్రి పోలీసులు ప్రవీణ్‌కుమార్ హైదరాబాద్‌లో బయలు దేరినప్పటి నుండి కొనసాగిన ప్రయాణానికి సంబంధించిన పూర్తి ఆధారాలను సేకరిస్తున్న క్రమంలో వారం గడిచిన తర్వాత ఇక్కడి సిసి పుటేజిలోని ఈ దృశ్యాలు వెలుగుచూశాయి.



జగ్గయ్యపేట శివారులోని హైవేపై ఫుడ్‌ప్లాజా సమీపంలో సిసి కెమేరాలో రికార్డు అయిన లారీ



యాదవ కార్పోరేషన్ పాలక వర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

# టిడిపితోనే యాదవుల అభ్యున్నతి,ఆర్థిక సమృద్ధి

## - మంత్రులు అచ్చెన్నాయుడు, సవిత, పార్థసారధి, రాంప్రసాద్ రెడ్డి

**విజయవాడ,ఏప్రిల్ 2,ప్రభాతవార్తప్రతినిధి:** టీడీపీతోనే యాదవుల ఉన్నతి సాధ్యమని మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, సవిత, కొలుసు పార్థసారథి, రాంప్రసాద్ రెడ్డి స్పష్టంచేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నర్సింహాయాదవ్ సహా డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి, రాంప్రసాద్ రెడ్డితో కలిసి మంత్రి సవిత పాల్గొని ప్రసంగించారు. ముందుగా అచ్చెన్నాయుడు తొలుత యాదవ కార్పొరేషన్ పాలక వర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయపన మాట్లాడుతూ, అన్న ఎన్టీఆర్ రాకతోనే బీసీలకు రాజకీయ స్వాతంత్రం లభించిందన్నారు. వెనుబడిన కులాలకు సీఎం చంద్రబాబునాయుడు మరింత ప్రాధాన్యమిస్తున్నారన్నారు. అటు రాజకీయంగా, ఇటు సామాజికంగా బీసీలకు గుర్తింపు తీసుకొస్తున్నారన్నారు. యాదవ కార్పొరేషన్ చైర్మన్ గా గొల్ల నర్సింహయాదవ్ ఎంపిక సరైనదన్నారు. ఆయనెప్పుడూ పసుపు చొక్కాతోనే కనిపిస్తారన్నారు. సీఎం చంద్రబాబునాయుడికి అత్యంత సన్నిహితుడు నర్సింహయాదవ్ అని చెప్పారు.యాదవులను వ్యాపారులు చేస్తాం : మంత్రి సవియాదవులకు రాజకీయంగా, ఆర్థికంగా టీడీపీ ప్రభుత్వాలతోనే సాధ్యమని మంత్రి సవిత తెలిపారు. ప్రస్తుత కేబినెట్ లో 8 మంది బీసీలను మంత్రులుగా సీఎం చంద్రబాబు అవకాశమిచ్చారన్నారు. వారిలో సత్యకుమార్ యాదవ్, కొలుసు పార్థసారధి యాదవ సామాజిక వర్గానికే చెందినవారన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలను పల్లా శ్రీనివాస యాదవ్ కు అప్పగించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగానూ యాదవ సామాజిక వర్గానికి చెందిన విజయానంద్ ను నియమించారన్నారు. యాదవులకు గొర్రెలు, మేకలు, గోవుల యూనిట్లు అందజేయడానికి స్వయం ఉపాధి పథకాలు అమలు చేస్తున్నామన్నారు. యాదవులను వ్యాపారులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు ప్రణాళికలు రూపొందించారన్నారు. ఊరిలోనే ఉండి పశువుల మేత ఆర్థికంగా లబ్ధి కలిగేలా పశుగ్రాసం సాగుతో పాటు పశువుల ధాణా కూడా అందజేసేలా చర్యలు తీసుంటున్నట్లు మంత్రి సవిత వివరించారు. యాదవ కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన నర్సింహా యాదవ్ కు మంత్రి సవిత శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబుతోనే బీసీలకు న్యాయం : మంత్రి పార్థసారధిసీఎం చంద్రబాబునాయుడితోనే బీసీలకు న్యాయం జరుగుతోందని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు.

జగన్ అయిదేళ్ల పాలనలో వెనుకబడిన వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కార్పొరేషన్ల పాలక వర్గాలకు నిధులు లేవు సరికదా...కుర్చీలు కూడా సమకూర్చలేదన్నారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే జగన్ చూశారని మండిపడ్డారు.

# శ్రీకాళహస్తిలో కన్నుల పండువగా శ్రీనివాస కళ్యాణం



**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 2 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో బుధవారం శ్రీనివాస కళ్యాణాన్ని కన్నుల పండువగా అంగరంగ వైభవంగా నిర్వహించారు.పట్టణానికి చెందిన వాసవి అర్యవైశ్యసంఘం సారధ్యంలో మహేష్ కళ్యాణ్ సదన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు పట్టణంలోని ఆర్యవైశ్యులే కాకుండా పట్టణానికి చెందిన ప్రముఖులు కూడా హాజరయ్యారు.పెనుగొండ మహిమాన్విత క్షేత్రానికి చెందదిన పీఠాధిపతులు శ్రీకాళహస్తికి వచ్చిన సందర్భంగా వాసవి ఆర్యవైశ్య సంఘం తిరుమల తిరుపతి వారి దేవస్థానం సహకారంతో పీఠాధిపతుల పర్యవేక్షణలో 'శ్రీ శ్రీనివాస కళ్యాణాన్ని' ఏర్పాటు చేసారు. చక్కటి కళ్యాణవేదిక: బుధవారం మహేష్ కళ్యాణ్ సదన్ అలంకారాలతో నిండింది. సంప్రదాయ బద్దంగా కళ్యాణ మండపాన్ని తీర్చి దిద్దారు.చక్కటి విద్యుత్ దీపాల కాంతితో దేదీప్యమానంగా ఆకర్షణీయంగా ముస్తాబు చేసారు. సంప్రదాయాన్ని అద్దంపట్టేటట్లు అరటి చెట్లతోనూ, మామిడి తోరణాలతో అలంకరించారు.వచ్చే వారికి స్వాగతాలను ఏర్పాటు చేసారు.కళ్యాణవేదికను ఎంతో చక్కగా అలంకరించారు.ధార్మిక క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తి దివ్యక్షేత్రంలో వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయాలు రెండు ఉన్నాయి. శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధికి సమీపంలోని బజారువీధిలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం, అలాగే బహాదూరుపేటలోని అమ్మవారి ఆలయాల్లో నిత్యం ధార్మిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక చింతనలు ప్రసంగాలు,సభలు జరుపుతున్నారు.ఈ నేపధ్యంలో శ్రీ వావసి కన్యకాపరమేశ్వరి దేవస్థానం పాలకమండలి ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో సంప్రదాయబద్దంగా కళ్యాణ వేదికను ఏర్పాటు చేసారు. నేడు మన సమాజంలో చోటు చేసుకున్న సంప్రదాయబద్ధమైన రీతిలో కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా ప్రజ్ఞానంద సరస్వతి (బాలాస్వామి) సారధ్యంలో కళ్యాణోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా హాజరైన వారందరూ స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. స్వామి నుంచి పండ్లు ప్రసాదంగా అందుకున్నారు. ఈ కార్యక్రమాలను పాలకమండలి అధ్యక్షులు జూలుగంటి మురళీమోహన్ గుప్తా గౌరవాధ్యక్షులు ముచ్చేలి సురేంద్రబాబు(చిట్టి) గౌరవ సలహాదారు ఊటుకూరు రమేష్‌బాబు ముచ్చేలి మునిరాజా కార్యదర్శి జాలాది మోహన్, కోశాధికారి మురారి జే.స్వరూప్, ఉపాధ్యక్షులు పేర్ల రమేష్‌బాబు,పైడా బాలాజి సహాయ కార్యదర్శులు పొట్టి భాస్కర్ గుప్తా కుందాంనాగరాజు,పిఆర్‌ఓ చీదేళ్ళ మహేష్,కుందాం రవి కుమార్ సారధ్యంలో కళ్యాణోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు.46 మంది ఉభయదారులుగా వ్యవహరించారు.వారికి స్వామి ఆశీర్వదించారు.



# ముస్లింలకు రాజ్యాంగం ఇచ్చిన మత స్వేచ్ఛను హరించడానికే కేంద్రం కుట్ర

**విజయవాడ,ఏప్రిల్2,ప్రభాతవార్తప్రతినిధి:ముస్లిమ ులకు** రాజ్యాంగం ఇచ్చిన మత స్వేచ్ఛను హరించడానికే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లు తెచ్చి మైనార్టీలను అణచి వేసే కుట్ర చేస్తోందని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ వ్యాప్తంగా ముస్లిముల మనోభావాలు దెబ్బతీయడమే మోడీ అజెండా అని, పార్లమెంట్ ముందుకు సవరణ బిల్లు రావడం అంటే దేశానికి బ్లాక్‌డే అని అన్నారు. దేశ చరిత్రలో ఒక మాయని మచ్చగా మిగిలిపోయే చర్యగా ఆమె అభివర్ణించారు. వక్ఫ్ ఆస్తులను అన్యాక్రాంతం చేయడం కోసమే ఈ పన్నాగమని, వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ దేశంలో 20 కోట్ల మంది ముస్లిములు ఆందోళనలు చేస్తున్నా.. మోడీ పట్టించుకోలేదని విమర్శించారు. లౌకిక రాజ్యంగ పట్ల మోడీ ప్రభుత్వం చిన్న చూపుతో ఉందన్నారు,ఆయనకు ముస్లింలంటే వ్యతిరేకతతో అర్థం కాదన్నారు,వక్ఫ్‌బిల్లు సవరణను ఉపసంహరించుకోవాలన్నారు.



పోరుగర్జనలో ప్రసంగిస్తున్న కేశన శంకరరావు

# బిసిలకు 33శాతం రిజర్వేషన్లివ్వాలి: ఢిల్లీలో బిసిల ఉద్యమం

**విజయవాడ, ఏప్రిల్ 2, ప్రభాతవార్త :** బిసిలకు 33శాతం రిజర్వేష్లనివ్వాలని ఏపి బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు డిమాండ్ చేశారు. సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తో కలిసి ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో బుధవారం జరిగిన బిసి ల పోరుగర్జనలో పాల్గొన్న ఆయన మహిళా రిజర్వేషన్ల బిల్లులో బిసి మహిళల వాటా తేల్చాలన్నారు. జాతీయ సమగ్ర జనగణనలో బిసి కులగణన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారన్నారు.

# ఎసిబి ముందు హాజరైన సమాచార శాఖ మాజీ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి

**విజయవాడ,ఏప్రిల్2,ప్రభాతవార్తప్రతినిధి:** ఏసీబీ కార్యాలయానికి సమాచార శాఖ మాజీ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్‌రెడ్డి విచారణకు హాజరయ్యారు. విచారణకు తప్పనిసరిగా హాజరుకావాలని ఇటీవలే విజయ్ కుమార్‌ను హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలతో ఏసీబీ ఆఫీసుకు విజయ్ కుమార్ వచ్చారు. గత ప్రభుత్వంలో సమాచార శాఖ ద్వారా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారన్న ఆరోపణల నేపథ్యంలో ఏసీబీలో నమోదైన కేసుకు సంబంధించి బుధవారంఅప్పటి సమాచార కమిషనర్‌గా పనిచేసిన విజయ్ కుమార్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఇప్పటికే కమషనర్‌గా పనిచేసిన విజయ్ కుమార్‌పై కేసు నమోదు చేసినప్పటికీ ఆయన విచారణకు రాకపోవడంతో ఇటీవలే హైకోర్టు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

# విజయవాడ రైతు బజార్‌ను తనిఖీ చేసిన మంత్రి నాదెండ్ల మనోహర్



**విజయవాడ,ఏప్రిల్2,ప్రభాతవార్తప్రతినిధి:** వినియోగాలకు నాణ్యమైన సరుకులు సరసమైన ధరలకు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రైతు బజార్ నిర్వహిస్తుందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈరోజు ఆటోనగర్ లో ఉన్న రైతు బజార్ ను మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు..తనిఖీలలో భాగంగా. అధికారులతో కలిసి ప్రతి షాప్ ను షాపులో ఉన్న సరుకులను పరిశీలించారు... వినియోగదారులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.. రైతు బజార్లో ఉన్న బియ్యం షాప్ లో బియ్యం పరిశీలించి, 26 కేజీల గల బియ్యం బస్తాలు దాదాపు 204 బియ్యం బస్తాలను రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు..ప్రభుత్వం రైతు బజార్‌లలో నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. రైతు బజార్‌ల నిర్వహణపై మరింత కఠినమైన చర్యలు ఉంటాయన్నారు. ప్రజలు నాణ్యమైన ఉత్పత్తులు పొందేలా అన్ని చర్యలు కొనసాగుతాయి.

# రైళ్లను నిలిపి ప్రయాణికులను దోపిడీ చేసిన దొంగలు



**కావలి (నెల్లూరు), ఏప్రిల్ 2, ప్రభాతవార్త** రైళ్లను నిలిపివేసి దోపిడీ దొంగలు ప్రయాణీకులనుంచి బంగారం, నగదు దోపిడీ చేసిన ఉదంతం తీవ్రసంచలనం సృష్టించింది. ఒక్కసారిగా ప్రయాణీకులు కేకలతో భయకంపితులయ్యారు. ఈ సంఘటనపై రైల్వే డిఎస్పీ మురళీధర్ కావలి ఆర్‌పిఎఫ్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కావలి జీఆర్‌పిఎఫ్ స్టేషన్ పరిధిలో అల్లూరురోడ్డు పడుగుపాడు స్టేషన్ల మధ్య మంగళవారం అర్ధరాత్రి 12 గంటలకు గుర్తుతెలియని దుండగులు రైళ్లను నిలిపివేసి నిద్రిస్తున్న ప్రయాణీకులనుంచి బంగారు నగలు, నగదు దోపిడీ చేశారన్నారు. చండీఘడ్ మధురై సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో ముగ్గురు దుండగులు రైల్లోకి ప్రవేశించి ప్రయాణీకులను భయభ్రాంతులకు గురిచేశారన్నారు. వారివద్ద ఉన్న బంగారు నగలు, నగదు దోపిడి చేశారన్నారు. మరో ఇద్దరు రైలులోపలే ఉండి ఆ మగ్గురు దుండగులకు సహకరించినట్లు డిఎస్పీ తెలిపారు. ప్రయాణీకులను బెదిరించి ఇద్దరు మహిళల మెడల్లో 20 సవర్ల బంగారు నగలను దోపిడీ చేశారన్నారు. మరో వ్యక్తివద్ద ఉన్న బ్యాగును బలవంతంగా లాక్కున్నారన్నారు. దుండగులు ముందుగానే కేబుల్‌వైర్లను కట్‌చేసి సిగ్నల్స్‌ను మార్చి రైళ్లను నిలిపివేసినట్లు తెలిపారు. ఈ ఉదంతం రైల్వే చరిత్రలోనే తీవ్ర సంచలనం సృష్టించింది. ఇకపై ఇలాంటి సంఘటనలు జరగకుండా భద్రతను పెంచుతామని, నేరస్తులను త్వరలోనే పట్టుకుంటామని ఆయన తెలిపారు. గ్యాంగ్‌దోపిడీ దుండగులు పడుగుపాడు స్టేషన్‌లో ట్రాక్‌పై సమస్యను సృష్టించి 20 నిముషాలపాటు రైలును నిలిపివేశారు. ఎస్-4, ఎస్-5 కోచుల్లో మహిళల మెడల్లోని బంగారు నగలు దుండగులు దోపిడి చేశారు.

# బిసిలపై బిజెపి, బిఆర్ఎస్ నేతల మొసలికన్నీరు

## రాజ్యాంగాన్ని మార్చి బిసి రిజర్వేషన్ లేకుండా చేయనున్న బిజెపి: పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** బిసిల మహాగర్జన సభకు హాజరుకాని బిజెపి నేతలకు బిసిల గురించి మాట్లాడే అర్హత లేదని 42శాతం రిజర్వేషన్ సాధనకు తోడ్పాటు అందించని తెలంగాణ బిజెపి నేతల్లారా ఖబడ్దార్ అని పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ హెచ్చరించారు. జంతర్‌మంతర్ ధర్నాలో పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ బిసిలపై బిజెపి, బిఆర్ఎస్ నేతలు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. కుల గణన నిర్వహించింది రెడ్డి సామాజిక వర్గానికి చెందిన రేవంత్ రెడ్డి అన్న విషయం బిజెపి బిఆర్ఎస్ నేతలు గుర్తుంచుకోవాలని కోరారు. కుల గణన సర్వేతో తెలంగాణ దేశానికి దిక్సూచిగా మారిందని స్తోత్కర్షలు చెప్పుకున్నారు. ప్రధాని మోడీకి కనువిప్పు కలిగేలా బిసి మహాగర్జన ధర్నా జరుగుతోందని అన్నారు. భారత ప్రధాని మోదీ కళ్లు తెరవండి అన్ని రాష్ట్రాల నేతల కోరిక మేరకు బిసి బిల్లుకు మద్దతు ఇవ్వండి అని ఆయన సూచించారు. దేశంలో బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆలోచించేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని ఆయన చెప్పారు. దేశ చరిత్రలో నిలిచిపోయే విధంగా కుల గణన నిర్వహించి బజనాభా 56 శాతానికి పైగా ఉన్నారని సర్టిఫికెట్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీది అన్నారు. రాహుల్ గాంధీ ఆశయం మేరకు సిఎం రేవంత్ రెడ్డి, మంత్రుల బృందం చిత్త శుద్ధితో కుల గణన చేసి చరిత్ర సృష్టించింది. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు విద్యా ఉపాధిలో 42 శాతం రిజర్వేషన్లు ప్రవేశ పెట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అని ఆయన అన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును 9 వ షెడ్యూల్ లో చేర్చేందుకు బిసి సంఘాల ఆధ్వర్యంలో కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నామని ఆయన చెప్పారు. రేవంత్ రెడ్డి బిసి సంక్షేమం కోసం అపరిచితుడిలా( పాజిటివ్ కోణంలో)అవతారమెత్తి రాహుల్ గాంధీ ఆశయం మేరకు కుల గణన సర్వేను సంకల్పంతో పూర్తి చేశారని మహేష్ కుమార్ కొనియాడారు. అనేక ఒత్తిళ్లు ఉన్నా సామాజిక కోణంలో కుల సర్వే నిర్వహించి తీరుతానని సిఎం రేవంత్ రెడ్డి శపథం చేశారని గుర్తుచేశారు.

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించి చరిత్ర సృష్టించి దేశానికి ఆదర్శంగా నిలిచిందని కితాబు ఇచ్చుకున్నారు. బిసిలకు న్యాయం జరగాలంటే కులగణన సరైన మార్గమని రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రతో గుర్తించారు. దేశవ్యాప్తంగా కులగణ చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని వాపోయారు. కాంగ్రెస్ తెలంగాణలో శాస్త్రీయంగా విజయవంతంగా కులగణన చేపట్టినదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కామారెడ్డి బిసి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంది. బలహీన వర్గాలకు అన్ని రంగాల్లో న్యాయం జరిగి వారికి దక్కాల్సిన హక్కులు వారికి లభించేలా రేవంత్ రెడ్డి సర్కార్ తెలంగాణలో నిర్వహించిన కులగణన సర్వే దేశ చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచిపోతుందని అన్నారు. స్వతంత్ర భారతదేశంలో కులగణన చేపట్టి పూర్తి చేసిన రాష్ట్రంలో తెలంగాణ చరిత్రలో నిలిచిపోయింది. కులగణనలో బిసి జనాభా 56 శాతానికి పైగా ఉందని నిర్ధారణ కావడంతో విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మార్చి 17వ తేదీన అసెంబ్లీలో తెలంగాణ ప్రభుత్వం బిల్లు ఆమోదించడం చారిత్రాత్మకం అని ఆయన అన్నారుపతిపక్షాలు అసత్యాలతో నిరాధార ఆరోపణలు చేస్తున్నాయని వాపోయారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుండి తెరవెనుక బిజెపి, బిఆర్ఎస్‌లు ఒకటిగా ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో, ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరకు లోపాయికారి ఒప్పందంతో పనిచేశాయని ఆరోపించారు. కులగణనపై కూడా ఈ రెండు ప్రభుత్వాలు ఇదే తీరులో వ్యవహరిస్తూ బిసిలకు అన్యాయం చేసేందుకు సిద్ధమవుతున్నాయని విమర్శించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం టికెట్లు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే ప్రకటించినా బిఆర్ఎస్, బిజెపి నుండి దీనిపై ఎలాంటి స్పందన లేకపోవడం శోచనీయమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతంగా పూర్తి చేసిన కులగణన లెక్కలు తప్పులతడకంటూ విమర్శిస్తున్న బిఆర్ఎస్ అందుకు చూపుతున్న వివరాలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. బిఆర్ఎస్ గతంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను అధికారికంగా వెల్లడిరచకుండా, ఇప్పుడు అనధికార లెక్కలతో వాదించడం బిసిలపై వారికున్న కపట ప్రేమకు నిదర్శనం అని అన్నారు. కులగణన సర్వే కంటే సమగ్ర కుటుంబ సర్వేలో బిసి జనాభా అధికంగా ఉంటే బిఆర్ఎస్ పాలనలో స్థానిక ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లను 34 శాతం నుండి 23 శాతానికి ఎందుకు తగ్గించారు..? అని ఆయన ప్రశ్నించారు.



బుధవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

# బిఆర్ఎస్ దారిలోనే కాంగ్రెస్

## పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గతంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అవినీతి, దోపిడీ విపరీతంగా పెరిగాయని భావించిన ప్రజలు కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంసైతం అనతి కాలంలోనే అదే మార్గంలో పాలన కొనసాగిస్తుందని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. బిల్లుల విడుదల కోసం 6-7 శాతం కమీషన్లు తీసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతుందన్నారు. మంత్రులు ఆయా జిల్లాల్లో కమీషన్ల కోసం ప్రత్యేకంగా కౌంటర్లు తెరిచినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం లగచర్ల భూసేకరణతో పాటు, ఫ్యూచర్ సిటి పేరిట వేల ఎకరాలను పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోంది. రాష్ట్రంలో వేల ఎకరాల భూబ్యాంకు ఉంది. అయితే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటికి సంబంధించి 400 ఎకరాల భూమినే ఎందుకు అమ్మాలని చూస్తోందని ప్రశ్నించారు. హెచ్‌సియు భూముల విషయంలో విద్యార్థులు, విసి, రిజిస్ట్రార్, భారతీయ జనతా పార్టీతో పాటు పర్యావరణవేత్తలు, సామాజిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇవన్నీ పట్టించుకోకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందన్నారు. ఆ భూములు యూనివర్సిటీకి చెందిన భూములని విద్యార్థులు, విసి, రిజిస్ట్రార్‌తో పాటు వివిధ సామాజిక సంఘాలు చెబుతున్నాయి. అటవీ, పర్యావరణ నిబంధనలను తుంగలో తొక్కుతూ, అరుదైన జీవజాతులకు ప్రమాదం కలిగించేలా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. హెచ్‌సియు భూములను నేషనల్ ఎన్విరాన్‌మెంట్ పార్క్‌గా డిక్లేర్ చేయాలి. పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టే యత్నం వెనుక అవినీతి దాగి ఉందన్నారు. హెచ్‌సియు భూములను ప్రైవేట్ సంస్థలకు అప్పగించనివ్వం. బిజెపి దీనిపై పోరాటం కొనసాగిస్తుందన్నారు. భూముల అమ్మకంతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పతనం ప్రారంభమవుతుందన్నారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకించేవాళ్లు ముస్లిం ద్రోహులేనని, వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును అడ్డుకునే ప్రయత్నం చేస్తే, వారే ముస్లిం పేదల హక్కులకు ద్రోహం చేస్తున్న వారవుతారని అన్నారు.

# హెచ్‌సియు భూముల వేలాన్ని నిలువరించండి

## కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు బిఆర్ఎస్ ఎంపిల వినతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 2:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయు) భూములను వేలం వేయాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలను వెంటనే నిలువరించాల్సిందిగా బీఆర్ఎస్ ఎంపీలు కె.ఆర్.సురేష్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్ రావులు కేంద్ర విద్యా, నైపుణ్యాభివృద్ధి శాఖల మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కు విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ సురేష్ రెడ్డి, డిప్యూటీ లీడర్ రవిచంద్ర, విప్ దామోదర్ రావులు బుధవారం ఢిల్లీలో మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తో భేటీ అయ్యారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో నెలకొన్న సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన విలువైన భూములలో 400 ఎకరాలను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వేలం వేసేందుకు ప్రయత్నిస్తున్నదని ఎంపీలు మంత్రికి వివరించారు. ఈ భూములలో చెరువులు, కుంటలతో పాటు అరుదైన వృక్ష జాతులు, జింకలు, నెమళ్లు, సరీసృపాలతో జీవ వైవిధ్యం నెలకొని ఉందని, పరిసర ప్రాంతాల వారికి స్వచ్ఛమైన సహజవాయువు దొరుకుతున్నదన్నారు. ఎంతో విలువైన, తమ యూనివర్సిటీ భవిష్యత్తు అవసరాలకు గాను ఉన్న ఈ భూములను వేలం వేయకుండా నిలువరించాలని కోరుతూ విద్యార్థులు, మేధావులు ఆందోళన బాట పట్టిన విషయాన్ని ఎంపీలు సురేష్ రెడ్డి, రవిచంద్ర, దామోదర్ రావులు మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దృష్టికి తెచ్చారు. మంత్రి వెంటనే స్పందిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటానని ఎంపీలకు హామీనిచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్, బీఆర్ఎస్వీ నాయకులు గెల్లు శ్రీనివాస్ యాదవ్, తుంగబాలు, సెంట్రల్, ఉస్మానియా యూనివర్సిటీలకు చెందిన పలువురు విద్యార్థి నాయకులు ఉన్నారు.

# పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో 6,740 చలివేంద్రాల ఏర్పాటు

**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త :** రోజురోజుకు ఉష్ణోగ్రతలు అధిక కావడంతో తాగు నీటి ఎద్దడి నివారణకు పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క అదేశాల మేరకు అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా వివిధ పనులు నిమిత్తం గ్రామాల్లో బయటకు వచ్చేవారు త్రాగు నీటి సమస్యను ఎదుర్కోకుండా పలు ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా 4818 చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేసింది. దాంతో అంచనాలకు మించి గ్రామ పంచాయితీల్లో 6740 చలివేంద్రాలను పంచాయితీరాజ్ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు.

ఈ చలివేంద్రాలకు నీటి సరఫరా బాధ్యతను మిషన్ భగీరథ అధికారులు తీసుకోకగా వాటి నిర్వహణ బాధ్యతను డిపివో, ఎంపడివోలు చూస్తున్నారు. ఆదిలాబాద్‌లో 124, భద్రాచలం కొత్తగూడెంలో 413, హన్మకొండ 141, జగిత్యాల 951, జనగాం, 208, జయశంకర్ భూపాలపల్లిలో 240, జోగులాంబ గద్వాల్ 213, కామారెడ్డి 328, కరీంనగర్ 191, ఖమ్మం, 458, కుమ్రం భీం ఆసిఫాబాద్ 99, మహబూబాద్ 99, మహబూబ్‌నగర్ 176, మంచిర్యాల 67, మెదక్ 97, మేడ్చల్ మల్కాజిగిరి 34, ములుగు, 210, నాగర్ కర్నూలళ్ 53, నల్గొండ 201, నారాయణ పేట 276, నిర్మల్ 192, నిజామాబాద్ 324, పెద్దపల్లి 292, రాజన్న సిరిసిల్ల 119, రంగారెడ్డి 76, సిద్దిపేట 398, సంగారెడ్డి 64, సూర్యాపేట 152, వికాబాద్ 135, వనపర్తి 145, వరంగల్ 81, యాదగిరి భువనగిరలలో 89 చలివేంద్రాలను పంచాయితీరాజ్ అధికారులు ఏర్పాటు చేశారు.

# ఎల్ఆర్ఎస్ రాయితీ గడువు పొడిగింపు

## ఉత్తర్వులు జారీ చేసిన పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి, ఎం దానకిషోర్

**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్) రాయితీ గడువును ప్రభుత్వం పొడిగించింది. ఏప్రిల్ నెలా ఖరు వరకు పొడిగిస్తున్నట్లు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్య దర్శి ఎం దానకిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు జి ఓ 182 ను జారీ బుధవారం జారీ చేశారు. గత నాలుగేళ్లుగా పెండింగులో ఉన్న ప్లాట్లకు రిజి స్ట్రేషన్ చేసుకునేవీలు ప్రభుత్వం కల్పించిన విషయం తెలిసిందే. ఎల్ఆర్ఎస్ ఫీజును 25 రాయితీతో చెల్లించేందుకు మార్చి 31 వరకు గడువు ఇచ్చింది. తాజాగా ఆ గడువును ఏప్రిల్ 30 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. కాగా మొత్తం దరఖాస్తులు 25,67,107 అందగా, అందులో ఫీజు చెల్లించాలంటూ 20,00,495 ఫీజు నోటీసులు పంపించారు. వారిలో 4,58,680 మంది మాత్రమే ఫీజును చెల్లించారు.



విలేకరుల సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు

# మహిళపై అత్యాచారం కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలి

## బాధిత మహిళకు ప్రభుత్వపరంగా అండగా నిలుస్తాం..

## ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:** మహిళపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని సందర్శించి జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్‌తో కలిసి ఊర్కొండ అత్యాచార విషయంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ అత్యాచారం చేసిన నిందితులను కస్టడీలోకి తీసుకున్నామని, ఏ చట్టాలు అయితే వర్తిస్తాయో అన్ని సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి నిందితులకు జీవిత ఖైదు పడే విధంగా నిందితులను రిమాండ్‌కు తరలించారని మంత్రి పేర్కొన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ద్వారా జీవిత ఖైదు పడే విధంగా కఠినంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇలాంటి ఘటనలు జరగడం చాలా బాధాకరమని, నాగరిక సమాజంలో పశువుల్లాగా ప్రవర్తించడం ఎవరు కూడా సహించారన్నారు. అలాంటి వారిని సమాజం పూర్తిగా బహిష్కరిస్తుందన్నారు. ముఖ్యంగా ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వపరంగా, పోలీస్ శాఖ పరంగా సమాజంలో ఉండే ప్రతి వ్యక్తి బాధ్యతపరంగా వివరించి ఇలాంటి కామాంధుల నుంచి మహిళలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఇటువంటి దుర్ఘటనను మళ్లీ జరగకుండా భక్తులు వచ్చే దేవాలయాలు, నాగర్‌కర్నూల్ ట్యాంక్‌బండ్ వంటి ప్రాంతాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసి పోలీస్ పహారా చేసే విధంగా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామేశ్వర్, డి. ఎస్. పి బుర్రి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర పదాధికారుల సమావేశం

## అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని నిర్ణయం

**హైదరాబాద్, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అధ్యక్షతన రాష్ట్ర పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో ఎస్సీ మోర్చా మాజీ రాష్ట్ర అధ్యక్షులు కొప్పు భాషా, వేముల అశోక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు క్రాంతి కిరణ్, కుమ్మరి శంకర్, శివాజి, తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో అంబేద్కర్ జయంతి వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతి మండలం, నియోజకవర్గం, జిల్లా స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అంబేద్కర్ స్ఫూర్తిదాయక జీవితాన్ని ప్రజలకు చేరువ చేసేలా, విద్యార్థులకు, యువతకు, ప్రజలకు అంబేద్కర్ సందేశాన్ని ప్రచారం చేసేలా, అంబేద్కర్ సంకల్పాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాల నిర్వహణ కన్వీనర్‌గా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్‌ను పార్టీ నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా అంబేద్కర్ జయంతి వేడుకలను విజయవంతం చేయడానికి బిజెపి ఎస్సీ మోర్చా కార్యకర్తలు సమిష్టిగా పని చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# రాహుల్‌గాంధీ దేశానికి దిక్సూచి



## సర్వాయి పాపన్న స్ఫూర్తితో 42 శాతం రిజర్వేషన్ పోరాటం

## ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో సర్వాయి పాపన్న వర్ధంతి సభలో మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** సామాజిక న్యాయం పోరాటానికి సర్వాయి పాపన్న నాయకత్వం వహించినారని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లోని అంబేద్కర్ ఆడిటోరియంలో పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి బుధవారం నిర్వహించారు. సర్వాయిపాపన్న వర్ధంతి సభలో మంత్రి పొన్నం మాట్లాడుతూ గోల్కొండ రాజ్యంపై తిరుగుబాటు చేసి గోల్కొండ రాజ్యంలోని అనేక కోటలను వరుసగా జయించారని గోల్కొండ ఖిలాను కూడా చుట్టు ముట్టారని గుర్తుచేసు కొన్నారు. సర్వాయి పాపన్న సైన్యంలో అన్ని వర్గాల బహుజనులను ఉంచుకున్నారని ఆయన స్ఫూర్తితోనే మనం అందరం కలిసి ముందుకు పోవాలని హితవు చెప్పారు. తెలంగాణ ప్రజలకు రాహుల్ గాంధీ దిక్సూచి ఆయన మార్గదర్శకంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా నడుస్తోందని అన్నారు. బిసి అనే నినాదంతో తమిళనాడు పోరాటస్ఫూర్తితో 9వ షెడ్యూల్‌లో 42శాతం రిజర్వేషన్ చేర్చాలని ఆయన కోరారు. రాజ్యాంగంలో మార్పుచేసి సాధించలేనిది ఏదీలేదని ఆయన అన్నారు. ఇబిసికి 10 శాతం రిజర్వేషన్ ఇవ్వడానికి 50శాతం మించి ఇచ్చారని తెలిపారు.

తెలంగాణ శాసనసభలో బిజెపి, బిఆర్ఎస్ బేషరతుగా మద్దతు తెలిపాయని ఆయన గుర్తు చేసుకున్నారు. జాతీయస్థాయిలో కూడా బిజెపి బిఆర్ఎస్ మద్దతు ఇవ్వాలని కోరారు. అందరం ముక్తకంఠంతో ముందు సాగాలని పొన్నం అన్నారు. బిసి సంక్షేమ మంత్రిగా దేశం లోని అన్ని పార్టీలలోని బిసి ఎంపిలు 42 శాతం బిసి రిజర్వేషన్‌కు మద్దతు పలుకాలని కోరారు. కార్యక్రమంలో సహచర మంత్రులు కొండా సురేఖ, ఎమ్మెల్యేలు, ఎంపిలు, ఎమ్మెల్సీలు పాపన్నచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# బిసి రిజర్వేషన్లపై సిఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదు

## ఓటు బ్యాంకుగానే బిసిలను చూస్తున్నారు

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి




**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** బిసి రిజర్వేషన్లు కల్పించడంలో రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేదని తాము ముందు నుండే చెప్తున్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. అది మరోసారి ఇప్పుడు నిరూపితమైందని అన్నారు. బిసి రిజర్వేషన్ల పేరు చెప్పి బుధవారం ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర బిసి సంఘాల ముసుగులో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో ధర్నాకు దిగడం అర్థమవుతుందన్నారు. బిసిలను కేవలం ఓటుబ్యాంకుగానే చూస్తున్న రేవంత్ రెడ్డికి వారిని వాడుకొని వదిలేయాలన్న ఆలోచనే తప్పితే వారి అభివృద్ధి కాదన్నారు. బిసి రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని మీరు హామీ ఇచ్చి ఇప్పుడు కేంద్రంపై నెపం ఎలా నెడుతారు? బిసి రిజర్వేషన్ల పెంపు మీ పరిధిలో లేకపోతే, ఎలా హామీ ఇచ్చారు? బిసి రిజర్వేషన్లు పెంచడం ఇష్టం లేకనే రేవంత్ రెడ్డి ఈ డ్రామాలాడుతున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి అసలైన బిసి ద్రోహి. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీయే రేవంత్ రెడ్డి వెనకుండి ఈ డ్రామాలు ఆడిస్తున్నాడు. ఒక బిసి వ్యక్తి ప్రధానమంత్రి అయితే జీర్ణించుకోలేక నరేంద్ర మోడీని రాహుల్ గాంధీ అసభ్యంగా తూలనాడిన విషయాన్ని బిసిలు ఇంకా మరచిపోలేదు. మోడీ అనే ఇంటి పేరున్న వారంతా దొంగలే అంటూ రాహుల్ గాంధీ తన బిసి వ్యతిరేకతను బాహాటంగానే చాటుకున్న విషయం అందరికీ తెలిసిందే అన్నారు. కాంగ్రెస్ ముందు నుంచీ బిసిల రిజర్వేషన్లను అడ్డుకుంటూ వచ్చింది. తొలి ప్రధాని నెహ్రూ బిసి రిజర్వేషన్లను అడ్డుకున్నారు. ఇందిరా గాంధీ కూడా బిసి రిజర్వేషన్ల అమలును తొక్కిపెట్టారు. మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని నాటి ప్రధాని విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ ప్రయత్నిస్తే, నాడు రాజీవ్‌గాంధీ పార్లమెంటు వేదికగానే తీవ్రంగా వ్యతిరేకించారు. వారి వారసత్వంలోనే రాహుల్ గాంధీ బిసి వ్యతిరేకతను నరనరాన నింపుకొన్నారు. రాష్ట్రంలో బిసి రిజర్వేషన్లను అడ్డుకునేందుకు రేవంత్ రెడ్డిని ముందు పెట్టి రాహుల్ గాంధీ డ్రామాలు ఆడిపిస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డి బిసిలకు ఇచ్చిన ఏ హామీని అమలు చేయలేదు. కామారెడ్డి బిసి డిక్లరేషన్‌లో అధికారంలోకి వచ్చిన 6 నెలల్లో బిసి రిజర్వేషన్లు పెంచుతామని చెప్పారు, తర్వాత మరచిపోయారు. ప్రజల నుంచి ముఖ్యంగా బిసిల నుంచి తీవ్రమైన ఒత్తిడి రావడంతో మరో గత్యంతరం లేక 42 శాతం బిసి రిజర్వేషన్ల బిల్లును పాస్ చేశారు తప్పితే, బిసిల బాగు కోరి కాదు. బిసి సంక్షేమం కోసం ఏడాదికి రూ.20,000 కోట్లు చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామన్నారు. బిసి ద్రోహులైన రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి బిసిలపై కపటప్రేమ ప్రకటిస్తూ ఎన్నికల్లో బిసిలకు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలనుంచి ప్రజల దృష్టి మళ్లించే రాజకీయ కుట్రలు చేస్తున్నారు.

# బిసి గర్జన కాదు.. కాంగ్రెస్ మాయగర్జన

## కాంగ్రెస్ హయాంలో బిసిలకు అన్యాయం

## మళ్లీ అదే నాటకం: బిజెపి ఎంపి కె.లక్ష్మణ్



**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిసి రిజర్వేషన్ల అంశాన్ని కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటూ, బిసిలను మరోసారి మోసం చేయడానికి కుట్రపన్నుతోందని బిజెపి ఎంపి డా.లక్ష్మణ్ మండిపడ్డారు. బిసి రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలన్న కాంగ్రెస్ పార్టీ ప్రకటన పూర్తి మోసపూరితమైనదన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికగా పోరుగర్జన పేరుతో కాంగ్రెస్ పార్టీ మరో రాజకీయ డ్రామాకు తెరలేపిందన్నారు. స్వతంత్ర భారతదేశ చరిత్రను పరిశీలిస్తే, కాంగ్రెస్ పార్టీ బిసిలకు ఎన్నడూ న్యాయం చేయలేదని స్పష్టంగా కనిపిస్తుంది. 1952లో తెలంగాణలో 102 శాసనసభ స్థానాల్లో బిసిలకు కేవలం 9 సీట్లు మాత్రమే ఇచ్చింది. 2023లో కూడా కాంగ్రెస్ పార్టీ బిసిలకు కేవలం 22 టిక్కెట్లు మాత్రమే ఇచ్చి వారి హక్కులను కాలరాస్తూ వచ్చింది. ఇక ఇప్పుడు, బిసి రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలన్న నినాదం కాంగ్రెస్ పార్టీ బిసిలను మభ్యపెట్టేందుకు వేస్తున్న కొత్త పథకం మాత్రమే అన్నారు. 9వ షెడ్యూల్‌లో బిసి రిజర్వేషన్ల అంశం కాంగ్రెస్ చేస్తున్న రాజకీయ డ్రామా అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(4), 16(4) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలకు బిసి రిజర్వేషన్లను పెంచే పూర్తి అధికారముందన్నారు. అసలు 9వ షెడ్యూల్ అడ్డుగా లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే ఈ అంశాన్ని అమలు చేయోచ్చునన్నారు. అయినప్పటికీ, కాంగ్రెస్ పార్టీ అనవసరంగా 9వ షెడ్యూల్ అంశాన్ని లేవనెత్తడం, దీన్ని ఓ రాజకీయ అస్త్రంగా మార్చి ప్రజలను తప్పుదోవ పట్టించడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. 1973 తర్వాత 9వ షెడ్యూల్‌లో చేర్చిన ఏ అంశంపైనా సుప్రీంకోర్టుకు న్యాయ సమీక్ష చేయడానికి అధికారముందన్నారు. ఈ నేపథ్యంలో బిసి రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా రక్షణ కలుగుతుందని కాంగ్రెస్ పార్టీ చెబుతున్నది పూర్తిగా తప్పుదోవ పట్టించే ప్రయత్నమే అన్నారు.

# మొగలాయిలకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు పాపన్న



## పర్యాటక సాంస్కృతిక, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** మొగలాయుల పాలనకు వ్యతిరేకంగా పోరా టం చేసి వీరమరణం పొందిన యోధుడు పాపన్న అని పర్యాటక సాంస్కృతిక, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గాంధీభవన్‌లో బుధవారం పిసిసి కల్లు గీత కార్మిక విభాగం చైర్మెన్ కేశం నాగరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ ఆత్మ బలిదాన్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు పాపన్న చిత్ర పటానికి పూల మాలలువేసి నివాళులు అర్పించారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ బహుజనుల రాజకీయ స్వావలంబన కోసం పోరాటం చేసిన వీరుడు అని కీర్తిం చారు. సర్వాయి పాపన్న 3 వందల యేళ్ల క్రితం మొగలాయుల పాలనపై తెరుగుబాటు కోసం బహుజనులను ఏకం చేసి 18 కోటలను జయించారని చరిత్రను మంత్రి జూపల్లి గుర్తుచేసు కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూపంలో ఇప్పుడు సర్వాయి పాపన్న తిరిగి బహుజనుల కోసం వచ్చాడు అని ఆయన నిర్వచించారు. బిసి లకు మేలు చేయాలని సిఎం రేవంత్‌రెడ్డి ప్రతిన పూనారని ఆయన అన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ తీసుకొచ్చారు అని ఆయన వివరించారు. బిసిల రిజర్వేషన్‌తో సిఎం రేవంత్‌రెడ్డి బిసిలకు అండగా ఉన్నారు పాపన్న ఆలోచనలతో బిసిలకు మంచి చేయాలని నవయుగ పాపన్న వారసుడిగా రేవంత్‌రెడ్డి ముందుకు వెళ్తున్నారని ఆయన అన్నారు. కార్య క్రమంలో నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రా జేష్‌రెడ్డి తెలంగాణ కల్లుగీత విభాగం చైర్మన్ నాగ రాజుగౌడ్, కొంద్రు నలిపిగౌడ్, రేవతిగౌడ్, దుర్గేష్ గౌడ్, నాసగోని రాజయ్యగౌడ్, మురళీగౌడ్, నరేష్‌గౌడ్ సుధీర్ కొక్కొండ పలువురు నాయకులు పాల్గొని ఘన నివాళులు అర్పించారు.

# 'మెగా 157' పూజా కార్యక్రమం

మెగాస్టార్ చిరంజీవి హైలీ యాంటిసిపేటెడ్ ప్రాజెక్ట్ మెగా 157 ఉగాది సందర్భంగా జరిగిన పూజా కార్యక్రమంతో గ్రాండ్‌గా ప్రారంభమైంది. ఈ చిత్రంపై అభిమానులు, ప్రేక్షకుల అంచనాలు భారీ స్థాయిలో ఉన్నాయి. బ్లాక్‌బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రవిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం చిరంజీవిని ఫుల్ లెంత్ హ్యూమర్ రోల్‌లో ప్రజెంట్ చేయనుంది. అనిల్ రవిపూడి పక్కా ఎంటర్‌టైనర్స్ తెరకెక్కించడంలో ప్రత్యేకమైన పట్టు కలిగిన దర్శకుడు మాత్రమే కాకుండా, సినిమాలను ప్రమోట్ చేయడంలోనూ డిఫరెంట్, క్రియేటివ్ ప్రమోషన్స్‌తో అలరిస్తుంటారు. ఇటీవల "సంక్రాంతికి వస్తున్నాం" చిత్రాన్ని విభిన్నమైన రీతిలో ప్రమోట్ చేసి విజయం సాధించిన అనిల్ రావిపూడి, అదే స్థాయిలో మెగా 157కి కూడా ఇన్నోవేటివ్ ప్రమోషన్లను ప్లాన్ చేస్తున్నారు. ఈ ప్రమోషన్‌లో భాగంగా, చిరంజీవి కెరీర్‌లోని ఐకానిక్ పాత్రలతో ఒక వినూత్నమైన వీడియోను విడుదల చేశారు. ఈ వీడియో మెగా అభిమానులకు నోస్టాల్జిక్ అనుభూతిని కలిగించడంతో పాటు, మెగా 157 మూవీ టీంని ఫన్ ఫుల్‌గా పరిచయం చేసింది. వీడియో ప్రారంభంలో, దర్శకత్వ విభాగం చిరంజీవి వినోదాత్మక టైమింగ్ చూసేందుకు ఎంతో ఉత్సాహంగా ఉన్నామని చెప్పారు. రచయితలు అజ్జు మహాకాళి, తిరుమల నాగ, ఉపేంద్ర తమ రైటింగ్ తో "డైమాండ్స్"లా పనిచేస్తామని సరదాగా చెప్పారు. రచయిత నారాయణ అయితే అనిల్ రవిపూడి తీసుకునే ప్రతి నిర్ణయాన్ని హిట్లర్ లా ప్రశ్నిస్తానని సరదాగా చెప్పారు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్, రచయిత ఎస్. కృష్ణ ఈ సినిమా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాయడం ఖాయం అని అన్నారు. ప్రొడక్షన్ డిజైనర్ ఎ.ఎస్. ప్రకాష్ తనను తాను "మేస్త్రీ"గా పేర్కొంటూ ఎంట్రీఇచ్చారు. ఎడిటర్ తమ్మిరాజు అవసరం లేని సీన్స్ మాత్రమే కట్ చేస్తానని సరదాగా చెప్పారు. డి.ఓ.పీ సమీర్ రెడ్డి "జెట్ స్పీడ్"లో షూట్ చేస్తానని అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ సెసిరోలియో మాస్టర్ పాటపాడుతూ ఎంట్రీ ఇచ్చారు. చిరంజీవి స్వయంగా "గోదారి గట్టు" పాట నుండి కొన్నిలైన్స్ ఆలపించడం అందరికీ సర్‌ప్రైజ్ ఇచ్చింది. నిర్మాతలు సాహు గరపాటి, సుష్మిత కొణిదెల ప్రేక్షకులకు బ్లాక్‌బస్టర్ ఫెస్టివల్ అందిస్తామని హామీ ఇచ్చారు. చిరంజీవి తనదైన శైలిలో సుష్మిత ఖికొణిదెలఖి ఇంటిపేరు నిలబెట్టాలి అని సరదాగా చెప్పడం ఆకట్టుకుంది. ఫైనల్‌గా, అనిల్ రవిపూడి తాను గ్యాంగ్ లీడర్‌గా వ్యవహరిస్తానని చెబుతూ, "రఫ్ఫాడిద్దాం..."అంటూ తన శైలిని ఆకట్టుకున్నారు. ఈ ఇన్నోవేటివ్ ప్రమోషనల్ వీడియో మెగా 157పై అంచనాలను పెంచారు.




# 'మ్యాడ్ స్క్వేర్' ప్రేక్షకుల విజయం

లక్కీ భాస్కర్, డాకు మహారాజ్ వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నుంచి వచ్చిన హ్యాట్రిక్ సినిమా మ్యాడ్ స్క్వేర్. బ్లాక్ బస్టర్ చిత్రం మ్యాడ్‌కి సీక్వెల్‌గా రూపొందిన ఈ మ్యాడ్ స్క్వేర్‌లో నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రలు పోషించారు. కళ్యాణ్ శంకర్ దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్‌తో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించారు. ఈ చిత్రానికి సూర్యదేవర నాగవంశీ సమర్పకులు. భీమ్స్ సిసిరోలియో పాటలను స్వరపరచగా, తమన్ నేపథ్య సంగీతం అందించారు. భారీ అంచనాల నడుమ మ్యాడ్ స్క్వేర్ చిత్రం మార్చి 28న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. థియేటర్లలో నవ్వులు పూయిస్తున్న ఈ చిత్రం, భారీ వసూళ్లు సాధిస్తూ అఖండ విజయం దిశగా దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో తాజాగా ప్రెస్‌మీట్ నిర్వహించిన చిత్ర సమర్పకులు సూర్యదేవర నాగవంశీ, ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలపడంతో పాటు పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. సినిమా విడుదలైన నాలుగైదు రోజుల్లోనే మా డిస్ట్రిబ్యూటర్లు అందరూ లాభాల బాట పట్టడం సంతోషంగా ఉంది. డిస్ట్రిబ్యూటర్లను దృష్టిలో ఉంచుకొని, మొదటి వారాంతం కొన్ని చోట్ల టికెట్ ధరలను పెంచడం జరిగింది. మొదటి వారాంతం వచ్చిన వసూళ్లతో అందరూ సంతోషంగా ఉన్నాం. అందుకే ఈరోజు అన్ని చోట్లా సాధారణ టికెట్ ధరలతోనే సినిమాని అందుబాటులోకి తీసుకొస్తున్నాం. టెన్త్ క్లాస్ ఎగ్జామ్స్ కూడా అయిపోతున్నాయి కాబట్టి, కుటుంబ ప్రేక్షకులు మరింత మంది మా సినిమాని చూడాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నాం. సీక్వెల్ హైప్‌తో ఆడటానికి ఇది పెద్ద హీరో సినిమా కాదు, భారీ బడ్జెట్ సినిమా కాదు. అయినా ప్రేక్షకులు ఈ సినిమాకి బ్రహ్మరథం పడుతున్నారు. దానికి కారణం వినోదం. మేము స్వయంగా థియేటర్లకు వెళ్లి చూశాము. ప్రేక్షకులు సినిమా చూస్తూ, ఎంతో ఎంజాయ్ చేస్తున్నారు. సెకండ్ హాఫ్ డల్ అయిందని కొందరు అభిప్రాయపడ్డారు. కానీ, నిజానికి ప్రేక్షకులు సెకండ్ హాఫ్‌నే ఇంకా ఎక్కువ ఎంజాయ్ చేస్తున్నారు. సునీల్ ట్రాక్ అందరికీ బాగా నచ్చింది. మ్యాడ్ స్క్వేర్ విడుదలకు ముందే.. కథ, లాజిక్స్ ని పక్కన పెట్టి ఈ సినిమాని చూడమని మేము కోరాము. అందుకే ఈ స్థాయి వసూళ్లు వస్తున్నాయి. ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం సినిమా ఎలాగైతే మూడు నాలుగు రోజుల్లో బ్రేక్ ఈవెన్ అయిందో.. మ్యాడ్ స్క్వేర్ కూడా నాలుగు రోజు ల్లోనే దాదాపు అన్ని ఏరియాల్లో బ్రేక్ ఈవెన్ అయింది. నాలుగు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.70 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. రివ్యూ అనేది ఒకరి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే. నచ్చితే నచ్చిందని రాస్తారు, లేదంటే నచ్చలేదని రాస్తారు. అందులో తప్పులేదు. అలా నిజాయితీగా ఇచ్చే రివ్యూ లను మేము స్వాగతిస్తాము. కానీ, కొందరు సినిమాని చంపేయాలనే ఉద్దేశంతో.. రివ్యూ రాసి ఊరుకోకుండా, అనవసరమైన వ్యాఖ్యలు చేస్తున్నారు. అది తప్పు. సినిమా బతికితేనే, అందరం బాగుంటాం అనే విషయాన్ని గ్రహించాలి.



# 'ఫణి' మోషన్ పోస్టర్ లాంచ్

టాలెంటెడ్ డైరెక్టర్ డాక్టర్ వీఎన్ ఆదిత్య రూపొందిస్తున్న గ్లోబల్ మూవీ "ఫణి". ఈ థ్రిల్లర్ సినిమాను ఓ. ఎం. జీ ప్రొడక్షన్స్ బ్యానర్ పై, ఏయు అండ్ ఐ స్టూడియో సమర్పణలో డాక్టర్ మీనాక్షి అనిపిండి నిర్మిస్తున్నారు. ఫణి సినిమాలో బ్యూటిఫుల్ హీరోయిన్ కేథరీన్ ట్రెసా లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. మహేశ్ శ్రీరామ్ కీ రోల్ చేస్తున్నారు. హిందీతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, ఇతర ప్రపంచ భాషల్లో ఫణి సినిమాను విడుదల చేయబోతున్నారు. హైదరాబాద్‌లో ఘనంగా జరిగిన ఈవెంట్‌లో దర్శకేంద్రుడు కె రాఘవేంద్రరావు చేతుల మీదుగా "ఫణి" సినిమా మోషన్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో దర్శకేంద్రుడు కె రాఘవేంద్రరావు మాట్లాడుతూ, ఆదిత్య అంటే సూర్యుడు. సూర్యుడు అన్ని దేశాల్లో ఉదయిస్తాడు. అలా



"ఫణి" సినిమాను గ్లోబల్ మూవీగా రూపొందిస్తున్నారు వీఎన్ ఆదిత్య. ఆదిత్య నా దగ్గర పనిచేయలేదు. కానీ నాకు ఇష్టమైనవాడు. అతను కొత్త వాళ్లతో సినిమా చేయగలడు, స్టార్స్ తోనూ రూపొందించగలడు. వారి సోదరి మీనాక్షి నిర్మాణంలో "ఫణి" సినిమా చేస్తున్నాడు. కేథరీన్ అంటే సరైనోడులో ఎమ్మెల్యే గుర్తొస్తుంది. ఈ సినిమాలో ఎలాంటి రోల్‌లో కనిపిస్తుందనే అనేది ఆసక్తి కలిగిస్తోంది. ఈ మూవీ టీమ్ అందిరికీ ఆల్ ది బెస్ట్. "ఫణి" సినిమా మంచి విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నా అన్నారు. మూవీ ప్రెజెంటర్ పద్మనాభరెడ్డి మాట్లాడుతూ, "ఫణి" సినిమా మేకింగ్ టైమ్‌లో మా టీమ్ అందరిలో ఒక మంచి అనుబంధం ఏర్పడింది. మిగతా ఏ సినిమాకూ దొరకని సంతోషం ఈ చిత్రంతో కలిగాయి. మా మీనాక్షి మిగతా టీమ్ అంతా హ్యాపీగా మూవీ చేశాం. "ఫణి" సినిమా మీ అందరికీ నచ్చేలా ఉంటుంది. త్వరలోనే థియేటర్స్ ద్వారా ఘనంగా మీ ముందుకు తీసుకొస్తాం అన్నారు. కో ప్రొడ్యూసర్ శాస్త్రి అనిపిండి మాట్లాడుతూ, ఓ.ఎం.జీ ప్రొడక్షన్స్‌లో కో ప్రొడ్యూసర్‌గా వర్క్ చేయడం హ్యాపీగా ఉంది. ఇందాక పద్మనాభరెడ్డి చెప్పినట్లు డల్లాస్‌లో మా ప్రొడక్షన్‌ను అనౌన్స్ చేశాం. మూవీ ప్రొడక్షన్ ఎక్సిపీరియన్స్ సంతోషంగా ఉంది. మా బ్యానర్‌లో మరిన్ని మూవీస్ ప్రొడ్యూస్ చేయాలనే ఆలోచనలో ఉన్నాం అన్నారు. ప్రొడ్యూసర్, మ్యూజిక్ డైరెక్టర్ డా.మీనాక్షిఅనిపిండి మాట్లాడుతూ, మా "ఫణి" మూవీ మోషన్ పోస్టర్ రాఘవేంద్రరావు చేతుల మీదుగా రిలీజ్ చేసుకోవడం సంతోషంగా ఉంది. మా ఓ.ఎం.జీ ప్రొడక్షన్స్‌లో ఫస్ట్ మూవీగా "ఫణి" సినిమాను నిర్మించాం. మొదట్లో చిన్న చిత్రంగా మొదలుపెట్టినా ఆ తర్వాత గ్లోబల్ మూవీగా తయారైంది. మా అన్నయ్య వీఎన్ ఆదిత్య సినిమాలు థియేటర్స్ లో చూడటమే నాకు తెలుసు. ఇలా వేదిక మీద మాట్లాడటం మొదటిసారి. "ఫణి" సినిమాలో కేథరీన్ నటనకు నేషనల్ అవార్డ్ వస్తుంది. ఆమె చేసిన ప్రతి సన్నివేశం చూస్తున్నప్పుడు మాలో కలిగిన ఫీలింగ్ ఇదే. ఈ చిత్రంలో కేథరీన్‌తో పాటు పాము క్యారెక్టర్ కీలకంగా ఉంటుంది. పామును కూడా మా అన్నయ్య ఆడిషన్ చేసే తీసుకున్నాడు. మహేశ్ శ్రీరామ్ మా ఫ్యామిలీ మెంబర్ లాంటివాడు. మా సంస్థలో మరిన్ని మూవీస్ నిర్మించాలని అనుకుంటున్నాం. మీ అందరి సపోర్ట్ దక్కుతుందని ఆశిస్తున్నాం. అన్నారు. రైటర్ పద్మ మాట్లాడుతూ, "ఫణి" సినిమా కోసం వీఎన్ ఆదిత్య పిలిచినప్పుడు రోమ్ కామ్ స్టోరీ గానీ లవ్ స్టోరీగాని చెబుతారని అనుకున్నా. కానీ ఆయన పాము కథ వినిపించారు. ఈ కథలో ఒక బ్యూటిఫుల్ ఇంటెన్షన్ ఉంది. ఈ భూమి మనదే కాదు ప్రకృతిది కూడా అనే మంచి పాయింట్ ఈ కథలో చెబుతున్నాం. కేథరీన్ అందంగా ఉండటమే కాదు అందంగా నటించింది. మా టీమ్ అందరూ "ఫణి" సినిమా కోసం ప్యాషనేట్ వర్క్ చేశారు అన్నారు. నటుడు కాశీ విశ్వనాథ్ మాట్లాడుతూ, ఎవరైనా వ్యక్తి లేదా సంస్థ కష్టాల్లో ఉన్నప్పుడు పాము సినిమాలు వచ్చి వారికి సక్సెస్ ఇచ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఏవీఎం వారికి నోము, ఎంఎస్ రాజుకి దేవి..ఇలా వీఎన్ ఆదిత్యకి ఈ ఫణి సినిమా మంచి విజయాన్ని అందిస్తుందని ఆశిస్తున్నా. ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తుండటం సంతోషంగా ఉంది అన్నారు. హీరో మహేశ్ శ్రీరామ్ మాట్లాడుతూ, "ఫణి" సినిమాలో అవకాశం కోసం దర్శకుడు వీఎన్ ఆదిత్య సంప్రదించినప్పుడు చాలా హ్యాపీగా అనిపించింది అన్నారు.

## 'హిట్: ది థర్డ్ కేస్' న్యూ పోస్టర్

నేచురల్ స్టార్ నాని హైలీ యాంటిసిపేటెడ్ క్రైమ్ థ్రిల్లర్ హిట్: ది థర్డ్ కేస్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. విజనరీ డైరెక్టర్ శైలేష్ కొలను దర్శకత్వంలో హిట్ సిరీస్‌లో మూడవ భాగంగా రాబోతున్న ఈ చిత్రం ఇప్పటికే గ్లింప్స్, టీజర్, ఫస్ట్ సింగిల్ ప్రేమ వెల్లువకు అద్భుతమైన స్పందనతో భారీ అంచనాలను నెలకొల్పింది. వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌పై ప్రశాంతి తిపిర్నేని, నాని యునానిమస్ ప్రొడక్షన్స్ ప్రొడక్షన్స్‌తో కలిసి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్న హిట్: ది థర్డ్ కేస్ మే 1, 2025న థియేటర్లలో విడుదల కానుంది.



ఈ సందర్భంగా మేకర్స్ 30 డేస్ కౌంట్ డౌన్ పోస్టర్ రిలీజ్ చేశారు. నాని ఇంటెన్స్ లుక్‌లో సిగరెట్ కాలుస్తూ గన్ గురి పెట్టిన ఈ పోస్టర్ అదిరిపోయింది. ప్రస్తుతం పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో నాని ఫెరోషియస్ క్యారెక్టర్ లో కనిపించబోతున్నారు. రీసెంట్‌గా రిలీజైన టీజర్ బోల్డ్ స్టోరీ టెల్లింగ్, నాని ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్‌తో బజ్‌ను క్రియేట్ చేసింది. క్రైమ్ థ్రిల్లర్ జోనర్‌ని ఈ మూవీ రిడిఫైన్ చేసి ఆడియన్స్‌కు నెవర్ బిఫోర్ ఎక్స్ పీరియన్స్ అందించబోతోంది. ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తోంది. టాప్ టెక్నిషియన్స్ ఈ సినిమాకి పని చేస్తున్నారు. సాను జాన్ వర్గీస్ సినిమాటోగ్రఫర్‌గా పని చేస్తున్నారు. మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రానికి కార్తీక శ్రీనివాస్ ఆర్ ఎడిటింగ్, శ్రీ నాగేంద్ర తంగాల ప్రొడక్షన్ డిజైన్ చేశారు. తారాగణం: నాని, శ్రీనిధి శెట్టి, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: డా. శైలేష్ కొలను, నిర్మాత: ప్రశాంతి తిపిర్నేని.


అను ఇమ్మాన్యుయేల్ నయా లుక్

## శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ 60వ మూవీ అనౌన్స్‌మెంట్

ప్రతిష్ఠాత్మక శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ తమ 60వ ప్రొడక్షన్‌ని అనౌన్స్ చేశారు. ఇది వారి విజయవంత చిత్ర నిర్మాణ ప్రయాణంలో మెయిన్ మైల్ స్టోన్‌ని సూచిస్తుంది. ఈ మూవీలో రౌడీ బాయ్స్, లవ్ మీ చిత్రాలలో



అద్భుతమైన నటనతో ఆకట్టుకున్న ఆశిష్ హీరోగా నటిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌తో న్యూ డైరెక్టర్ ఆదిత్యరావు గంగాసాని డెబ్యు చేస్తున్నారు. ఈ మూవీ హైదరాబాద్ ఓల్డ్ సిటీ నేపథ్యంలో సెట్ చేయబడింది, ఆశిష్ లోకల్ గాయ్‌గా కనిపిస్తున్నారు. ఈ నేపథ్యం కథకు రగ్గడ్ అండ్ గ్రిట్టీ ఎట్మాస్ఫియర్‌తో ఇంటెన్స్‌ని యాడ్ చేస్తోంది. ఇప్పటికే తన మునుపటి పాత్రలలో వెర్సటాలిటీని ప్రజెంట్ చేసిన ఆశిష్, ఈ చిత్రం కోసం పూర్తిగా మేకోవర్ కానున్నారు. మరింత ఇంటెన్స్, మాస్ ఓరియెంటెడ్ లుక్‌లో కనిపించబోతున్నారు. డెబ్యు డైరెక్టర్ ఆదిత్యరావు గంగాసాని ఈ సినిమా కోసం హైదరాబాద్ బ్యాక్ డ్రాప్‌లో అద్భుతమైన కథని రెడీ చేశారు. ఎక్సయిట్మెంట్‌ని మరింత పెంచుతూ, నిర్మాతలు న్యూ ట్యాలెంట్ కోసం ముఖ్యంగా హైదరాబాద్ యాసని ఫ్లూయంట్‌గా మాట్లాడే వారి కోసం కాస్టింగ్ కాల్‌ని అనౌన్స్ చేశారు. ఈ నటీనటుల ఎంపిక అన్ని వయసుల నటులకు ఓపెన్‌గా వుంటుంది. ఇది ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌లో భాగం కావడానికి గొప్ప అవకాశం అందిస్తుంది. అద్భుతమైన ట్రాక్ రికార్డ్ గల శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ మరోసారి హై బడ్జెట్, హై ప్రొడక్షన్ వాల్యూస్ గల చిత్రాన్ని అందించడానికి సిద్ధంగా ఉంది. ఈ సినిమాకి సంబంధించిన ఇతర వివరాలను మేకర్స్ త్వరలో అనౌన్స్ చేస్తారు.

## పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ మరో సినిమా!

ప్రముఖ నటి, నిర్మాత నిహారిక కొణిదెల 2024లో విడుదలైన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో తిరుగులేని విజయాన్ని సొంతం చేసుకుని తెలుగు చిత్రపరిశ్రమలో సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్‌గా తన మార్క్‌ను క్రియేట్ చేశారు. ఈ సినిమాలో నటించిన నటీనటుల్లో ఎక్కువ మంది కొత్తవారే కావటం విశేషం. తాజాగా నిహారిక తన నిర్మాణ సంస్థ పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై రెండో చిత్రాన్ని ప్రారంభించనున్నారు. ఈ సినిమాకు మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ చిత్రాల్లో అద్భుతమైన నటనతో ఆకట్టుకున్న ప్రతిభావంతుడైన యువ కథానాయకుడు సంగీత్ శోభన్ ఈ చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. సంగీత్ సోలో హీరోగా నటించనున్న తొలి సినిమా ఇదే. మిగిలిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు రానున్న రోజుల్లో వెల్లడికానున్నాయి. ఇది వరకే నిహారిక రూపొందించిన వెబ్ ప్రాజెక్ట్స్‌లో హీరో సంగీత్ శోభన్, డైరెక్టర్ మానస శర్మ భాగమయ్యారు. జీ5తో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ రూపొందించిన వెబ్ సిరీస్ 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'కి మానస శర్మ రచయితగా.. సోనీ లివ్ రూపొందించిన 'బెంచ్ లైఫ్'కి దర్శకురాలిగా పని చేశారు. తాజాగా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ రూపొందించనున్న ఈ సినిమాతో మానస శర్మ ఫీచర్ ఫిల్మ్ డైరెక్టర్‌గా ఆంగేట్రం చేస్తున్నారు. ఇక సంగీత్ శోభన్ విషయానికి వస్తే 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'లో ప్రధాన పాత్రలో నటించారు. ఈ చిత్రానికి మానస శర్మ కథను అందించగా మహేష్ ఉప్పల కో రైటర్‌గా స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించారు. మన్యం రమేష్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. నిహారిక కొణిదెల నిర్మిస్తోన్న ఈ చిత్రానికి సురేంద్ర కుమార్ నాయుడు ఫణి కందుకూరి (బియాండ్ మీడియా) పిఆర్వోగా, టికెట్ ఫ్యాక్టరీ మార్కెటింగ్ వ్యవహారాలను నిర్వహిస్తున్నారు.



## ఆకట్టుకుంటున్న ఓరి పిల్లడా సాంగ్

తెలుగు సినీ, మ్యూజిక్ లవర్స్ టేస్ట్ మారుతుంది. క్లాస్ మ్యూజిక్, ఇప్పుడు బోర్ కొడుతోంది. పాప్ సాంగ్స్ కన్నా, ఫోక్ సాంగ్స్ మీద మనసుపారేసుకుంటున్నారు జనాలు. పార్టీ సాంగ్స్ కన్నా మసాలా బీట్స్ కే ఎక్కువ ఎట్రాక్ట్ అవుతున్నారు ఆడియన్స్. అందుకే ఈ మధ్య కంపోజర్స్ అందరూ ఫోక్ మీద కాన్సన్ ట్రేట్ చేస్తున్నారు. ఇప్పుడు మన మ్యూజిషియన్స్ మాస్ మసాలా బీట్స్ మీద బాగా కాన్సన్ ట్రేట్ చేస్తున్నారు. ఆడియన్స్‌లో కాస్త జోష్ నింపేందుకు ఫోక్ మీద ఫోకస్ చేస్తున్నారు. స్టార్ హీరోలు కూడా తమ సినిమాల్లో ఫోక్ సాంగ్స్ ఉండేలా చూసుకుంటున్నారు. తాజాగా వెంకీ రొంపెల్లి నాయకుడిగా శిల్పా యాదవ్ నాయికగా ఓరి పిల్లడా అంటూ సాగుతున్న ఒక సాంగ్ రిలీజ్ చేశారు. జేహెచ్‌ఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద నోమిక నిర్మాతగా వ్యవహరించిన ఈ సాంగ్‌ని గాయత్రి ఆలపించారు. అర్మాన్ మెరుగు లిరిక్స్ అందించడంతో పాటు సంగీతం అందించిన ఈ సాంగ్ కి కమ్లీ పటేల్ కెమెరా హ్యాండిల్ చేయగా నమృత్ కొరియోగ్రాఫర్‌గా వ్యవహరించారు. ఈ సాంగ్ ఆద్యంతం శ్రోతలను మాత్రమే కాదు వీక్షకులను కూడా ఆకట్టుకుంటుంది. బోడుప్పల్ పిల్ల యూట్యూబ్ ఛానల్‌లో రిలీజ్ చేయబడిన ఈ సాంగ్ ఇప్పుడు ట్రెండింగ్లోకి వెళుతోంది. ముఖ్యంగా సాంగ్ లో ఉన్నవిజువల్స్ అయితే మంచి గ్రీనరీతో ఇన్స్టంట్ ప్లేసెంట్ ఫీలింగ్ కలిగిస్తున్నాయి. అలాగే లిరిక్స్ కూడా ఆకట్టుకునేలా ఉండడం గమనార్హం. ఇక శిల్పా యాదవ్ వెంకీ ఇద్దరి మధ్య కెమిస్ట్రీ కూడా బాగా వర్కౌట్ అయింది. అది స్క్రీన్ మీద చాలా మంచి ఫీల్ కలిగిస్తోంది.

నిర్మాత: నోమిక
నటీనటులు: శిల్పా యాదవ్, వెంకీ రొంపెల్లి, గాయని: గాయత్రి
సాహిత్యం అండ్ సంగీతం: అర్మాన్ మెరుగు, కెమెరా: కమ్లీ పటేల్, కొరియోగ్రాఫర్: నమృత్,
ఎడిటింగ్ అండ్ డిఐ: శ్రీనివాస్, ప్రొడక్షన్: జేహెచ్‌ఆర్.



# బుల్లెట్ గర్ల్



**దియా జోసెఫ్ మగపిల్లలు బైక్ నడపడం ఇదివరకు. ఇప్పుడు ఆడపిల్లలు బైక్ నడపడం మాత్రమే కాదు. బైక్ రిపేర్ చేయడం మరో విశేషం. అలాంటి ఆశ్చర్యకరమైన విషయం కేరళలోని కొట్టాయంలో చోటు చేసుకుందంటే నమ్మాల్సిందే మరి! దియా జోసెఫ్ ఈ అమ్మాయి బుల్లెట్ బైక్ రిపేర్ చేస్తూ తను ఉన్న చోట మంచి పేరు సంపాదించుకుంది. ఇంజనీరింగ్ చదివి దియా జోసెఫ్ బైక్ పార్ట్స్ విడదీసి తిరిగి బిగించడం ఎలాగో నేర్చుకుని బుల్లెట్ బైక్ రిపేర్‌లో ప్రావీణ్యం సాధించింది. అలాంటి దియా నేపథ్యమేంటో చూద్దామా!**

దియా తండ్రి జోసెఫ్‌కు సొంతంగా బైక్స్ వర్క్‌షాప్ ఉంది. వాళ్ల షాప్‌కు ఎక్కువగా బుల్లెట్ బైక్‌లే రిపేర్‌కు వచ్చేవి. సెలవుల్లో తన తోటి పిల్లలు ఆటపాటలతో ఉంటే దియా మాత్రం తమ వర్క్‌షాప్‌లో తండ్రికి సాయం చేస్తూ ఆయన పనిచేస్తుంటే టూల్స్ అందిస్తూ ఉండేది. అలా ఎయిర్ ఫిల్టర్ క్లీన్, ఆయిల్, కేబుల్ మార్చడం వంటి పనులను నేర్చుకుంది దియా. అలా చేస్తున్నప్పుడే ఆ అమ్మాయి ఆ పనుల మీద ఇష్టం ఏర్పడింది. ఒకవైపు చదువు కొన సాగిస్తూనే బైక్ సర్వీస్‌పై దృష్టిపెట్టింది. బుల్లెట్ బైక్ రిపేర్‌లో అయితే ఎంతో ఉత్సాహంగా చేసేది. ఇంటర్‌కి వచ్చేసరికి దియాకు బైక్ సర్వీస్‌పై పట్టు వచ్చేసింది. స్థానికంగా ఉన్న ఇంజనీరింగ్ కాలేజీలో మెకానికల్ ఇంజనీరింగ్‌లో సీటు సం పాదించింది. కాలేజీ నుండి వచ్చిన తర్వాత ఎక్కువగా వర్క్‌షాప్‌లో ఉండేది. స్నేహితులు ఫేషియల్, స్పాలు అంటూ వెళుతుంటే తను మాత్రం తను మాత్రం చేతుల నిండి గ్రీజు, బైక్స్ రిపేర్‌లలో మునిగిపోయేది. అలా రోజుకు రెండుమూడు బైక్‌లను సర్వీస్ చేసేది. దాంతో రోజు రూ.2 వేలకుపైగా ఆదాయం వచ్చేది. అది చూసి దియాను అందరూ 'బుల్లెట్ గర్ల్' అంటూ పిలిచేవారు. అయితే బండిని నడపడానికి ఆమెకు అప్పటి వరకు లైసెన్స్ రాలేదు. మొత్తానికి 19 యేళ్లకు లైసెన్స్ పొందగలిగింది. దియా వాళ్ల నాన్న ఆమెకు ఒక బుల్లెట్ బైక్‌ను గిఫ్ట్‌గా ఇచ్చాడు. అది నడిపినప్పుడు ఆమె సంతోషానికి అంతేలేదు. దియా వర్క్‌షాప్‌లో పనిచేస్తుండగా ఒకరోజు 'రాయల్ ఎన్‌ఫీల్డ్' సంస్థ నుంచి పిలుపొచ్చింది. తమ ఫ్యాక్టరీలో పనిచేసేందుకు దియాకు ఆ సంస్థ అవకాశం ఇచ్చింది. పట్టలేని ఆనందంతో వెంటనే చేరిపోయింది. అక్కడ పనిచేస్తుండగా డాక్యుమెంటరీ చిత్రీకరించారు.

20 యేళ్లు కూడా లేని దియా 350సిసి బైకుపై ధైర్యంగా లాంగ్‌డ్రైవ్ చేస్తూ వెళుతుంటే అంతా ఆశ్చర్యంగా చూసేవారు. బుల్లెట్ గర్ల్ దియా జోసెఫ్ ఇండియాలో పిన్న వయసు మహిళా బైక్ మెకానిక్‌గా పేరు తెచ్చుకుంది. బైక్ డ్రైవింగ్ చేయాలనుకునే అమ్మాయిలకు స్ఫూర్తిగా నిలిచింది. □

### చెలి చిట్కా

★ పప్పు ధాన్యాలు నిలువవుంచిన పాత్రలకింద తాజా వేప ఆకులు వేస్తే పురుగులు రావు

★. పాలలో పుదినా ఆకులు వేస్తే విరగవు.

## ఉన్నది చాలును..



ఒకసారి బొంబాయి నుండి మే, 1917లో కాకా సాహెబ్ దీక్షిత్, తన భార్య షిరిడీలోని సాయి సన్నిధికి వెళుతున్నారని తెలుసుకున్న సాయి శరణానంద రైల్వేస్టేషన్‌కు వెళ్లి వారి ద్వారా సాయికి పూల మాల, పండ్లు, కొంత దక్షిణ పంపదలచి తన బావతో స్టేషన్‌కు వెళ్లాడు. ఆయన మనసంతా ఆధ్యాత్మిక విషయాలతోనే నిండిపోయింది. తానే స్వయంగా వెళ్లి, సాయిబాబాకు సమర్పిస్తే బాగుండును అనిపించింది. సాయిబాబాకు అర్పించిన వెంటనే తిరిగి రావచ్చనే ఆలోచనతో, వారితో షిరిడీకి బయలు దేరాడు. కాని, ఆయన చాల రోజులు సాయి సన్నిధిలో ఉండిపోయాడు. ఇక బయలుదేరదామనే సంకల్పం సాయి భక్తులు చేసుకోలేరు. నిర్ణయించేది సాయియే. ఆయన అలా షిరిడీలో 21 రోజులు ఉన్నాడు. ఆ సమయంలో అనేక అమూల్య అనుభవాలను సాయి కలిగించారు సాయి శరణానందకు.

అందులో ఒక అనుభవం: ఒకసారి సాయి శరనానంద శనగపప్పు, మసాలా, కొబ్బరి మొదలైన వాటితో చేసిన పచ్చడి తిన్నారు. అది చాలా కారంగా ఉంది. అందువలన ఆయన శరీరంలో వికారం కలిగి, అది వమనం ద్వారా బయటకు వెళ్లిపోయింది. మరునాడు సాయి దర్శనానికి వెళ్ళగా ఏ వస్తువు మన వాటాలో లేదో, దాన్ని తింటే ఇలాగే తెరలు, తెరలుగా బయటకు వస్తుంది అన్నారు సాయి. మనది ఏదో మన వద్దనే ఉంటుంది. మనది కానిది మన నుంచి దూరంగా వెళ్లిపోతుంది. ఇది ఆహారానికే పరిమితం కాదు. అన్నిటికి వర్తించే సూత్రం. ఈ సూత్రం గ్రహిస్తే, ఉన్నది పోతుందే మోనన్న భయము, అనుకున్నది రాదేమో అనే ఆందోళన కలుగవు. దీనినే సాయి శ్యామారావ్ జయకర్‌కు కూడా తెలిపారు అనుభవం ద్వారా. ఒకసారి జయకర్ ఒక మహమ్మదీయ స్త్రీకి నాలుగు వేల రూపాయ లిచ్చాడు అప్పుగా, ఎంతకూ ఆమె ఆ డబ్బును ఇవ్వటం లేదు. బాబాను అడిగారాయన పాపిష్టి సొమ్ము కొరకు కష్టపడనేల అన్నారు సాయి. ఆయనకు సాయి మాటలు అర్థం కాలేదు. సంవత్సరాలు గడిచాయి. ఆమె సంపదంతా పోగొట్టుకుంది. అప్పుడు అర్థమైంది జయకర్‌కు. సొమ్మును పొందినా, నిలవదని. ఉన్నదాంతో సంతృప్తి చాలు అనేది సాయి బోధ. □

# నోటిలో వేలు పెట్టుకోవడం మాన్పించండి..

వ్యధ


ప్రశ్న : **మా అబ్బాయికి నోట్లో వేలు పెట్టుకుని నిద్రపోయే అలవాటు ఉంది. పదేళ్ళ వయసు వచ్చినా ఈ అలవాటు మానుకోలేకపోతున్నాడు. నేను, మా వారు ఎన్ని విధాలా చెప్పినా ప్రయోజనం కన్పించడం లేదు. ఇంకొద్ది చిన్నతనంలో చాలా సార్లు కొట్టి భయపెట్టినా అలవాటు మానలేదు. ఇప్పుడు కొంత వయస్సు వచ్చింది కాబట్టి బుద్ధిచెపితే చాలని భవించాము. అయినా మార్పురాలేదు. అతను పడుకునేటప్పుడు సంకల్పంతో వేలు దూరంగా పెట్టుకుంటాడు. అయితే నిద్ర సమయంలో అసంకల్పితంగా వేలు నోటిలో పెట్టుకుంటాడు. అతనుకూడ ఈ అలవాటు మానేయాలి అనుకున్నప్పటికి మానలేకపోతున్నాడు. నేను, మా వారు ఇద్దరం ఉద్యోగం చేస్తున్నాము. మాకు ఒకటే అబ్బాయి, చిన్నతనంలో ఎక్కువ సమయం ఒంటరిగా గడిపేవాడు. దీనివల్ల కొంత ఒత్తిడిని అనుభవించి ఉంటాడు లేదు భయం ఆందోళనకు గురయి ఉంటాడు. కాబట్టి వేలు నోటిలో పెట్టుకోవడం అలవాటు అయ్యింటుదని కొందరు సన్నిహితులు చెప్పారు. నాలుగైదు ఏళ్ళు వచ్చేటప్పటికి మానేస్తాడు అనేవారు. అయితే పదేళ్ళు వచ్చినా అతనిలో మార్పు రాక పోవడం బాధకలిగిస్తోంది. చదువు ఆటలు మిగిలిన అన్నింటిలో చురుగ్గా ఉంటాడు. ధైర్యంగా పనులు చేస్తుంటాడు . అయితే ఈ అలవాటు ఎందుకు మానలేక పోతున్నాడో అర్థం కావడం లేదు. దీనికి తగిన తరణోపాయం చెప్పండి.**

**- ఒక సోదరి ,విశాఖపట్నం.**

**జవాబు :** అమ్మా బాల్యంలో కొద్ది మంది చేతి వేళ్ళను నోటిలో పెట్టుకుంటుంటారు. కొందరు వేళ్లను చప్పరిస్తుంటారు. వీరిలో ఎక్కువ వంది బొటనవేలు నోటిలో పెట్టుకుంటుంటారు. కొందరు వేలును చీకుతుంటారు. కొందరు ఆరు నెలలు ఏడాది లోపలేమానేస్తుంటారు. కొద్ది మంది రెండు నుంచి నాలుగేళ్ల మద్యలో వారంతకు వారే మానేస్తారు. ఐదేళ్ళ వరకు ఈ అలవాటు ఉన్నా ఫరవాలేదు అని భావించవచ్చు. అయితే దీనివల్ల కొన్ని నష్టాలు కలిగే అవకాశం ఉంది. పళ్ళు వచ్చే వయస్సులో వేలు వల్ల పళ్ళు వంకర టింకరగా తయారు అయే ప్రమాదం ఉంది. కొందరిలో పళ్ళు ఎత్తుగా మారుతుంటాయి. నోటి అందం చెడిపోయే అవకాశాలు ఉన్నాయి. కాగా



**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**



వేలు అపరిశుభ్రంగా ఉన్న సమయంలో నోటిలో పెట్టుకోవడం వల్ల దుమ్ము దూలి, నరకిములు బ్యాక్టీరియా కడుపులోకి వెళ్లే అవకాశం ఉంది. దీని వల్ల బాలనయంలో వాంతులు, విరేచనాలు ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. పిల్లలు బానయలంఓల ఒక దశ వరకు వేలు నోట్లో పెట్టుకోవడం సాధారణ అంశం. దీనికి పలు కారణాలు ఉంటాయి. సకాలంలో పిల్లలకు పాలు పట్టకపోతే ఆకలి నుంచి ఉపశమనం కోసం వేలు చప్పరిస్తుంటారు. కొందరు భయా, ఆందోళన, ఒత్తిడి నుంచి ఓదార్పు పొందడానికి నోట్లో వేలు పెట్టుకుంటుంటారు. అది అలవాటుగా మారుతుంది. ఈ అలవాటు కొట్టి, తిట్టడం వల్ల తగ్గదు. బరుసో కల్పిచడం, చిన్న చిట్కాలు ప్రయోగించడం ద్వారా మాన్పించవచ్చు. వేలు నోట్లో పెట్టుకోవడం వల్ల కలిగే నస్టాలను సునిననతంగా వివరించాలి. వారి మానసిక స్థితిని గమనించి బరోసా కలినపంచి ఆత్మ విశ్వాసం పెంచాలి. పడుకునే ముందు ప్రక్కన ఒక దిండు పెట్టి దానిని పట్టుకునేలా అలవాటు చేయాలి. ఇది ఫలితం ఇవ్వనప్పుడు వేలికి కారక రసం,. కొద్దివగరు పదార్థం, ఆలోవరా రసం రాయాలి. అది నోట్లో పెట్టగానే చేదువల్ల తీసేస్తారు. దీనిని అవర్సన్ థెరపి అంటారు. పెట్టుకోకపోతే ఇష్టమైనవి కొనిస్తామని

# కుండ నీళ్లు శ్రేష్ఠం !

ఎండలు మండుతున్నాయి ! ఈ వేడి నుంచి సేద తీరాలి, డీహైడ్రేషన్ బారిన పడకూడదంటే మట్టికుండలో నీళ్లు తాగడం మంచిది.



- ◆ కుండ నీళ్లలో సహజసిద్ధంగా పొటాసియం,కాల్షియం, మెగ్నీషియం, మొదలైనవి విడుదలై శరీరానికి మేలు చేస్తాయి.
- ◆ వేసవిలో వడదెబ్బ సాధారణ సమస్య. మట్టి కుండలోని ఖనిజాలు వడదెబ్బను నిరోధిస్తాయి.
- ◆. మనం తినే ఆహారం ఆమ్లంగా మారి శరీరంలో విషాన్ని సృష్టిస్తుంటుంది. ఆల్కలిన్ స్వభావం కలిగిన కుండ నీళ్లు దాన్ని నివారిస్తాయి. ఎసిడిటీ, గ్యాస్ట్రిక్ సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తాయి.
- ◆ ప్లాస్టిక్ బాటిళ్లలోని ఫ్రిజ్ నీళ్లు హాని చేస్తాయి. రసాయనాల్లేని కుండనీరే శ్రేష్ఠం. ఈ నీటితో నాలుక తడారిపోవడం, కడుపులో మంట, అజీర్ణం లాంటి సమస్యలు తలెత్తవు.
- ◆ కుండ నీరు శరీరంలో సమతులతకు దోహదం చేస్తుంది. జీవక్రియను పెంచుతుంది. కుండలో నీళ్లు కొద్దికొద్దిగా ఆవిరవడం వల్ల చుట్టూ వాతావరణం కొంత చల్లబడుతుంది. కరెంట్ సాయంతో గాక.. సహజంగా చల్లబడే కుండనీరు దాహం తీర్చి, ఉపశమనం కలిగిస్తుంది. తాజాగా ఉండే ఈ నీటికి ప్రత్యేక రుచి,వాసన తోడవుతాయి కదా. □

# మామిడి పండు ఇడ్లీలు

వేసవిలో మాత్రమే లభించే మామిడి పండ్లకోసం ఏడాదంతా ఎదురుచూస్తుంటాం. అయితే వీటిని నేరుగా, జ్యూస్ చేసుకొని తీసుకోవడం కాకుండా.. ఇడ్లీలు కూడా తయారుచేసుకోవచ్చు?



**కావాల్సినవి :.** మామిడి పండు గుజ్జు – రెండు కప్పులు, నెయ్యి–రెండు టేబుల్ స్పూన్లు , ఇడ్లీ రవ్వ – అర కప్పు, యాలకుల పొడి– అర టీస్పూను, మిరియాల పొడి–పావు టీ స్పూను, పెరుగు – అర కప్పు, పాలు – అర కప్పు, ఉప్పు– రుచికి తగినంత, జీడిపప్పు–గార్నిష్‌కి సరిపడా.

**తయారీ :** ★ బాణలిలో రెండు స్పూన్ల నెయ్యి వేసి జీడిపప్పుని దోరగా వేయించి పక్కన పెట్టుకోవాలి. ఆ నేతిలోనే ఇడ్లీ రవ్వను సన్నని మంట మీద వేయించుకోవాలి. ★ ఒక పెద్ద గిన్నెలో మామిడి పండు గుజ్జు, చక్కెర పొడి, ఉప్పు, పెరుగు, యాలకుల పొడి, మిరియాల పొడి, వేయించిన ఇడ్లీ రవ్వ వేసి కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని రెండుగంటలపాటు నానబెట్టాలి. ★. రెండు గంటల తర్వాత ఈ పిండిలో కొద్ది కొద్దిగా పాలు పోస్తూ ఇడ్లీ పిండిలా కలుపుకోవాలి. ★ ఇడ్లీ పాత్రకు నెయ్యి రాసుకుని పిండి వేయాలి. దోరగా వేయించిన జీడిపప్పు పలుకులను ఇడ్లీ పిండిపైన వేయాలి. ఇరవై నిమిషాల పాటు సాధారణ మంటపై ఉడికించాలి. ఎంతో రుచిగా ఉండే మామిడి పండు ఇడ్లీలు రెడీ! ఐదు నిమిషాల తర్వాత తీసి సర్వ్ చేసుకుంటే సరిపోతుంది .□

---

## ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో
# రెండో రోజు విజిలెన్స్ విచారణ



ఉప్పల్ క్రికెట్ స్టేడియం ముందు ధర్నా చేస్తున్న యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అకారపు అరుణ్ తదితరులు

**ఉప్పల్, ఏప్రిల్ 2 ప్రభాతవార్త :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, సన్‌రైజర్స్ మధ్య జరుగుతున్న ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్ టిక్కెట్ల వ్యవహారంపై విజిలెన్స్ విచారణ రెండో రోజు కొనసాగింది. మరో వైపు స్టేడియంలో ఐపిఎల్ మ్యాచ్ టిక్కెట్లు బ్లాక్‌లో విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ బుధవారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉప్పల్ క్రికెట్ స్టేడియం ముట్టడించారు. దీంతో వారిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, సన్‌రైజర్స్ మధ్య జరుగుతున్న ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్ టిక్కెట్లపై రాద్ధాంతం జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే బుధవారం కూడా విజిలెన్స్ చీఫ్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో పలువురు అధికారులు స్టేడియంలో విచారణ చేపట్టారు. హెచ్‌సిఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, ఇతర ఆఫీస్ బేరర్‌లను విచారించారు. టిక్కెట్ల అమ్మకం, కాంప్లమెంటరీ పాసుల జారీ తదితర అంశాలపై విజిలెన్స్ అధికారులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా టిక్కెట్లు, ఉచిత పాసుల కోసం హెచ్‌సిఏ తమను ఇబ్బంది పెడుతుందని సన్‌రైజర్స్ ఆరోపణల నేపథ్యంలో సిఎం రేవంత్‌రెడ్డి పూర్తి స్థాయిలో విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. కాగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, సన్‌రైజర్స్ వివాదంపై ఉప్పల్ స్టేడియంలో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. సన్‌రైజర్స్, హెచ్‌సిఏ మధ్య జరిగిన ఈమెయిల్స్‌ను అధికారులు తనిఖీ చేస్తున్నారు. ఐపిఎల్‌కు ముందు అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లో తీసుకున్న నిర్ణయాలపై విచారణ చేసినట్లు సమాచారం. గత రెండు సంవత్సరాలుగా హెచ్‌సిఏ చేపడుతున్న స్టేడియం మరమ్మతులపసై కూడా విచారణ చేసినట్లు సమాచారం. హెచ్‌సిఏ,సన్‌రైజర్స్‌కు మధ్య జరిగిన ఒప్పంద పత్రాలను కూడా అధికారులు పరిశీలించినట్లు పేర్కొంటున్నారు.

కాగా విజిలెన్స్ డిజి కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఉప్పల్ స్టేడియంలోనే ఉండి పలువురు ఆఫీస్ బేరర్లు, సన్‌రైజర్స్ ప్రతినిధులతో చర్చించినట్లు సమాచారం.

### స్టేడియం ముట్టడించిన కాంగ్రెస్ నేతలు : హెచ్‌సిఏ అధ్యక్షుడి దిష్టిబొమ్మ దహనం

**ఉప్పల్ స్టేడియం ముట్టడించిన యూత్ కాంగ్రెస్ నేతలు :** ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో ఐపిఎల్ టిక్కెట్ల విక్రయాల్లో భారీ అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అకారపు అరుణ్ పటేల్ ఆధ్వర్యంలో బుధవారం స్టేడియం ముందు ధర్నా నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అకారపు అరుణ్ మాట్లాడుతూ హెచ్‌సిఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బ తీసేందుకు ప్రయత్నిస్తున్నారని, సన్‌రైజర్స్‌ను వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. అక్షర స్కూల్ యజమాన్యం, సిబ్బంది ఐపిఎల్ మ్యాచ్ టిక్కెట్లు బ్లాక్‌లో విక్రయిస్తున్నారని ఆరోపించారు.

హెచ్‌సిఏ అధ్యక్షుడిని వెంటనే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నేతలు వాసు, ప్రశాంత్, అశోక్, కిషోర్, సచిన్, జయంత్, సాయిచరణ్, నవకాంత్, సాహిద్, జాఫర్, రేవంత్, భాను, బాపిరెడ్డి, సంపత్, పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

# వాతావరణ మార్పులతో యాసంగిపై తెగుళ్ల దాడి

## వివిధ పంటలకు చీడపీడలు - దిగుబడిపై తీవ్ర ప్రభావం - ఆందోళనలో అన్నదాతలు

**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** ప్రస్తుత యాసంగి సీజనులో వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా వివిధ పంటలపై రకరకాల తెగుళ్లు పట్టిపీడిస్తున్నాయి. ఒక పక్క మండుతున్న ఎండలు, మరోపక్క అకాల, వడగండ్ల వర్షాలు వంటి వాటి కారణంగా పంట చేలు తెగుళ్ల బారిని పడుతున్నాయి. ఎన్ని మందులు వాటినా ఫలితం కనిపించక భారీగా పంట దెబ్బతింటోందనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది. ప్రధానంగా వరి, మిర్చి, వేరుశెనగ, కంది, శెనగ, మొక్కజొన్న, మినుము, పెసర తదితర పంటలపై పురుగుల దాడి ఉధృతంగా ఉందని రైతాంగం ఆందోళన చెందుతోంది. ఇప్పటికే వేసిన పైర్లను తెగుళ్లు, పురుగులు పాడు చేస్తున్నాయని పలువురు రైతులు వాపోతున్నారు. రాష్ట్రంలో ప్రధాన పంటలైన వరి, మొక్కజొన్నను వివిధ రకాల తెగుళ్లు నష్టపరుస్తున్నాయి. దీంతో వరి పంట మొదటి దశలోనే ఎండిపోతోంది. వివిధ జిల్లాల్లో వాతావరణం సహకరించకపోవడంతో పాటు, మొగిలి పురుగులతో వరి చేలు ఎరుపు రంగులోకి మారుతున్నాయి. కొత్త రోగాలకు ఎన్నిసార్లు మందులు పిచికారీ చేసినా ఏమీ లాభం లేదంటూ వాపోతున్నారు. ఒక ఎకరానికి ఒకసారి మందు పిచికారీ చేస్తే 3 వేల రూపాయలు ఖర్చవుతోందని, అయితే ఇవేమీ ప్రయోజనం లేకుండా పోతున్నాయని అంటున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, నల్లగొండ, కరీంగనర్, వకంగల: తదితక జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో వరి పంటను గత కొద్ది రోజులుగా మొగిలిపురుగు వెంటాడుతోంది. మొలక దశ నుండి వరి పంటను నాశనం చేస్తోందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుత వాతావరణం మొగిలిపురుగుకు ఎంతో అనుకూలంగా ఉంటుందని, వరి పంటకు ఈ పురుగు సోకి మొత్తం నాశనం చేస్తోందని వాపోతున్నారు. ఫలితంగా ఎకరానికి 15 నుండి 20 క్వింటాళ్ల వరకూ దిగుబడి వచ్చే ధాన్యం, తెగుళ్ల కారణంగా 8 క్వింటాళ్లు కూడా వచ్చే అవకాశం కనిపించడం లేదన్నారు. అలాగే మొక్కజొన్న పంటకు చివరి దశలో కత్తెర పురుగు శాపంగా మారింది. ఎకరానికి 35 నుండి 40 క్వింటాళ్ల వరకూ దిగుబడి వస్తుందన్నారు.

# ఇక కౌలు రైతులకూ రుణాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త :** వచ్చే నెల నెండి ప్రారంభమవుతోన్న 2025–26 ఆర్థిక సంవత్సరంలో కౌలు రైతులకు రుణాలు మంజూరు కానున్నాయి. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో అధిక జీఎస్‌డీపీ ఉన్న జిల్లాలకు ప్రాధాన్య రంగాల రుణాల (పీఎస్ఎల్) పంపిణీలో అధిక ప్రాధాన్యమివ్వాలని రిజర్వు బ్యాంకు పేర్కొంది. ఈ రుణాలు మంజూరుకు సంబంధించి వివిధ రాష్ట్రాలకు చెందిన 196 జిల్లాలు ఈ జాబితాలో చోటు దక్కించుకోగా, అందులో తమిళనాడులో నుంచి అత్యధికంగా 34, హరియాణాలో 17, ఆంధ్రప్రదేశ్‌లో 15 జిల్లాలు, పంజాబ్‌లలో 15 చొప్పున, తెలంగాణలో 7 జిల్లాలు ఉన్నాయి. రాష్ట్రంలోని ఈ ఏడు జిల్లాల్లో జనగామ, హన్మకొండ, సూర్యాపేట, మేడ్చల్, రంగారెడ్డి, సంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు ప్రాధాన్యమివ్వాలని తెలిపింది. పీఎస్ఎల్ అతి తక్కువగా ఉన్న 196 జిల్లాలను ప్రకటించగా వీటిలో తెలంగాణ నుంచి ఆదిలాబాద్, ఏపీలోని అల్లూరి సీతారామరాజు ఉన్నాయి. కాగా ఏప్రిల్ 1 నుంచి పీఎస్ఎల్ మంజూరుకు అనుసరించాల్సిన నిబంధనలపై అన్ని బ్యాంకులకు రిజర్వు బ్యాంకు తాజాగా మార్గదర్శకాలు జారీ చేసింది. పీఎస్ఎల్ కింద ఎవరెవరికి రుణాలివ్వాలనే అంశాలను సూచించింది. 13 రకాలకు చెందిన వారిని బలహీనవర్గాలుగా గుర్తించి వారికి పీఎస్ఎల్ లోన్స్ ఇవ్వాలని స్పష్టం చేసింది. వడ్డీ వ్యాపారుల వద్ద ఎవరైనా ఒక వ్యక్తి అధిక వడ్డీకి అప్పు తీసుకుంటే అతడిని ఆదుకునేందుకు రూ.లక్ష రుణం కల్పించాలని నిర్దేశించింది. వీరిలో సన్న, చిన్నకారు రైతులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, వృత్తి కార్మికులు, ఎస్సీలు, ఎస్టీలు, స్వయం సహాయక సంఘాలు, వడ్డీ వ్యాపారులిచ్చిన అప్పుల వలలో చిక్కుకున్నవారు, ట్రాన్స్‌జెండర్లు, మైనారిటీలు తదితరులు ఉన్నారు. ఎలాంటి భూమి లేని వ్యక్తి అయినా వ్యవసాయ అనుబంధ రంగాల్లో పనులు చేస్తుంటే అటువంటి వారికి రూ.2.50 లక్షల రుణ సదుపాయం కల్పించాలని మార్గదర్శకాల్లో వెల్లడించింది. అలాగే సన్న, చిన్నకారు రైతులకు పంట రుణాలను పీఎస్ఎల్ కింద ఇవ్వాల్సి ఉంటుంది. వ్యవసాయ కార్మికులకు, రాతపూర్వక ఒప్పందం లేకుండా నోటిమాటగా భూమి యజమాని నుంచి పొలం కౌలుకు తీసుకుని సాగుచేసే రైతులకూ, పంటను పంచుకునే ఒప్పందంతో సాగు చేసే రైతులకు కూడా సన్న, చిన్నకారు రైతులకు ఇచ్చినట్లే క్రాప్ లోన్ ఇవ్వాలి. ఇక వ్యవసాయం, అనుబంధ రంగాల్లో స్టార్టప్(అంకుర) కంపెనీ పెడితే రూ.50 కోట్లు, వ్యవసాయ శుద్ధి పరిశ్రమకు రూ.100 కోట్ల వరకు రుణం ఇవ్వాలని రిజర్వ్ బ్యాంక్ పేర్కొంది. వ్యవసాయ బోర్లకు, పొలంలో సోలార్ విద్యుత్ పెట్టుకుంటే పీఎస్ఎల్‌లో రుణం ఇవ్వాలి. సొంత ఉద్యోగులకు ఇచ్చే లోన్స్‌ను బ్యాంకులు పీఎస్ఎల్ కింద చూపకూడదు. కాగా గ్రామీణ ప్రాంతాల్లో కుటీర పరిశ్రమలకు రూ.2 లక్షలలోపు రుణం ఇవ్వాలని మార్గదర్శకాల్లో పేర్కొంది. అలాగే ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన బ్యాంకు ఖాతా ఉన్నవారికి ఓవర్‌డ్రాఫ్ట్ పేరుతో లోన్ సదుపాయం కల్పించాల్సి ఉంటుంది. పాఠశాలల ఏర్పాటు, పారిశుద్ధ్య నిర్మాణాలు, తాగునీటి పథకాలకు గరిష్ఠంగా రూ.8 కోట్ల వరకు రుణం ఇవ్వాలి. వీధి దీపాల ఏర్పాటు, మారుమూల ప్రాంతాలైన గ్రామాలలో సోలార్ విద్యుత్ ప్లాంటు పెట్టేవారికి రూ.35 కోట్ల వరకు, ఒక వ్యక్తి తన ఇంటిపై సోలార్ విద్యుత్ పెట్టుకుంటే రూ.10 లక్షలు, ఇంటి మరమ్మతులకు గరిష్ఠంగా రూ.15 లక్షల వరకు లోన్ ఇవ్వాలని సూచించింది. అలాగే ఎడ్యుకేషన్ రుణం నిమిత్తం రూ.25 లక్షల వరకు ఇవ్వాలని బ్యాంకులకు విడుదల చేసిన మార్గదర్శకాల్లో రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది.

> 13 వర్గాలకు చెందిన వారికి మంజూరు
> 2025-26 ఆర్థికం నుండి అమలు
> తెలంగాణలో 7 జిల్లాలకు అత్యధిక ప్రాధాన్యత
> బ్యాంకులకు ఆర్‌బిఐ తాజా మార్గదర్శకాలు

## మున్నూరుకాపులను విస్మరిస్తే కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు



సమావేశంలో అభివాదంచేస్తున్న కొండా దేవయ్య, పుటం పురుషోత్తం, లక్ష్మణ్, చందు తదితరులు

**మేలో 10లక్షల మందితో 'మున్నూరుకాపుల గర్జన'**

**- రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య పటేల్**

**హైదరాబాద్, ఏప్రిల్ 2,ప్రభాతవార్త:** మున్నూరు కాపులను విస్మరిస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని తెలంగాణ మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొండా దేవయ్య పటేల్ అన్నారు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందే మున్నూరు కాపుల జనాభా 40లక్షల వరకు ఉందని, గడిచిన పది సంవత్సరాల్లో మరో పది లక్షల పైగా పెరిగిందన్నారు. రాష్ట్రంలో ఉన్న 4.20 కోట్ల జనాభాలో కాపు, మున్నూరుకాపుల జనాభా 60 లక్షల వరకు ఉందన్నారు. రాష్ట్రంలో మున్నూరు కాపుల సంఖ్య అత్యధికంగా ఉందని సాక్షాత్తు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ అసెంబ్లీ సాక్షిగా పేర్కొన్నారని, కార్పొరేషన్, హాస్టళ్లు, నిధుల గురించి ప్రస్తావించారని గుర్తు చేశారు. కానీ అవి వట్టి నీటి మూటలే నని గడిచిన సంవత్సర కాలంలో అర్థమైందాన్నారు. ఇప్పటికే ఎన్నికల ముందు అడ్డగోలు హామీలు ఇచ్చి మున్నూరుకాపుల ఓట్లు కొల్లగొట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత తమ సామాజికవర్గాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మున్నూరు కాపులకు సముచిత స్థానం కల్పించారని, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రి పదవులు కేటాయించారని, మున్నూరుకాపు మహిళలకు సైతం ప్రాధాన్యతన కల్పించడంతో పాటు కోట్లాది రూపాయల బడ్జెట్ సైతం కేటాయించిందన్నారు. కాని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మున్నూరుకాపుల సంక్షేమానికి రూపాయి కూడా ఇవ్వలేదని, రెండు బడ్జెట్లో కేటాయించింది గుండు సున్నా అని విమర్శించారు. జనాభా దామాషా ప్రకారం కనీసం మూడు మంత్రి పదవులు ఇవ్వాలని, కాని కనీసం కార్పొరేషన్ ఛైర్మన్ కు కూడా నోచుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం తమ సామాజికవర్గంపై కక్షగట్టిందని ఆరోపించారు. ఈ నెల 13న జలవిహార్లో మున్నూరుకాపుగర్జన సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నామని, ఈ సమావేశానికి అన్ని పార్టీలకు చెందిన వార్డు సభ్యుడి మొదలు ఎంపి వరకు హాజరవుతున్నారని తెలిపారు.

# ఐపిఎల్‌తో హీరోలు

## దేశవాళీ టోర్నీల నీడన రాణింపు




**న్యూఢిల్లీ:** దేశవాళీ టోర్నీల నీడన మట్టిలో మాణిక్యాలు వెలుగులోకి వస్తున్నాయి. రంజీ, దులీప్ ట్రోఫీ, ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) వంటి వాటిలో రాణిస్తుండటంతో పలువురు ప్లేయర్లు హీరోలు అయిపోతున్నారు. దీంతో అంతర్జాతీయ వేదికలకు నిలయమైన టీమిండియాలో మెరికల్లాంటి ప్లేయర్లకు ఇట్లే స్థానం దక్కుతోంది. ప్రస్తుతం టీమిండియాలో స్థానం దక్కాలంటే రంజీ, దులీప్ ట్రోఫీ వంటి దేశవాళీ టోర్నీల్లో రాణించక తప్పదు. కానీ ఐపిఎల్‌తో ఇప్పుడు యువ క్రికెటర్లకు జట్టులో వైల్డ్ కార్డ్ ఎంట్రీ లభిస్తోంది. అంతేకాకుండా వీరిలో చాలా మంది టీమిండియాకు ఎంపికవుతున్నారు. ప్రధానంగా బ్యాటర్లు దేశవాళీ అనుభవంతో మైదానంలో అంతర్జాతీయ స్థాయి బౌలింగ్ వేసే వారిని సైతం అలవోకగా ఎదుర్కొంటున్నారు. అలా టీమిండియాలోకి అడుగుపెట్టి తమ స్థానాలు సుస్థిరం చేసుకుని హీరోలు అయిన వారిని గుర్చి తెలుసుకుంటే హైదరాబాద్‌కు చెందిన ఆటో డ్రైవర్ కొడుకు సిరాజ్ స్వయం కృషితో బౌలింగ్ మెరుగుపర్చుకున్నాడు. 2015లో తొలి సారి రంజీ ట్రోఫీ ఆడాడు. ఆ సీజనులో 41 వికెట్లు సాధించాడు. దీంతోసన్‌రైజర్స్ హైదారాబాద్ రూ.20 లక్షలకు కొనుగోలు చేసింది. అలా రాణిస్తూ ఆ తర్వాతి సీజన్‌లో అతడు రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరుకు రూ.2.6 కోట్ల అమ్ముడయ్యాడు. అంతేకాకుండా టీమిండియా పేస్ దళంలో సిరాజ్ కీలకంగా మారాడు. అలాగే ఓ ప్రైవేటు కంపెనీలో సెక్యూరిటీ గార్డ్ కొడుకు రవీంద్ర జడేజా చాలా చిన్న స్థాయి నుండి ఎదిగాడు. క్రికెట్ కెరీర్ తొలి నాళ్లలో రోజుకు రూ.10తో అవసరాలు తీర్చుకునేవాడు. 2008 అండర్ 19వరల్డ్‌కప్‌లో అద్భుతంగా రాణించడంతో, అతడు ఐపిఎల్‌ఫ్రాంచైజీల కళ్లలో పడ్డాడు. రాజస్థాన్ రాయల్స్ అదే ఏడాది అతడిని కొనుగోలు చేసింది. ఇక కెరీర్‌లో జడ్డూ వెనుదిరిగి చూడాల్సిన అవసరం రాలేదు. 2023లో చెన్నై ఫ్రాంచైజీ అతడిని రూ.16 కోట్లకు సొంతం చేసుకుంది. ఇక మరో స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కూడా పేద కుటంబం నుండి వచ్చిన ప్లేయరే. అప్పట్లో అతడి తండ్రితో పాటు, హార్దిక్, చిన్నాచితకా పనులు చేసే వాడు. కొన్నాళ్లు మ్యాగీ నూడుల్స్ మాత్రమే తిని కడుపు నింపుకొన్న రోజులు ఉన్నాయి. దేశవాళీలో రాణించడంతో 2015లో ముంబయి ఇండియన్స్ అతడిని రూ.10 లక్షలకు కొనుగోలుచేసింది. అంచెలంచెలుగా రాణించడంతో 2022లో గుజరాత్ టైటాన్స్ రూ.15 కోట్లకు దక్కించుకుంది. కాగా రింకూ సింగ్ ప్రతిభ ఐపిఎల్‌తోనే వెలుగులోకి వచ్చింది. 2014లో దేశవాళీ క్రికెట్ నిమత్తం అతడిని 2017కు పంజాబ్ ఫ్రాంచైజీ కొనుగోలు చేసింది. తర్వాత కోల్‌కతా తరఫున 2023లో గుజరాత్‌పై జరిగిన మ్యాచ్‌లో చివరిఓవర్లో ఏకంగా సిక్స్‌లు కొట్టి జట్టుకు విజయాన్ని అందించడంతో హాట్ ప్లేయర్‌గా మారాడు. అలాగే పేదరికంతో మైదానంలోని టెంట్‌లో ఉంటూ క్రికెట్ నేర్చుకునే యశస్వీ జైస్వాల్ పొట్టకూటి కోసం పానీ పూరీలు కూడా విక్రయించాడు. దేశవాళీ క్రికెట్‌లో మెరుపు మెరిపించడంతో 2020లో రాజస్థాన్ అతని తీసుకుంది. తదుపరి రాణించడంతో భారత్ తరఫున టి20, టెస్ట్‌ల నిమిత్తం స్థానం సంపాదించాడు.




## వన్డేలోనూ పాకిస్థాన్ వైఫల్యం

### న్యూజిలాండ్‌పై 84 రన్స్ తేడాతో ఓటమి

**న్యూఢిల్లీ:** వరుస ఓటములతో చతికిల పడ్డ పాకిస్థాన్ జట్టు న్యూజిలాండ్‌తో రెండో వన్డేలోనూ మట్టి కరచింది. ఫలితంగా మరో మ్యాచ్ మిగిలి ఉండగానే ఆతిథ్య జట్టుకు సిరీస్‌ను సమర్పించుకుంది. తాజాగా న్యూజిలాండ్‌లో జరిగిన రెండో వన్డేలో 84 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. తాజాగా ఇరు జట్ల మధ్య రెండో వన్డే జరిగింది. హామిల్టన్ వేదికగా టాస్ గెలిచిన పాక్ తొలుత బౌలింగ్ ఎంచుకోగా, న్యూజిలాండ్ బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్లలో రైస్ మరియూ 18 పరుగులకు పరిమితం కాగా, నిక్ కెల్లీ 31 పరుగులు చేశాడు. మిగిలిన వాళ్లలో హెన్రీ నికోల్స్ (22), మహ్మద్ అబ్బాస్ (41) ఫర్వాలేదనిపించగా, మిచెల్ హే దంచికొట్టాడు. ఈ వికెట్ కీపర్ బ్యాటర్ 78 బంతులు ఎదుర్కొని 7 ఫోర్లు, 7 సిక్సర్ల సాయంతో 99 పరుగులతో అజేయంగా దుమ్ముదులిపాడు. మిచెల్ ధనాధన్ ఇన్నింగ్స్ కారణంగా న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు నష్టానికి 292 పరుగులు చేసింది. పాక్ బౌలర్లలో వసీం, సూఫియాన్ రెండేసి వికెట్లు తీయగా, ఫాహీమ్ అష్రఫ్, అకిఫ్ జావేద్, రవూఫ్ ఒక్కో తలా ఒక వికెట్ దక్కించుకున్నారు. ఇక లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ అరంభం నుండే తడబడింది. కివీస్ పేసర్ల ధాటికి పాక్ టాపార్డర్ పేకమేడలా కుప్పకూలింది. ఓపెనర్లు అబ్దుల్లా షఫిక్, ఇమామ్ ఉల్ హక్, బాబర్ అజంలు ఒకే ఒక పరుగుకు, కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్ (5) సింగిల్ డిజిట్ స్కోర్‌కే పెవిలియన్ చేరారు. సల్మాన్ ఆఘా 9 పరుగులకే నిష్క్రమించగా, తయ్యబ్ తహిర్ 13 పరుగులు చేశాడు. అయితే ఆల్‌రౌండర్ ఫాహిమ్ అష్రఫ్ బ్యాట్‌తో చెలరేగి 80 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌ల సాయంతో 73 పరుగులు సాధించాడు. అతడికి తోడుగా పేసర్ నసీం షా రాణించాడు. కేవలం 44 బంతుల్లో 51 పరుగులతో అరలరించాడు. వీరిద్దరి అర్ధ శతకాల కారణంగా పాక్ అవమానకర స్కోరు నుండి తప్పించుకుంది. మొత్తంగా 41.2 ఓవర్లలో 208 పరుగులకు ఆలౌట్ అయి 84 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. కాగా పాక్ టీమ్ 5 టీ20, 3 వన్డేలు ఆడేందుకు న్యూజిలాండ్‌లో పర్యటిస్తోంది. ఈ క్రమంలో కొత్త కెప్టెన్ సల్మాన్ ఆఘా నేతృత్వంలోని పాకిస్థాన్ జట్టు టీ20 సిరీస్‌ను 4-1తో ఘోర పరాభవాన్ని చవిచూసింది. అనంతరం పాక్ క్రికెట్ బోర్డు కెప్టెన్‌గా రిజ్వాన్‌కు బాధ్యత అప్పగించినా తొలి వన్డేలోనూ 73 పరుగుల తేడాతో చిత్తయింది. ఇప్పుడు రెండో వన్డేలోనూ ఓటమి కొనసాగింది.

## వరల్డ్ టాప్ 100లో హైదరాబాదీ స్నేహిత్



**ఢిల్లీ:** తెలంగాణ టేబుల్ టెన్నిస్ ప్లేయర్ సురావజ్జుల స్నేహిత్ వరల్డ్ టాప్-100 ర్యాంక్‌లోకి దూసుకొచ్చాడు. తెలుగు రాష్ట్రాల నుంచి ఈ ఘనత సాధించిన తొలి ప్యాడ్లర్ చరిత్ర సృష్టించాడు. చెన్నైలో జరిగిన డబ్ల్యూటిటి స్టార్ కంటెండర్‌లో రాణించిన యువ టేబుల్ టెన్నిస్ స్టార్ స్నేహిత్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్‌లోకి ఎగబాకాడు. ఈ టోర్నమెంట్లో స్నేహిత్ వరల్డ్ నంబర్ 29 యుకియా ఉడా (జపాన్)ను, ఆ తర్వాత ఇండియా లెజెండరీ ప్యాడ్లర్ శరత్ కమల్ ను ఓడించి ఔరా అనిపించాడు. ఈ టోర్నీ సింగిల్స్ విభాగంలో క్వార్టర్స్‌కు, డబుల్స్‌లో దిగ్గజ ఆటగాడు శరత్ కమల్‌తో కలిసి సెమీస్ చేరిన స్నేహిత్ 34 స్థానాలు మెరుగుపరుచుకుని 89వ ర్యాంకుకు చేరాడు. సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ఓడినప్పటికీ శరత్ కమల్ తో కలిసి మెన్స్ డబుల్స్ సెమీఫైనల్స్కు చేరి ఆకట్టుకున్నాడు.

## ఐసిసి ర్యాంకులు.. బ్యాటింగ్‌లో అభిషేక్ రెండో స్థానం

### వన్డే బెస్ట్ బ్యాటర్‌గా గిల్







**న్యూఢిల్లీ:**నఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) ర్యాంకుల్లో కొందరు టాప్‌లోనే కొనసాగుతుండగా, పలువురు మాత్రం కిందికి పడిపోయారు. టి20ల్లో కివీస్‌కు చెందిన బౌలర్ జాకబ్ డఫీ 723 పాయింట్లతో అగ్రస్థానంలోకి దూసుకొచ్చాడు. ఇలా ఏ ఫార్మాట్‌లో అయినా టాప్ ర్యాంక్‌ను అందుకున్న కివీస్ పేస్ బౌలర్‌గా నిలిచాడు. నాలుగు స్థానాలను ఎగబాకి అగ్రస్థానంలోకి చేరాడు. ఇక భారత్ స్టార్ ఆటగాడు హార్థిక్ పాండ్యా 252 పాయింట్లతో టాప్ ఆల్‌రౌండర్‌గా కొనసాగుతున్నాడు. ఈ జాబితాలో టాప్ 10లో మరే ఇతర టీమిండియా ప్లేయర్ లేకపోవడం విశేషం. 12వ స్థానంలో అక్షర్ పటేల్ 161 పాయింట్లతో నిలిచాడు. బ్యాటింగ్ విభాగంలో మాత్రం టాప్ 10లోనే భారత్ నుండి ముగ్గురు బ్యాటర్లకు అవకాశం దక్కింది. 2వ స్థానంలో 829 పాయింట్లతో అభిషేక్ శర్మ, 804 పాయింట్లతో తిలక్ వర్మ 4వ స్థానంలో సూర్యకుమార్ యాదవ్ 739 పాయింట్లతో 5వ ర్యాంక్‌లో కొనసాగుతున్నారు. ఆసిస్ డేంజరస్ బ్యాటర్ ట్రావిస్ హెడ్ 856 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. కాగా వన్డేల్లో భారత్ క్రికెటర్ శుభ్‌మన్ గిల్ 784 పాయింట్లతో అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. పాక్ ప్లేయర్ బాబర్ ఆజామ్ 777 పాయింట్లతో తర్వాత ప్లేస్‌లో ఉన్నాడు. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ 756 పాయింట్లతో 3వ స్థానంలోను, 736 పాయింట్లతో విరాట్ కోహ్లీ 5వ స్థానంలో, 704 పాయింట్లతో శ్రేయస్ అయ్యర్ 8వ స్థానంలో నిలిచాడు. వన్డే బౌలర్లలో టాప్ 10లో కుల్‌దీప్ యాదవ్ ఒక్క స్థానం మెరుగుపరచుకుని 650 పాయింట్లతో 3వ ర్యాంక్‌కు, రవీంద్ర జడేజా 616 పాయింట్లతో ఒక ర్యాంకు పైకి చేరి 9వ స్థానంలో కొనసాగుతున్నాడు.

## భారత్ మహిళా హాకీ లెజెండ్ వందన గుడ్ బై




**న్యూఢిల్లీ:** భారత మహిళల హాకీ జట్టు లెజెండ్ 32 ఏళ్ల వందన కటారియా తన 15 ఏండ్ల సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలికింది. దేశం తరఫున 320 మ్యాచ్‌లలో 158 గోల్స్ చేసిన వందన, భారత మహిళా హాకీ జట్టుకు అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్‌గా గుర్తింపు దక్కించుకుంది. 2009లో సీనియర్ జట్టులోకి వచ్చిన వందన 15 ఏండ్ల అంతర్జాతీయ కెరీర్‌లో భారత్ సాధించిన చరిత్రాత్మక విజయాల్లో కీలకపాత్ర పోషించింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచిన భారత జట్టులో ఆమె సభ్యురాలు. ఆ మెగా టోర్నీలో వందన హ్యాట్రిక్ గోల్స్ చేసి భారత్ తరఫున ఒలింపిక్స్‌లో ఈ ఘనత సాధించిన తొలి మహిళా ప్లేయర్‌గా రికార్డుల కెక్కింది. అలాగే 2016 రియో ఒలింపిక్స్‌లో పోటీ పడ్డ భారత్ జట్టులో సైతం దందన మెంబర్‌గా ఉంది. ఆటకు వందన చేసిన సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం ఆమెకు 2021లో అర్జున, 2022లో పద్మశ్రీ అవార్డులతో సత్కరించింది.

# వాణిజ్యం

## ఫోర్బ్స్ జాబితాలో మళ్లీ నంబర్ వన్ మస్క్



**వాషింగ్టన్, ఏప్రిల్ 2:** ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మస్క్ మరోసారి సంపన్నుల జాబితాలో తొలి స్థానంలో నిలిచారు. ఫోర్బ్స్ సంస్థ విడుదల చేసిన సంపన్నుల జాబితా 2025లో ముందువరుసలో ఉన్నారు. 342 బిలియన్ డాలర్ల నికర విలువతో ఆయన అగ్రస్థానం దక్కించుకున్నారు. గతేడాదితో పోలిస్తే మస్క్ సంపద 147 బిలియన్ డాలర్లు పెరిగింది. ప్రపంచ కుబేరుడు మస్క్‌కు టెస్లా, స్పేస్‌ఎక్స్, ఎక్స్ వంటి ప్రపంచ ప్రసిద్ధ కంపెనీలు ఉన్నాయి. ప్రస్తుతం యూఎస్ 902 మంది సంపన్నులతో బిలియనీర్ హబ్‌గా కొనసాగుతోంది. చైనాలో 516 మంది బిలియనీర్లు ఉండగా, భారత్‌లో 205మంది ఉన్నారు. ప్రముఖ భారత వ్యాపారవేత్త ముకేశ్ అంబానీ 92.5 బిలియన్ డాలర్ల సంపదతో ఈ జాబితాలో 18వ స్థానంలో నిలిచారు. ఆసియాలో అత్యంత సంపన్న భారతీయుడిగా కొనసాగుతున్నారు. మరో భారత పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ 56.3 బిలియన్ డాలర్ల సంపదతో 28వ స్థానంలో ఉన్నారు. ఆసియాలో అత్యంత ధనవంతుడైన నాలుగో వ్యక్తి, దేశంలో అత్యంత ధనవంతుడైన రెండో వ్యక్తిగా నిలిచారు. చైనాకు చెందిన జాంగ్ యిమింగ్ 65.5 బిలియన్ డాలర్లతో ఈ జాబితాలోని బిలియనీర్లలో 23వ స్థానం దక్కించుకోగా అదే దేశానికి చెందిన జాంగ్ షాన్షాన్ 57.7 బిలియన్ డాలర్లతో 26వ స్థానంలో ఉన్నారు. ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితా ప్రకారం.. ఈసారి 288 మంది కొత్త వ్యక్తులు ఇందులో చేరారు. వీరిలో రాక్ స్టార్ బ్రూస్ స్ప్రింగ్స్టీన్ (1.2 బిలియన్ డాలర్లు), హాలీవుడ్ సినీ నటుడు ఆర్నాల్డ్ స్వార్జెనెగర్ (1.1 బిలియన్ డాలర్లు) హాస్యనటుడు జెర్రీ సీన్ఫెల్డ్ (1.1 బిలియన్ డాలర్లు) ఉన్నారు. హెడ్జ్ ఫండ్ లెజెండ్ జిమ్ సైమన్స్ భార్య మార్లిన్ సైమన్స్ (31 బిలియన్ డాలర్లు) వీరిలో అందరికంటే సంపన్నమైన వ్యక్తిగా నిలిచారు. గతేడాది మే నెలలో ఆయన మరణించారు.

## లక్షకుపైగా 'ఇవి' ఆటోలు అమ్మిన మహీంద్రా

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:** మహీంద్రా లాస్ట్ మైల్ మొబిలిటీ లిమిటెడ్ (ఎంఎల్‌ఎంఎంఎల్) ఎలక్ట్రిక్ వాణిజ్య వాహనాల (ఇవి) తయారీ దారుగాతన ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకుంది ఎల్5 కేటగిరీలో కంపెనీ కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలిపింది. ఇప్పటి వరకు రెండు లక్షల కమర్షియల్ ఎలక్ట్రిక్ వాహనాలను విక్రయించినట్లు చెప్పింది. ఈ విభాగంలో ఎలక్ట్రిక్ వాహనాల వ్యాప్తిని 2024 ఆర్థిక సంవత్సరంలో 16.9శాతం నుంచి 24.2 శాతానికి పెంచినట్లు పేర్కొంది. సుస్థిర మొబిలిటీ, సృజనాత్మక ఉత్పత్తుల తయారీకి కంపెనీ కట్టుబడి ఉందని చెప్పింది. దేశ వ్యాప్తంగా లక్షకుపైగా ట్రియో మోడల్ ఎలక్ట్రిక్ ఆటోలను విక్రయించి ఈ విభాగంలో మొదటి స్థానంలో నిలిచామని స్పష్టం చేసింది. త్రివీలర్ కమర్షియల్ వాహనాలకు సంబంధించి ఎల్5 కేటగిరీలో ఎంఎల్‌ఎంఎంఎల్ ముందంజలో ఉందని కంపెనీ పేర్కొంది. మహీంద్రాట్రియో, జోర్ గ్రాండ్ వంటి ఉత్పత్తులు ఈ వృద్ధికి కీలకంగా నిలిచాయని తెలిపింది. ట్రియో 1,00,000 యూనిట్లకు పైగా విక్రయించడంతో ఈ వాహనాలకు వినియోగదారుల్లో



విశ్వసనీయత నెలకొందని చెప్పింది. ఎల్5 ఎలక్ట్రిక్ వెహికల్ కేటగిరీలో 37.3శాతం మార్కెట్ వాటాతో ఎంఎల్‌ఎంఎంఎల్ ఆధిపత్యం వహిస్తున్నట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. దీన్ని కొనసాగించడానికి, వివిధ వ్యాపార అవసరాలను తీర్చడానికి రూపొందించిన ఎలక్ట్రిక్ వాహనాలైన మెటల్ బాడీ ట్రియో, మహీంద్రా జిఇఒ మోడళ్ల విక్రయాలు తోడ్పడుతున్నాయని పేర్కొన్నాయి.


## రూ.1.33 లక్షల కోట్ల సమీకరణ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:** దేశీయ కార్పొరేట్లు అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల జారీ (క్విప్) ద్వారా మార్చితో ముగిసిన గత ఆర్థిక సంవత్సరం భారీగా నిధులు సమీకరించాయి. ప్రధానంగా దేశీయ స్టాక్ మార్కెట్ల దూకుడు ప్రభావంతో 2024-25లో 85 కంపెనీలు రూ.1,33,251 కోట్లు సమకూర్చుకున్నాయి. ఇది సరికొత్త రికార్డ్ కాగా, అంతకుముందు యేడాదిలో 64 కంపెనీలు క్విప్ ద్వారా అందుకున్న రూ.71,306 కోట్లతో పోలిస్తే ఇవి 87శాతం వృద్ధికావడం విశేషం. ప్రైమ్ డేటాబేస్ గణాంకాల ప్రకారం ఈక్విటీ మార్కెట్ దన్నుతో కంపెనీలు బ్యాలెన్స్ షీట్‌ను పటిష్టపరచుకోవడంతోపాటు విస్తరణకు అవసరమైన నిధులను సమకూర్చుకున్నాయి. వెరసి గతేడాది అటు విలువ లోనూ, ఇటు సంఖ్యలోనూ దేశీయ కార్పొరేట్లు క్విప్ నిధులలో సరికొత్త తెరతీసినట్లు జెఎమ్ ఫైనాన్షియల్ ఈక్విటీ కేపిటల్ మార్కెట్స్ హెడ్ నేహా అగర్వాల్ పేర్కొన్నారు. లిస్టెడ్ కంపెనీలు, ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌లు వేగవంతంగా పెట్టుబడులను సమకూర్చుకునేందుకు క్విప్ మార్గాన్ని ఎంచుకుంటాయి. ప్రధానంగా సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల కేటాయింపుల ద్వారా నిధులు సమీకరించే విషయం విదితమే. ఇందుకు సెబి తదితర మార్కెట్ నియంత్రణ సంస్థలకు ముందస్తుగా దరఖాస్తు చేయవలసిన అవసరం లేకపోవడంతో లిస్టెడ్ కంపెనీలు ఆసక్తి చూపుతుంటాయని విశ్లేషకులు వివరించారు. గతేడాది ప్రధానంగా ప్రభుత్వరంగ బ్యాంకులు, మెటల్స్, ఆటోమొబైల్స్, యుటిలిటీస్, రియల్ ఎస్టేట్ రంగాల కంపెనీలు అధికంగా క్విప్ చేపట్టాయి. నిధుల సమీకరణకు ఈక్విటీ ప్రధాన వనరుగా మారడంతో లిస్టెడ్ కంపెనీలు క్విప్‌నకు ఆసక్తి చూపినట్లు నిపుణులు తెలియచేశారు. తద్వారా వృద్ధి, విస్తరణ, ఇతర కంపెనీల కొనుగోళ్లు తదితరాలకు నిధులను వెచ్చించనున్నట్లు తెలియచేశారు. క్విప్ నిధుల సమీకరణలో డైవర్సిఫైడ్ దిగ్గజం వేదాంత గ్రూప్, ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటో అగ్ర స్థానంలో నిలిచాయి. గత ఆర్థిక సంవత్సరంలో రెండు కంపెనీలు విడిగా రూ.8,500 కోట్లు చొప్పున సమీకరించాయి. ఈ బాటలో అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ రూ.8,373 కోట్లు, వరుణ్ బెవరేజెస్ రూ.7,500 కోట్లు, సంవర్ధన మదర్సన్ ఇంటర్నేషనల్ రూ.6,438 కోట్లు, గోద్రెజ్ ప్రాపర్టీస్ రూ.6,000 కోట్లు, ప్రెస్టీజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్ రూ.5000 కోట్లు చొప్పున అందుకున్నాయి.



## స్విగ్గీకి రూ.158 కోట్ల జిఎస్‌టి నోటీసులు

**ముంబై, ఏప్రిల్ 2:** ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్ ఫామ్ స్విగ్గీకి ఆదాయపు పన్ను శాఖ నుంచి నోటీసులు అందాయి. కస్టమర్ల నుంచి వసూలు చేసిన డెలివరీ ఫీజుకు సంబంధించిన బకాయిలు చెల్లించాల్సి ఉందంటూ ఈ నోటీసులు వచ్చాయి. ఈ విషయాన్ని కంపెనీ ఎక్ఛేంజీఫైలింగ్‌లో పేర్కొంది. మొత్తం రూ.158.25 కోట్ల పన్ను చెల్లించాలని ఆదేశాలు వచ్చినట్లు పేర్కొంది. 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి మధ్య కాలంలో డెలివరీ ఛార్జీలపై జిఎస్‌టి బకాయిలు 158.27 కోట్ల రూపాయలుగా పేర్కొంటూ తమకు నోటీసులు అందాయంటూ స్విగ్గీ పేర్కొంది. అయితే దీనిపై తాము సంబంధిత అధికారుల ముందు అప్పీల్ చేయనున్నట్లు తెలిపింది. ఆదాయపన్ను శాఖ నుంచి వచ్చిన ఆదేశాలు తమ ఆర్థిక కార్యకలాపాలపై ఎలాంటి ప్రభావం చూపవని పేర్కొంది. ఈ నేపథ్యంలో స్విగ్గీ షేర్లు రాణిస్తు న్నాయి. 2.80శాతం లాభంతో 340.85 రూపాయల వద్ద ట్రేడవుతున్నాయి. కాగా స్విగ్గీకి గతంలోనూ ఈ తరహా జిఎస్‌టి బకాయిల నోటీసులు అందాయి.




## లావాదేవీల్లో యుపిఐ నయా రికార్డు

**ముంబై, ఏప్రిల్ 2:** ప్రముఖ యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్(యుపిఐ) ద్వారా లావాదేవీలు మార్చిలో రికార్డు స్థాయిలో రూ.24.77 లక్షల కోట్లకు చేరుకు న్నాయి. ఇది గతనెలతో పోలిస్తే 12.7 శాతం వృద్ధిని నమోదు చేసిందని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన డేటా తెలిపింది. ఫిబ్రవరిలో యుపిఐ లావాదేవీ విలువ రూ.21.96 లక్షల కోట్లుగా ఉంటే మార్చిలో లావాదేవీల విలువ రూ.24.77 లక్షల కోట్లుగా నమోదైందని ఎన్‌పిసిఐ తెలిపింది. గత యేడాది ఇదేనెలలో రూ.19.78 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2025 మార్చిలో రూ.24.8 లక్షల కోట్ల రికార్డు స్థాయిలో యుపిఐ లావాదేవీలు జరిగాయి. గత సంవత్సరంతో పోలిస్తే ఇవి విలువలో 25శాతం పెరుగుదలను, పరిమాణంలో 36శాతం వృద్ధిని నమోదు చేశాయని నిపుణులు చెబుతున్నారు. ఫిబ్రవరిలో యుపిఐ లావాదేవీలతో పోలిస్తేసగటున రోజువారీలావాదేవీలు రూ.79,903 కోట్లుగా నమోదయ్యాయి. ఈ డేటాను మార్చితో పోలిస్తే 1.9 శాతం పెరిగి, వాల్యూమ్‌లు 2.6శాతం పెరిగాయి. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియన్, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ కలిపి తీసుకొచ్చిన ఎన్‌పిసిఐ భారతదేశంలో రిటైల్ చెల్లింపులు, సెటిల్‌మెంట్ వ్యవస్థలను నిర్వహించడంతో కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు.




## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, ఏప్రిల్ 2:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం లాభాల్లో ముగిసాయి. ఐటి, బ్యాంకింగ్ స్టాక్స్ కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ సహా మరికొన్ని దేశాలపై సుంకాలు ప్రకటించనున్న వేళ మన సూచీలు రాణించడం విశేషం. సెన్సెక్స్ 600 పాయింట్లు మేర రాణించగా, నిఫ్టీ 23,300 పాయింట్ల ఎగువన ముగిసింది. సెన్సెక్స్ 76,146.28 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై, ఇంట్రాడేలో 76,064-76,680.35 పాయింట్ల మధ్య కదలాడిన సూచీ, చివరికి 592.93 పాయింట్ల లాభంతో 76,617.44 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 166.35 పాయిం ట్లు లాభపడి 23,332.35 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.85.51గా ఉంది. జొమాటో, టైటాన్ కంపెనీ, ఇండస్ ఇండ్ బ్యాంకు, మారుతి సుజుకి, టెక్ మహీంద్రా వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. నెస్లే ఇండియా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎల్‌అండ్‌టి వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 74.21 డాలర్ల వద్ద, బంగారం ఔన్సు 3163 డాలర్ల వద్ద ట్రేడయింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.